గురువారం
10•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 196
• పేజీలు: 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

ఈబీసీ కోటా బిల్లుకు

రాజ్యసభ ఆమోదం



బుధవారం రాజ్యసభలో ఈబీసీ కోటా బిల్లును ప్రవేశపెడుతున్న కేంద్రమంత్రి గెహ్లాట్

- 165/7 ఓట్లతో రాజ్యాంగ సవరణకు ఆమోద ముద్ర
- అగ్రవర్ణ పేదలకు ఇక 10శాతం రిజర్వేషన్
- బిల్లుపై వాడివేడిగా జరిగిన చర్చ
- ఈబీసీ రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు కూడా వర్తిస్తాయన్న కేంద్రం
- అర్హత పరిమితులను సడలించే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉంటుందని వెల్లడి
- ఓటింగ్ అనంతరం సభ నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 9: ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. మరో మూడు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాలలోని పేదల అభిమానాన్ని పొందే లక్ష్యంతో సంచలనాత్మకంగా తీసుకొచ్చిన 'రాజ్యాంగ (124వ సవరణ) బిల్లు, 2019'కి రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. దాదాపు పది గంటల సుదీర్ఘ చర్చ అనంతరం రాత్రి 10 గంటలకు బిల్లుపై ఓటింగ్ జరిగింది. బిల్లుకు అనుకూలంగా 165 మంది, వ్యతిరేకంగా ఏడుగురు ఓటు వేశారు. ఇది రాజ్యాంగ సవరణ బిల్లు అయినందున ఆర్టికల్ 368 ప్రకారం మూడింట రెండువంతుల మెజార్టీతో

మిగతా 5వ పేజీలో



మహాకూటమిలో చేరబోము

కాంగ్రెస్, బీజేపీతో సమదూరాన్ని కొనసాగిస్తాం

ఒడిశా సీఎం, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ స్పష్టీకరణ

భువనేశ్వర్, జనవరి 9: లోక్‌సభ ఎన్నికలకు ముందు విపక్షాలు ఏర్పాటు చేస్తున్న మహాకూటమిలో బిజూ జనతాదళ్ (బీజేడీ) చేరబోదని, బీజేపీతో గానీ కాంగ్రెస్‌తో గానీ బీజేడీ పొత్తు పెట్టుకోబోదని ఆ పార్టీ అధ్యక్షుడు, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తేల్చి చెప్పారు. భువనేశ్వర్‌లో బుధవారం ఆయన ఓ సమావేశంలో పాల్గొన్న తర్వాత విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్‌తో సమదూరాన్ని పాటించాలన్న విధానాన్ని బీజేడీ కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ ఏడాది జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీతో పోరాడేందుకు

మిగతా 5వ పేజీలో

ఉత్తరాది గాలులతో మళ్లీ ఇగం

- ఆదిలాబాద్ జిల్లా అర్లి(టీ)
- కామారెడ్డి జిల్లా భిక్కనూర్

5 కనిష్ఠం డిగ్రీలు

హైదరాబాద్‌లో 10.9గా నమోదు
చలి తీవ్రతకు ఖమ్మం జిల్లాలో ఒకరు మృతి

3


హైదరాబాద్ శివారులో పొగమంచు

• తెలంగాణ పెద్ద మనసు

అవయవదానాల్లో మనమే టాప్



రెండు, మూడు స్థానాల్లో తమిళనాడు, కర్ణాటక

2

లాట్‌గా లూటీ

- జగిత్యాలలో భారీ చోరీ..
- రెండు సెల్‌ఫోన్ దుకాణాల్లో చొరబడ్డ దొంగలు
- రూ. 33.87 లక్షల విలువైన సెల్ ఫోన్లు అపహరణ

3

కోకాకోలా లాటరీ పేరుతో కోటి టోకరా!

ఢిల్లీలో నైజీరియన్ మోసగాడిని, నాగాలాండ్ యువతిని అరెస్టుచేసిన వరంగల్ పోలీసులు

7

నామినేషన్లు పూర్తి

ముగిసిన పంచాయతీ 'తొలి'ఘట్టం ▪ నేడు పరిశీలన

ఎస్‌ఈసీ మార్గదర్శకాలు ▪ కొనసాగిన ఏకగ్రీవాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలి విడుతలో నామినేషన్ల పర్వం ముగిసింది. మొదటి దశలో 4479 గ్రామాల్లో ఎన్నికలు జరుగనుండగా.. ఈ నెల 7 నుంచి మూడు రోజులపాటు నామినేషన్లు స్వీకరించారు. తొలి రెండ్రోజుల్లో సర్పంచ్ పదవికి 8524, వార్డు సభ్యులకు 20,902 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజైన బుధవారం పెద్దసంఖ్యలో అభ్యర్థులు రిటర్నింగ్ అధికారుల కార్యాలయం వద్ద క్యూ కట్టడంతో అంతా సందడి వాతావరణం నెలకొంది. అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలైనట్టు తెలుస్తున్నది. అదే సమయంలో సర్పంచ్ పదవికి ఒకే నామినేషన్ రావడంతో పెద్దసంఖ్యలో గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. వీటిని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. దాఖలైన నామినేషన్లను గురువారం పరిశీలించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) మార్గదర్శకాలు జారీచేసింది. ఎన్నికల సంఘం నోటీసులో నిర్దేశించిన తేదీ, ప్రదేశం, సమయం ప్రకారం రిటర్నింగ్ అధికారులకు అందించిన నామినేషన్లను వరుస సంఖ్యలో ఒకదాని తర్వాత మరొకటి తనిఖీచేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. నామినేషన్లను రిటర్నింగ్ అధికారులే తనిఖీ చేయాలని, అనివార్య పరిస్థితుల్లో ఆర్వోలు లేకుంటే.. అసిస్టెంట్ ఆర్వోలు పరిశీలించాలని సూచించారు. నామినేషన్ల పరిశీలన సమయంలో సదరు అభ్యర్థి లేదా అతని ప్రతిపాదకుడు లేదా అభ్యర్థి రాతపూర్వకంగా అధికారమిచ్చిన మరో వ్యక్తికి మాత్రమే అనుమతివ్వాలని పేర్కొన్నారు. ఆర్వోలతోపాటు ముగ్గురు వ్యక్తులు దాఖలైన నామినేషన్లను నిశితంగా పరిశీలించవచ్చని తెలిపారు.

ఇలా ఉంటే తిరస్కారమే..

నామినేషన్లను నిర్దిష్ట సమయంలో దాఖలుచేయకున్నా, నామినేషన్ పత్రాన్ని ఆర్వో, ఆయన అధికారమిచ్చిన

మిగతా 9వ పేజీలో

రైతుబీమా జమ 276 కోట్లు

5,525 కుటుంబాలకు రైతుబీమా వర్తింపు

బాధిత కుటుంబసభ్యుల ఖాతాల్లోకి 5 లక్షల చొప్పున సొమ్ము

కొత్త పాస్‌పుస్తకం పొందినవారి వివరాలూ సేకరణ

రైతుబీమాపై వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వివిధ కారణాలతో మృతిచెందిన 5,525 మంది రైతుల కుటుంబాల ఖాతాల్లో రూ.276.26 కోట్లు జమచేసినట్టు వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి తెలిపారు. రైతుబీమా పథకం అమల్లోకి వచ్చిన తర్వాత మృతిచెందిన 5,821 మంది రైతుల వివరాలు ఎల్‌ఐసీ వద్ద నమోదయ్యాయని చెప్పారు. ఇందులో 5,525 మందికి చెందిన నామినీల బ్యాంకు ఖాతాల్లో రూ.5 లక్షల చొప్పున జమచేసినట్టు తెలిపారు. మిగిలిన 296 మంది రైతుల కుటుంబాలకు కూడా త్వరగా బీమా చెల్లించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో ఆయన రైతుబీమా అమలుపై ఎల్‌ఐసీ, వ్యవసాయశాఖ

మిగతా 2వ పేజీలో



బుధవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న కొత్తగా నియమితులైన రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్, టీఎస్‌ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, టీఎస్‌ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు కూడా ఉన్నారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టుకు అటవీ, పర్యావరణ అనుమతులు సాధించినందుకు బుధవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేస్తున్న ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్. చిత్రంలో ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ కూడా ఉన్నారు.



నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య తన పుట్టినరోజు సందర్భంగా బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలుసుకోగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం. చిత్రంలో ఎమ్మెల్యేలు దయాకర్‌రావు, ప్రశాంత్‌రెడ్డి కూడా ఉన్నారు.

ఢిల్లీకి వెళ్లిన గవర్నర్

నేడు ప్రధాని, రాష్ట్రపతి, హోంమంత్రితో భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ బుధవారం ఢిల్లీకి వెళ్లారు. ఆయన గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌లను కలిసి పలు అంశాలపై చర్చిస్తారని తెలిసింది. హైకోర్టు విభజన అనంతరం పరిస్థితి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై గవర్నర్ నివేదిక సమర్పించే అవకాశమున్నది. గవర్నర్ల వ్యవస్థలో సంస్కరణల అధ్యయనం కోసం నియమించిన కమిటీలో సీనియర్ గవర్నర్‌గా కీలక పాత్ర వహిస్తున్న నరసింహన్.. రాష్ట్రపతితో కమిటీ నివేదిక విషయంపై చర్చిస్తారని సమాచారం.

తెలంగాణ రిజర్వేషన్ల సంగతేంటి?

- రిజర్వేషన్ల అమలు అధికారం రాష్ట్రాలకివ్వాలి
- దేశవ్యాప్తంగా ఒకే విధానం ఉండాలి
- టీఆర్‌ఎస్ ఎంపీ బండా ప్రకాశ్ డిమాండ్
- రాజ్యసభలో ఈబీసీ బిల్లుకు మద్దతు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రిజర్వేషన్లు అమలుచేసుకొనే అధికారం రాష్ట్రాలకే అప్పగించాలని టీఆర్‌ఎస్ ఎంపీ బండా ప్రకాశ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంచేసిన రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ తరపున బిల్లుకు మద్దతు ప్రకటించారు. అయితే.. అగ్రవర్ణాల్లోని పేదలు ప్రత్యేకంగా రిజర్వేషన్లు డిమాండ్ చేసే పరిస్థితి దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీ కారణంగానే వచ్చిందని చెప్పారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని, కానీ.. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాలుగా రిజర్వేషన్లు ఉన్నాయని గుర్తుచేశారు. హర్యానాలో 70% మహారాష్ట్రలో 68%, జార్ఖండ్‌లో 60%, రాజస్థాన్‌లో 54%, తమిళనాడులో 69%, ఈశాన్య రాష్ట్రాల్లో 80% రిజర్వేషన్లు అమలవుతుంటే.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 50% రిజర్వేషన్లే ఉన్నాయని చెప్పారు. దేశమంతటా రిజర్వేషన్లు ఒకేవిధంగా ఉండేలా కేంద్రం ఒక పాలసీ తీసుకురావాలని, లేకుంటే రిజర్వేషన్లు కల్పించుకునే అధికారాన్ని రాష్ట్రాలకు బదలాయించాలని డిమాండ్‌చేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో ఎస్టీ, ముస్లిం జనాభా పెరిగిందన్న ప్రకాశ్.. ఈ మేరకు ఎస్టీలకు 10%, ముస్లింలకు 12% రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీ తీర్మానం చేసి పంపిన విషయాన్ని ప్రస్తావించారు. దీనిపై తెలంగాణ అనేకమార్లు కోరినా కేంద్రం అనుమతించడంలేదని విమర్శించారు. ప్రధాని మోదీని తమ ముఖ్యమంత్రి కలిసి విన్నవించినా, అనేక సందర్భాల్లో తమ పార్టీ ఎంపీలందరూ పార్లమెంటులో నిరసన తెలిపినా స్పందన లేదని ఆరోపించారు. జనాభా రీత్యా తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు 90.65% శాతం ఉన్నారని తమ సీఎం కేసీఆర్ అనేకమార్లు అసెంబ్లీలో చెప్పారని, ఇక మిగిలిన 9.35% మాత్రమే అగ్రవర్ణాల ప్రజలు ఉన్నారని తెలిపారు. కేంద్రం మాత్రం అగ్రవర్ణాలకు 10% రిజర్వేషన్లు కల్పిస్తున్నదన్నారు. ఇతర సామాజికవర్గాల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్‌కు వెసులుబాటు కల్పించాలని ప్రకాశ్ కోరారు. ఇటువంటి బిల్లులు తెచ్చేముందు తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన రిజర్వేషన్ల బిల్లులను కేంద్రం దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్లు కల్పించే బిల్లు ఇప్పటివరకు ఎందుకు పెండింగ్‌లో ఉందని ఆయన కేంద్రాన్ని నిలదీశారు. దీనికి మద్దతుగా కూడా తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి పంపించిందన్నారు.



తెలంగాణలో మహిళలకు 50% రిజర్వేషన్లు

స్థానిక సంస్థల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పిస్తున్నది తెలంగాణనే అన్నారు. తెలంగాణలో అగ్రవర్ణాల్లోని పేదలకు రిజర్వేషన్లు లేకున్నా.. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను చెల్లిస్తున్నదని చెప్పారు. విదేశాల్లో విద్యను అభ్యసిస్తే రూ.20 లక్షలు అందిస్తున్నదన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో కూడా ఈబీసీ విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తున్నామని ప్రకాశ్ చెప్పారు. తెలంగాణలో నామినేటెడ్ పోస్టులకు రిజర్వేషన్లు అమలుచేస్తున్నామని, మార్కెట్‌కమిటీ చైర్మన్ల విషయంలో కోటా పాటిస్తున్నామని చెప్పారు. బీసీలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం తీర్మానించి పంపించినా.. కేంద్రం ఆమోదించలేదన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటుచేయాలని అనేకమార్లు వినతిపత్రం ఇచ్చినా.. ఇంతవరకు స్పందించలేదని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లయినా 60 కోట్ల జనాభా ఉన్న బీసీలకు కేంద్రంలో ప్రత్యేకశాఖ లేకపోవడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతం దాటవద్దని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో బీసీలకు రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గాయని వివరించారు.

తెలంగాణ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలి

- అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ మంచిదే
- కానీ.. హడావుడిగా నిర్ణయించారు
- మోదీ వ్యతిరేక కూటమిలో బాబు చేరారు.
- టీఆర్‌ఎస్ ఎంపీ వినోద్‌కుమార్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర విభజన తరువాత తెలంగాణలో వివిధ వర్గాల జనాభా శాతాల్లో మార్పు ఉన్నందున దానికి అనుగుణంగా ఆయా సామాజికవర్గాలకు రిజర్వేషన్లు పెంచాలని టీఆర్‌ఎస్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఢిల్లీలో బుధవారం ఎంపీ బీబీ పాటిల్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత గిరిజనుల జనాభా ఆరు శాతం నుంచి 10 శాతానికి పెరిగిందని, బీసీ-ఈ సామాజిక వర్గాల జనాభా 37 శాతానికి పెరిగిందని చెప్పారు. అందుకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిస్తే సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి ఆపారని అన్నారు. సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు 50% మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పు చట్టంతో సమానం కాబట్టి దాన్ని కూడా సవరించాలని కోరుతున్నామని వినోద్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన రిజర్వేషన్లు రాష్ట్రపతి ఆమోదానికి పంపించాలని, రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్‌చేశారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనైనా ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. చిత్తశుద్ధి ఉంటే సమయం అవసరంలేదన్న వినోద్.. రాజకీయ అవసరాలు ఉండాలనేది కేంద్ర ప్రభుత్వం ఉద్దేశంగా కనిపిస్తున్నదని వ్యాఖ్యానించారు. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు ఇవ్వడం మంచి నిర్ణయమే అయినా.. హడావుడిగా తీసుకున్నారని వినోద్ అన్నారు. తాజా నిర్ణయంతో అన్నివర్గాలకు రిజర్వేషన్లు కల్పించినట్టు అయిందని చెప్పారు. దీనికి న్యాయపరంగా కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తానే కొత్తగా కూటమి ఏర్పాటు చేస్తున్నట్టు ప్రచారం చేస్తున్నారని, వాస్తవానికి ఇప్పటికే మోదీకి వ్యతిరేకంగా ఉన్న కూటమిలో చంద్రబాబే వచ్చి చేరారని ఎద్దేవా చేశారు.

'రైల్వే ప్రాజెక్టులు పూర్తిచేయాలి'

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిర్దేశిత లక్ష్యంలోగా రైల్వే ప్రాజెక్టుల పనులు పూర్తి చేయాలని రైల్వేబోర్డు చైర్మన్ వినోద్‌కుమార్‌యాదవ్ ఆదేశించారు. ఇండియన్ జోనల్ రైల్వే అధికారులతో ఢిల్లీ నుంచి ఆయన వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కొత్తరైలు మార్గాల నిర్మాణం, గేజ్ మార్పిడులు, డబ్లింగ్, బైపాస్ పనులు, యార్డుల ఆధునీకరణ పనుల పురోగతిపై జోన్ జనరల్ మేనేజర్లను అడిగి తెలుసుకున్నారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.52 గంటలకు



సూర్యాస్తమయం: 5.55 గంటలకు

విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం చతుర్థి సాయంత్రం 5.24 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: శతభిషం, అమృతఘడియలు: రాత్రి 9.48 నుంచి 11.24 వరకు, రాహుకాలం మధ్యాహ్నం 1.46 నుంచి 3.09 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 2.58 నుంచి సాయంత్రం 5.26 వరకు, వర్జ్యం: ఉదయం 10.58 నుంచి మధ్యాహ్నం 12.34 వరకు.


లోకం పోకడ



మీ ఆయన పాటలు పాడి గెలుస్తాడంటే, జనాలను చైతన్య పరిచే పాటలనుకున్నా గానీ, ఇలా వేలం పాటలు అనుకోలేదు!

చెన్నై తాగునీటికి రెండు టీఎంసీలు

- కృష్ణాబోర్డు సమావేశంలో ఏపీ అంగీకారం
- నీటి సరఫరాకు తెలంగాణ సుముఖత
- ట్రిబ్యునల్ పేరానే లోపభూయిష్టమన్న మహారాష్ట్ర
- భేటీకి డుమ్మాకొట్టిన కర్ణాటక అధికారులు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చెన్నై తాగునీటి అవసరాల కోసం కృష్ణాజలాల నుంచి రెండు టీఎంసీలు సరఫరా చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ఎట్టకేలకు అంగీకరించింది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం చెన్నై తాగునీటి కోసం కృష్ణా బేసిన్‌లోని రాష్ట్రాలు ఏటా 15 టీఎంసీలు ఇవ్వాల్సి ఉండగా.. నాలుగైదు టీఎంసీలతోనే సరిపెడుతున్నాయంటూ తమిళనాడు ఆవేదన వ్యక్తంచేసింది. ఈ విషయంపై పదేపదే మొరపెట్టుకోవడంతో సమస్య పరిష్కారానికి చొరవచూపిన కేంద్రం.. కృష్ణాబోర్డును పురమాయించింది. ఈ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్ జలసౌధలోని కృష్ణాబోర్డు కార్యాలయంలో బోర్డు చైర్మన్ జైన్ అధ్యక్షతన సమావేశం కొనసాగింది. ఈ భేటీకి కర్ణాటక డుమ్మాకొట్టింది. తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర తమ అభిప్రాయాలు తెలిపాయి. చెన్నై తాగునీటి కోసం రా వాటర్ (ముడి నీరు)ను సేకరించే పూండి జలాశయం వద్దకు ఈ ఏడాది 1.76 టీఎంసీలు మాత్రమే వచ్చాయని తమిళనాడు జలవనరులశాఖ ఈఎన్సీ భక్తవత్సలం ఆవేదన వ్యక్తంచేశారు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం తమకు ఏడాదికి 15 టీఎంసీలు రావాలని, అందులో కర్ణాటక, ఉమ్మడి ఏపీ, మహారాష్ట్ర ఐదు టీఎంసీల చొప్పున ఇవ్వాల్సి ఉన్నదని చెప్పారు. ట్రిబ్యునల్ ప్రకారం ఉమ్మడి ఏపీ వాటా ఐదు టీఎంసీలు కాగా.. అందులో తెలంగాణకు సంబంధించి సుమారు 1.67 టీఎంసీల వాటా ఉన్నదని పేర్కొన్నారు. ఇప్పటికే చెన్నై తాగునీటి కింద తమవాటా నుంచి 0.471 టీఎంసీలు మినహాయించారని, మిగిలిన నీటిని కూడా సరఫరాచేసి తమ వాటాలో నుంచి మినహాయించుకోవచ్చని స్పష్టంచేశారు. మహారాష్ట్ర మాత్రం బచావత్ ట్రిబ్యునల్‌లో చెన్నై తాగునీటికి సంబంధించిన పేరా లోపభూయిష్టంగా ఉన్నదని పేర్కొన్నది. మిగులుజలాలు ఉన్నపుడే ఐదు టీఎంసీలు ఇవ్వాలని బచావత్ ట్రిబ్యునల్‌లో ఉన్నదని, నీటి కొరత (డెఫిసిటీ) సమయంలో ఇవ్వాలని లేదంటూ ఆ రాష్ట్ర చీఫ్ ఇంజినీర్ ముండే తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని ఇవ్వలేమంటూ చేతులెత్తేశారు.

మా సీఎం ఇవ్వొద్దన్నారు: ఏపీ ఈఎన్సీ

శ్రీశైలం నుంచి తెలుగుగంగ ద్వారా చెన్నైకి నీటిని సరఫరాచేయాల్సి ఉన్నది. ప్రస్తుత పరిస్థితుల్లో తాము నీళ్లివ్వలేమని ఏపీ తరపున హాజరైన తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ మురళీనాథ్‌రెడ్డి తెలిపారు. సీఎం చంద్రబాబు ఎవరికీ నీళ్లియ్యొద్దన్నారని, అసలే సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించినట్టు సమాచారం. కండలేరులో ప్రస్తుతం సుమారు 7.8 టీఎంసీల నీటినిల్వ ఉన్నప్పటికీ ఇక్కడినుంచి నీటిని వదిలితే.. 150 కిలోమీటర్ల దూరంలోని పూండి (చెన్నై సమీపంలోని రిజర్వాయర్)కి వెళ్లేవరకు మధ్యలో రైతులే తమ పొలాలకు మళ్లించుకుంటారని అభిప్రాయపడ్డారు. నీటిని విడుదల చేయకపోతే చాలా ఇబ్బంది ఉంటుందని తమిళనాడు అధికారులు పేర్కొనడంతో.. బోర్డు చైర్మన్ ఏపీపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో మార్చి వరకు రెండు టీఎంసీలను విడుదల చేసేందుకు ఏపీ చీఫ్ ఇంజినీర్ అంగీకరించారు. సమావేశంలో బోర్డు సభ్యకార్యదర్శి పరమేశం తదితరులు పాల్గొన్నారు.

అవయవదానాల్లో మనమే టాప్

- 2018లో 160 కేసుల్లో అవయవాల సేకరణ
- రెండు, మూడు స్థానాల్లో తమిళనాడు, కర్ణాటక
- టైమ్స్ ఆఫ్ ఇండియా పరిశీలనలో వెల్లడి
- ఒక బ్రెయిన్‌డెడ్ కేసులో నలుగురైదుగురికి ప్రాణదానం
- సాధారణ మృతుల్లో నేత్రాల సేకరణకు అవకాశం

తెలంగాణ పెద్ద మనసు




హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అన్నదానాన్ని మించిన దానం లేదని పాత సూక్తి! అవయవదానాన్ని మించిన దానం లేదనేది కొత్త స్ఫూర్తి! ఒక మనిషి మరణించిన తర్వాత ఆ మనిషి అవయవాలను దానంచేస్తే కనీసం నలుగురైదుగురి ప్రాణాలు నిలబెట్టవచ్చు! ఇద్దరికి చూపు ప్రసాదించవచ్చు. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రం తన గొప్ప మనసు చాటుకుని.. ఉత్తమంగా నిలిచింది. అవయవాదానాల విషయంలో వివిధ రాష్ట్రాల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఆంగ్ల దినపత్రిక ఒక వార్తా కథనాన్ని ప్రచురించింది. ఇందులో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణలో 2018 సంవత్సరంలో 160 మంది బ్రెయిన్‌డెడ్ పేషెంట్ల నుంచి కీలక అవయవాలు సేకరిస్తే.. రెండోస్థానంలో తమిళనాడు (140), మూడో స్థానంలో మహారాష్ట్ర (135), నాలుగో స్థానంలో కర్ణాటక (90) నిలిచాయి. గతంలో ఈ విషయంలో తమిళనాడు అగ్రస్థానంలో ఉంటే.. ఈసారి తెలంగాణ మొదటిస్థానానికి ఎగబాకింది. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు పెరుగుదల సాధించాయి. తమిళనాడు, కేరళలో అవయవ దానాలు తగ్గుముఖం పట్టాయి.

ప్రజల్లో చైతన్యం కల్పించడమే అత్యంత ముఖ్యం

మనిషి చనిపోయాక సాధారణంగా ఆయా మత, కుల విశ్వాసాలకు అనుగుణంగా భౌతికకాయాన్ని దహనం లేదా ఖననం చేస్తుంటారు. కానీ, అటువంటివారి నుంచి నేత్రాలు దానంచేస్తే ఇద్దరికి కంటిచూపు ప్రసాదించవచ్చు. అదే బ్రెయిన్‌డెడ్ వంటి కేసుల్లో అయితే నేత్రాలతోపాటు గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలువంటివి సేకరించి, సదరు అవయవాలు పాడైపోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సరైన సమయంలో అమర్చగలిగితే వారికి కొత్త జీవితం ప్రసాదించవచ్చు. ఇవేకాదు.. జీర్ణకోశం, చేతులు, పేగులు, చర్మం, ఎముకలు వంటివి ట్రాన్స్‌ప్లాంట్ చేసే అవకాశాలు ఉంటాయి. ఈ విషయంలో సదరు బ్రెయిన్‌డెడ్ మృతుని బంధువులను ఒప్పించడం కీలకంగా ఉంటుంది. అత్యంత ప్రీతిపాత్రులను కోల్పోవటం తీర్చలేని లోటే. కానీ, సదరు వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో మరో నలుగురికి కొత్త జీవితం బహూకరించినట్టు అవుతుంది. కీలక అవయవాలు వృథాగా మట్టిలో కలిసిపోవడమో లేక బూడిదగా మిగులడమో కాకుండా.. మరో నలుగురికి ప్రాణంపోయగలిగే ఈ 'జీవన దానం' సమకాలీన పరిస్థితుల్లో అత్యంత కీలకంగా మారింది. ఇందులో తెలంగాణ అగ్రభాగాన నిలువడం విశేషం.

రాష్ట్రంలో మామిడి ఎగుమతులకు ఊతం

- హాట్‌వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నెలకొల్పనున్న ప్రభుత్వం
- యూనిట్ ధర రూ.30 లక్షలు.. 50% నుంచి 90% సబ్సిడీ
- ప్లాంట్లు లేకపోవడంతో విదేశాలకు నోచుకోని ఎగుమతులు
- ప్రత్యేక దృష్టిపెట్టాలని వ్యవసాయాధికారులకు సీఎం ఆదేశం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మామిడి ఎగుమతులను గణనీయంగా పెంచాలని భావిస్తున్న ప్రభుత్వం.. అందుకు వీలుగా హాట్‌వాటర్ (వేడినీటి) ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నెలకొల్పనున్నది. రాష్ట్రంలో పండించిన మామిడికాయలపై టెంకపురుగు, లార్వా ఉంటున్నందున వాటిని వివిధదేశాలు అనుమతించడం లేదు. కాయలను హాట్‌వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో శుద్ధిచేస్తే లార్వాలు తొలిగిపోతాయి. ఇటువంటి యూనిట్ ఒక్కదానికి రూ.30 లక్షలు అవుతుందని అంచనా. ఇందులో ఎస్సీ, ఎస్టీలకు 90% వరకు, మిగిలినవారికి 50% నుంచి 75% వరకు సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఇటీవల వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో హాట్‌వాటర్ ప్లాంట్లపై సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా ప్రస్తావించారని సమాచారం. రాష్ట్రంలో ఇటువంటి ప్లాంట్లు లేకపోవడంతో వాటిని ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది.

నాణ్యతలేక మామిడి ఎగుమతులకు దెబ్బ

రాష్ట్రంలో 4.17 లక్షల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఏడాదికి 4.80 లక్షల టన్నుల దిగుబడి వస్తున్నది. ప్రధానంగా నాగర్‌కర్నూలు, మంచిర్యాల, మహబూబాబాద్, ఖమ్మం, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి తదితర జిల్లాల నుంచి వివిధ రాష్ట్రాలకు మామిడి కాయలు ఎగుమతి అవుతున్నాయి. కానీ, విదేశాలకు వెయ్యి టన్నులు కూడా ఎగుమతి కావడం లేదు. దీంతో రైతులు ఆదాయం గడించలేకపోతున్నారు. కొందరు ప్రయత్నించినా.. విమానాశ్రయం వద్దనే 90%పైగా తిరస్కరణకు గురవుతున్నాయి. శుద్ధిచేయని మామిడిపై టెంక పురుగు, లార్వా, పురుగుమందుల అవశేషాలు ఉండటంతో మధ్య ఆసియా, జపాన్ వంటి దేశాలు తిరస్కరిస్తున్నాయి. హాట్‌వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో వీటిని శుద్ధిచేస్తే విదేశాలకు ఎగుమతిచేసే అర్హత లభిస్తుంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో హాట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నెలకొల్పాలన్న సీఎం ఆదేశాలతో వ్యవసాయ, ఉద్యానశాఖవర్గాలు అధ్యయనంచేస్తున్నాయి. ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు త్వరలోనే మార్గదర్శకాలు ఖరారుచేసే అవకాశాలున్నాయి.

ఇంటీరియర్ డెకరేషన్‌లో 23 నుంచి శిక్షణ

- టెన్త్ ఉత్తీర్ణులైన యువతులు మాత్రమే శిక్షణకు అర్హులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జనవరి 23 నుంచి ఫిబ్రవరి 12 వరకు ఇంటీరియర్ డెకరేషన్‌లో శిక్షణ నిర్వహిస్తున్నట్టు హోంసైన్స్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. 15 ఏండ్లు పైబడి పదో తరగతి, ఆపైన విద్యార్హతలున్న యువతులు మాత్రమే ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు 040-23244058 (211) ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.



బుధవారం సచివాలయంలో రైతుబీమాపై వ్యవసాయశాఖ, ఎల్ఐసీ అధికారులతో చర్చిస్తున్న ఆ శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి

రైతుబీమా జమ 276 కోట్లు

మొదటిపేజీ తరువాయి...

అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతు మృతిచెందితే వ్యవసాయాధికారులు ఎల్ఐసీ నోడల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు డాటా అప్‌లోడ్ చేసి, బాధిత కుటుంబాలకు తక్షణమే సహాయం అందేలా పనిచేయాలని సూచించారు. నామినీ బ్యాంకు అకౌంట్లకు సంబంధించి తలెత్తే సమస్యల పరిష్కారానికి త్వరలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. డాటా అప్‌డేట్‌చేసే సందర్భంగా ఎడిట్ ఆప్షన్‌ను పొందుపర్చాలని ఎల్ఐసీ అధికారులను కోరారు. కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పొందినవారి వివరాలను కూడా రైతుబీమాకు సేకరించి.. 2019-20లో ఈ పథకం అమలుకు అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందించనున్నట్టు వివరించారు. సమావేశంలో వ్యవసాయశాఖ అదనపు కమిషనర్ విజయ్‌కుమార్, ఎల్ఐసీ రీజినల్ మేనేజర్ చందర్, వ్యవసాయశాఖ, ఎల్ఐసీ అధికారులు పాల్గొన్నారు.

సాయికృష్ణ కుటుంబానికి 10 లక్షల సాయం

- ఇటీవల అమెరికాలో దుండగుల కాల్పుల్లో గాయపడిన మహబూబాబాద్ విద్యార్థి
- ప్రభుత్వం తరపున అందించిన అధికారులు



బుధవారం ప్రగతిభవన్‌లో అధికారులు అందించిన చెక్కును చూపుతున్న సాయికృష్ణ తల్లిదండ్రులు ఎల్లయ్య, శైలజ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అమెరికాలో దుండగుల చేతిలో కాల్పులకుగురై చికిత్స పొందుతున్న మహబూబాబాద్‌కు చెందిన విద్యార్థి సాయికృష్ణ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించింది. బుధవారం బేగంపేటలోని ప్రగతిభవన్‌లో అధికారులు చెక్కును సాయికృష్ణ తల్లిదండ్రులు ఎల్లయ్య, శైలజకు అందించారు. విద్యార్థి తల్లిదండ్రులు అమెరికా వెళ్లడానికి, అక్కడ చికిత్సకు అవసరమైన సాయాన్ని అందించాలని సాయికృష్ణ తల్లిదండ్రులు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మంగళవారం కలిసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారికి సాయం చేయాలని సీఎంవో అధికారులను కేటీఆర్ కోరారు. దీంతో రూ.10 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అమెరికా వెళ్లేందుకు అవసరమైన వీసాను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. ఒకటి రెండు రోజుల్లో వారు అమెరికా బయలుదేరనున్నారు. వీసా మంజూరు చేసేందుకు ఎంపీ సీతారాంనాయక్ కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్‌ను కలిశారు. వీసా మంజూరు చేయాలని అమెరికా కాన్సుల్ జర్నల్ కేథరిన్ హడ్డాతో ఇప్పటికే టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్లో మాట్లాడారు.



సంక్రాంతి పండుగకు పట్నం పల్లె బాట పట్టింది. పండుగ వారం రోజులే ఉండటంతో సొంతూళ్లకు వెళ్లేవారితో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. తెలంగాణలోని పలు జిల్లాలతోపాటు ఏపీకి వెళ్లేందుకు బుధవారం సికింద్రాబాద్‌లోని రైల్వే స్టేషన్‌కు భారీగా ప్రజలు తరలిరావడంతో కిక్కిరిసిపోయిన దృశ్యం.

సంక్రాంతికి 31 జనసదరన్ ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంక్రాంతి సందర్భంగా 31 జనసదరన్ ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. బుధవారం ఆయా రైళ్ల వివరాలను ప్రకటించారు. సికింద్రాబాద్- తిరుపతి, తిరుపతి- కాకినాడ, విజయవాడ, విజయనగరం వరకు ఈ రైళ్లు నడుస్తాయి. సికింద్రాబాద్- విజయవాడ, హైదరాబాద్- సికింద్రాబాద్, విజయవాడల మీదుగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతాయి. ఈ రైళ్లలో అన్‌రిజర్వ్‌డ్ కోచ్‌లుంటాయని, ప్రత్యేక రుసుములు చెల్లించకుండా సాధారణ టికెట్ల రేట్లతోనే ప్రయాణం చేయవచ్చని పేర్కొన్నది. ప్రత్యేక రైళ్లు సికింద్రాబాద్ నుంచి రాత్రి 11.30 గంటలకు ఈ నెల 11, 12, 13, 15, 16, 17, 18, 19 తేదీల్లో బయలుదేరి ఉదయం 3 గంటలకు విజయవాడకు చేరుకుంటాయి. నల్లగొండ, మిర్యాలగూడ స్టేషన్లలో ఆగుతాయి. విజయవాడ నుంచి తిరిగి సికింద్రాబాద్‌కు ఈనెల 12, 13, 14, 16, 17, 18, 19, 20 తేదీల్లో నడుస్తాయి.

నేటి నుంచి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు

- 18న ఉత్సవమూర్తుల ఊరేగింపుతో ముగింపు

భీమదేవరపల్లి: వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండలో వెలిసిన వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్నాయి. గురువారం సాయంత్రం స్వామివారి కల్యాణం ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 14న భోగి, 15 సంక్రాంతి పర్వదినాన బండ్లు తిరుగుట, 16న నాగవెల్లి వసంతోత్సవం, 17న త్రిశూల స్నానం, 18 తెల్లవారుజామున అగ్నిగుండాలు, అదేరోజు సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తుల ఊరేగింపుతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. కరీంనగర్, వరంగల్, మెదక్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరవుతారు. కోరిన కోరికలు తీరుస్తాడనే నమ్మకంతో భక్తులు స్వామివారికి కోరమీసాలు సమర్పించడం ఈ ఆలయంలో ఆనవాయితీగా వస్తున్నది. ఆలయం ఆవరణలో ఉన్న రుద్రాక్ష చెట్టు నుంచి రాలిపడే రుద్రాక్షలను పొందేందుకు భక్తులు ఎదురుచూస్తుంటారు.



మళ్లీ వణికిస్తున్న చలి

- తెలంగాణవైపు దిశ మార్చుకున్న ఉత్తరాది శీతలగాలులు
- ఆదిలాబాద్ జిల్లా అర్లి(టీ), కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లో 5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- చలి తీవ్రతకు ఖమ్మం జిల్లాలో ఒకరు మృతి

హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రంపై చలి మళ్లీ పంజా విసురుతున్నది. ఈశాన్య గాలుల ప్రభావం తగ్గడం, ఉత్తరాది శీతలగాలులు తిరిగి తెలంగాణవైపు దిశను మార్చుకోవడంతో రాష్ట్రంలో చలి తీవ్రత మళ్లీ పెరిగిందని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారి రాజారావు వెల్లడించారు. ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నట్టు చెప్పారు. గత 48గంటల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణస్థాయి కంటే నాలుగు డిగ్రీలవరకు తగ్గడం విశేషం. ఏజెన్సీ ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత తక్కువగా నమోదవుతున్నాయి. బుధవారం ఆదిలాబాద్ జిల్లా అర్లి(టీ), కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లో 5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ 5.2, సంగారెడ్డి జిల్లా అల్గోల్ 5.4, ఆదిలాబాద్ జిల్లా బేల 5.6, బజార్‌హత్నూర్ 6, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి, లింగాపూర్ 6.1, కామారెడ్డి జిల్లా లచ్చపేటలో 6.2 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాగల 24గంటల్లో ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో చలిగాలులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి తెలిపారు. మరో మూడు రోజులవరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశమున్నట్టు వెల్లడించారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం ఎడ్ల బంజరు గ్రామానికి చెందిన ఉసిరిశెట్టి ధనమ్మ (78) చలికి తట్టుకోలేక మృతిచెందారు.



ఉత్తరాదినుంచి వీస్తున్న శీతలగాలులతో రాష్ట్రవ్యాప్తంగా తెల్లవారుజామున మంచుదుప్పటి కప్పేస్తున్నది. బుధవారం ఉదయం హైదరాబాద్ నగర శివార్లలో కురుస్తున్న మంచులో గంగిరెద్దులను తోలుకెళ్తున్న దృశ్యం.



బుధవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చలి మంట కాగుతున్న ప్రజలు

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం	జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం	జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
			కరీంనగర్	8.4	37.0	నిర్మల్	11.0	31.0
			జగిత్యాల	8.4	37.0	కామారెడ్డి	11.0	31.0
సంగారెడ్డి	5.4	32.5	మహబూబాబాద్	8.5	35.5	నిజామాబాద్	11.9	28.1
సిద్దిపేట	6.2	32.9	జనగామ	8.6	33.7	జయశంకర్	12.0	28.0
ఆదిలాబాద్	6.4	26.9	నాగర్‌కర్నూల్	8.6	34.6	రాజన్న సిరిసిల్ల	12.0	29.0
ఆసిఫాబాద్	6.5	26.4	యాదాద్రి	9.4	33.0	వనపర్తి	12.8	34.6
మంచిర్యాల	6.5	26.4	వరంగల్ రూరల్	10.0	30.0	సూర్యాపేట	13.0	30.0
మెదక్	6.8	33.5	వరంగల్ అర్బన్	10.5	28.5	భద్రాద్రి కొత్తగూడెం	13.0	31.0
వికారాబాద్	6.9	22.0	పెద్దపల్లి	10.6	28.4	రంగారెడ్డి	14.0	29.0
మేడ్చల్	7.8	29.5	జోగుళాంబ గద్వాల	10.6	34.6	ఖమ్మం	14.0	31.0
మహబూబ్‌నగర్	8.3	35.5	హైదరాబాద్	10.9	29.2	నల్లగొండ	15.0	29.0

గణతంత్ర వేడుకలకు భారీగా ఏర్పాట్లు



సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ ఎస్కే జోషి

- చారిత్రక ప్రాధాన్య భవనాలను విద్యుద్దీపాలతో అలంకరించండి
- అధికారులకు సూచించిన సీఎస్ ఎస్కే జోషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గణతంత్ర వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అన్ని శాఖల ముఖ్య అధికారులను సీఎస్ ఎస్కే జోషి ఆదేశించారు. ఈమేరకు బుధవారం సచివాలయంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లోని వేడుకల ఏర్పాట్లపై వివిధశాఖల ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్షించారు. జనవరి 26న ఉదయం పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించే గణతంత్ర వేడుకల్లో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, బందోబస్తు ఏర్పాట్లతోపాటు ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాట్లుచేయాలని పోలీసుశాఖను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ద్వారా పరేడ్ గ్రౌండ్స్‌లో పారిశుద్ధ్యం, మొబైల్ టాయిలెట్లు తదితర ఏర్పాట్లు చేపట్టాలని, గన్‌పార్క్, క్లాక్‌టవర్, ఫతేమైదాన్‌లను విద్యుదీకరించాలని సూచించారు. రహదారులు, భవనాలశాఖ ద్వారా అవసరమైన బారికేడింగ్, సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. రాజ్‌భవన్, సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, చార్మినార్‌తోపాటు చారిత్రక ప్రాధాన్యం ఉన్న భవనాలను విద్యుద్దీపాలతో అలంకరించాలని తెలిపారు. విద్యుత్‌శాఖ ద్వారా నిరంతర విద్యుత్ సరఫరా, మెట్రో వాటర్‌వర్క్స్ ద్వారా మంచినీటి సరఫరా, సమాచారశాఖ ద్వారా మీడియాకు ఏర్పాట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, ఎల్‌ఈడీటీవీలు, వ్యాఖ్యాతల నియామకం, వేడుకల ప్రత్యక్షప్రసారానికి తగ్గ ఏర్పాట్లు చేయాలన్నారు. ఉద్యానశాఖ ద్వారా పరేడ్‌గ్రౌండ్‌ను పుష్పాలతో అలంకరణ వినూత్నంగా ఉండాలన్నారు. వేడుకకు హాజరయ్యే పాఠశాల విద్యార్థుల కోసం ఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. అమరవీరుల సైనిక స్మారకం వద్ద ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పుష్పాంజలి ఘటించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జీఏడీ ముఖ్యకార్యదర్శి అధర్‌సిన్హా, రహదారులు, భవనాలశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిశోర్, కాలేజ్ ఆఫ్ ఎయిర్‌వార్‌ఫేర్ వింగ్ కమాండర్ శ్రీనివాస్, శాంతిభద్రతల అదనపు డీజీ జితేందర్, హైదరాబాద్ పోలీస్‌కమిషనర్ అంజనీకుమార్, అగ్నిమాపక శాఖ డీజీ గోపీకృష్ణ, హైదరాబాద్ కలెక్టర్ రఘునందన్‌రావు, ప్రొటోకాల్ డైరెక్టర్ అర్విందర్‌సింగ్, టీఎస్‌స్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సమాచారశాఖ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ కిశోర్‌బాబు, మిలిటరీ, కంటోన్మెంట్‌బోర్డు, అగ్నిమాపక, స్కౌట్ అండ్ గైడ్స్ తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

బనియన్‌లో బంగారం రవాణా

- రూ.1.08 కోట్లు విలువైన 3.314 కిలోలు స్వాధీనం
- విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ఇద్దరి అరెస్టు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బనియన్‌లో పెట్టుకొని బంగారం రవాణా చేద్దామనుకున్న స్మగ్లర్లకు డీఆర్ఐ అధికారులు షాక్ ఇచ్చారు. విశ్వసనీయ సమాచారంతో దాడి చేసి ఏపీలోని విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఈ నెల 4న సికింద్రాబాద్‌కు చేరవేసేందుకు 3.314 కిలోల బంగారాన్ని బనియన్ జేబుల్లో పెట్టుకొని గౌహతి- సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలులో సికింద్రాబాద్‌కు తీసుకొస్తున్న ఇద్దరిని వైజాగ్ రైల్వేస్టేషన్‌లో అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న బంగారం విలువ రూ.1,08,69,000 ఉంటుందని డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ అడిషనల్ డీజీ ఎంకే సింగ్ తెలిపారు. మయన్మార్ నుంచి భారత్‌లోకి విమానమార్గంలో తీసుకొచ్చిన బంగారాన్ని కొద్ది మొత్తాల్లో ఇలా సికింద్రాబాద్‌కు చేరవేస్తున్నట్టు తెలిపారు. కస్టమ్స్ చట్టాల కింద ఇద్దరిపై కేసులు నమోదుచేశామని ఆయన పేర్కొన్నారు.

శంషాబాద్ విమానాశ్రయంలో కోటి విలువైన విదేశీ కరెన్సీ పట్టివేత

శంషాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సీఐఎస్ఎఫ్, డీఆర్ఐ అధికారులు ఓ ప్రయాణికుడి వద్ద నుంచి భారీ మొత్తంలో విదేశీ కరెన్సీని పట్టుకొన్నారు. హైదరాబాద్ నగరంలోని చాంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన మహమ్మద్ పర్వేజ్ బుధవారం తెల్లవారు జామున 4.30 గంటలకు ఎమిరెట్స్ ఎయిర్‌లైన్స్ ఈకే-525 ఎక్కేందుకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకొన్నాడు. ముందస్తు సమాచారంతో సీఐఎస్ఎఫ్, డీఆర్ఐ అధికారులు తనిఖీలు చేయగా అతని వద్ద సుమారు రూ.1,02,53,105 విలువ చేసే యూఎస్డీ, ఖతార్, యూఏఈ, కువైట్, ఒమన్, బహ్రెయిన్, సౌదీ కరెన్సీ పట్టుబడింది. సదరు ప్రయాణికుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు అధికారులు తెలిపారు. విదేశాలకు చెందిన స్మగ్లింగ్ ముఠాలపై నిఘా పెట్టిన డీఆర్ఐ, కస్టమ్స్ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో తనిఖీలు కట్టుదిట్టం చేయడంతో వారి కార్యకలాపాలు సాగడం లేదు.

కోటి కుటుంబాలకు లేఖలు

- ఓటర్ల నమోదుపై అనుమానాలను నివృత్తి చేస్తా
- ఇప్పటివరకు సవరణ జాబితాకు 9.54 లక్షల దరఖాస్తులు
- ఫిబ్రవరి 22న ఓటర్ల తుదిజాబితా
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఓటర్ల నమోదుపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయడానికి రాష్ట్రంలో కోటి కుటుంబాలకు స్వయంగా లేఖలు రాస్తానని సీఈవో రజత్‌కుమార్ చెప్పారు. ఈ ఏడాది ఓటర్‌గా పేరు నమోదు కోసం 8.50 లక్షలకుపైగా దరఖాస్తులు అందాయని తెలిపారు. బుధవారం సచివాలయంలో ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ 26న ప్రారంభమైన సవరణ జాబితాకు 9.54 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, ఈ నెల 25 వరకు గడువు ఉన్నదని తెలిపారు. ఫిబ్రవరి 22న ఓటర్ల తుది జాబితాను విడుదలచేస్తామన్నారు. ఈ జాబితాలో పేర్లు నమోదు చేసుకొన్నవారు త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. తుది ఓటరు జాబితా ముద్రించిన తర్వాత ఓట్ల తొలిగింపు ఉండదని, డబుల్ ఓట్లు కూడా తీసేయడం కుదరదని చెప్పారు. రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఓటర్ల ముసాయిదా సవరణకు గడువు పెంచాలని అందిన విజ్ఞప్తులను ఈసీకి నివేదించినట్టు తెలిపారు.

చట్టపరంగానే ముసాయిదా సవరణ

ఓటర్ల ముసాయిదా సవరణ జాబితా చట్టపరంగానే జరుగుతుందని సీఈవో పేర్కొన్నారు. 2015-16 ఓటర్ల సవరణలో 35 లక్షల ఓటర్లు వివిధ కారణాలతో తొలిగింపునకు గురయ్యారన్నారు. అక్టోబర్ సవరణ ముసాయిదా చేపట్టిన తర్వాత జాబితాలో 2.81 కోట్ల మంది పేర్లు నమోదయ్యాయని చెప్పారు. ఓట్ల తొలిగింపునకు సంబంధించి అసెంబ్లీ ఎన్నికల తర్వాత మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద విచారణ చేపట్టినట్టు తెలిపారు. తొలిగించబడిన ఓట్లలో 6.08 లక్షల ఓట్లు పూర్తిస్థాయిలో విచారణ జరిగిన తర్వాతే తొలిగించినట్టు తేలిందని, 60 వేల మంది తొలిగింపుపై కొంత అవకతవకలు జరిగినట్టు తెలిసిందన్నారు. ఇదేవిధమైన క్షేత్రస్థాయి విచారణ అన్ని జిల్లాల్లో చేపడుతామని చెప్పారు.

ముగ్గురు ఆర్వోలకు నోటీసులు

విచారణ జరుపకుండా ఓట్ల తొలిగింపునకు పాల్పడితే అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేసి వివరణ కోరుతామని సీఈవో తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ముగ్గురు రిటర్నింగ్ అధికారులకు నోటీసులు జారీచేసినట్టు చెప్పారు.

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు గడువు ఈ నెల 31

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు గడువు ఈ నెల 31తో ముగుస్తున్నదని, ఈ అవకాశాన్ని టీచర్, గ్రాడ్యుయేట్ ఓటర్లంతా వినియోగించుకోవాలని రజత్‌కుమార్ సూచించారు. వచ్చేనెల 20న తుదిజాబితా విడుదలచేస్తామని చెప్పారు. విద్యావంతులై ఉండి కూడా ఓటర్‌గా నమోదుపై దృష్టిపెట్టకపోవడం బాధాకరమని అన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదులో ఉద్యోగులను భాగస్వాములను చేయండి

- టీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్

పట్టభద్రుల ఓటు నమోదుకు గ్రామస్థాయి ఉద్యోగులను భాగస్వాములను చేయాలని సీఈవో రజత్‌కుమార్‌ను టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ కోరారు. సచివాలయంలో బుధవారం ఆయనను కలిసి వినతిపత్రం అందచేశారు. కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల ఉమ్మడి పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఇప్పటివరకు 15 శాతం కూడా ఓటర్లు నమోదు కాలేదని చెప్పారు. సాధారణ ఎన్నికల ఓటరు జాబితా సవరణలో గ్రామస్థాయి ఉద్యోగులను భాగస్వాములను చేసినట్టే పట్టభద్రుల ఓటు నమోదులోనూ భాగస్వాములను చేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైనదని, అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేలా చూడాలని రజత్‌కుమార్‌ను కోరారు.

ఏపీ ఎన్జీవో నేత అశోక్‌బాబుకు వ్యతిరేకంగా ధర్నా

- వివాదాస్పదమైన స్వచ్ఛంద పదవీ విరమణ

విజయవాడ: ఏపీ ఎన్జీవో నేత అశోక్‌బాబు స్వచ్ఛంద పదవీ విరమణ వివాదాస్పదంగా మారింది. నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందారన్న కేసులో అశోక్‌బాబుకు విచారణాధికారి క్లీన్ ఎక్విడిక్ట్ ఇవ్వడంపై ఎన్జీవో నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. అశోక్‌బాబుకు వ్యతిరేకంగా విజయవాడలోని వాణిజ్య పన్నుల కార్యాలయం ఎదుట సిటీ సర్కిల్-1 అధ్యక్షుడు మెహర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మెహర్ మాట్లాడుతూ అశోక్‌బాబు నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందారన్న ఆరోపణలపై పారదర్శకంగా విచారణ జరుపాలని డిమాండ్‌చేశారు. రాజకీయ అరంగేట్రం కోసం అశోక్‌బాబు తహతహలాడుతున్నారని, ఇలాంటి వారిని రాజకీయనాయకులు ప్రోత్సహించకూడదని కోరారు. పెన్షన్ రూల్ 44 ప్రకారం అశోక్‌బాబు వీఆర్ఎస్‌ను ఆమోదించకూడదని డిమాండ్‌చేశారు. అశోక్ బాబుపై పలు కేసులు పెడింగ్‌లో ఉన్నాయని డీసీకి ఫిర్యాదు చేశారు.

జగిత్యాలలో సెల్ దుకాణాలు లూటీ

- షట్టర్లను తొలిగించి రెండు దుకాణాల్లోకి చొరబడిన దొంగలు
- రూ.33.87 లక్షల విలువైన సెల్‌ఫోన్లు అపహరణ
- సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున దొంగలు రెండు సెల్‌ఫోన్ దుకాణాలను లూటీచేశారు. ముఖాలకు గుడ్డలు కట్టుకున్న నలుగురు దొంగలు పట్టణం నడిబొడ్డున ఉన్న దుకాణాల షట్టర్లు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. రూ.33,87,724 విలువైన 326 ఫోన్లను ఎత్తుకెళ్లారు. మరో దుకాణంలోకి చొరబడేందుకు విఫలయత్నం చేశారు. ఎస్పీ సింధూశర్మ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో బొలెరో వాహనంలో వచ్చిన నలుగురు దొంగలు జగిత్యాల యావర్ రోడ్డు వద్ద అంగడిగద్దెల కాంప్లెక్స్‌లోని భవానీ సెల్‌షాప్, లాట్ మొబైల్ షాప్ షట్టర్లను ఇనుప రాడ్లతో పైకి లేపారు. ముఖాలకు ముసుగులు ధరించినవారు వాటిల్లోకి చొరబడి మొత్తం సెల్‌ఫోన్లను సంచుల్లో నింపుకొని పారిపోయారు. దుకాణాల్లో అమర్చిన సీసీ కెమెరాల్లో నలుగురు దొంగలు లోపలికి ప్రవేశించడం, సెల్‌ఫోన్లను సంచుల్లో నింపుకొని బయటకు వెళ్లడం రికార్డయింది. లాట్ మొబైల్ షాప్‌లో రూ.10,37,104 విలువైన 86 మొబైల్ ఫోన్లు, భవానీ మొబైల్ షాప్‌లో రూ.23,50,620 విలువైన 240 ఫోన్లను ఎత్తుకెళ్లినట్టు ఎస్పీ తెలిపారు. దుకాణాల్లో చొరబడి మూడు నిమిషాల వ్యవధిలోనే లూటీచేసి వెళ్లిపోయారు. దొంగలు ఈ రెండు దుకాణాలకు సమీపంలోనే ఉన్న సంగీత మొబైల్ షోరూములో చొరబడేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. చోరీ జరిగిన షాపులను ఎస్పీ సింధూశర్మ, అడిషనల్ ఎస్పీ మురళీధర్ పరిశీలించారు. లాట్‌షారూం నిర్వాహకుడు షహనవాజ్‌ఖాన్, భవానీ మొబైల్‌షాప్ యజమాని పులి శేఖర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు జగిత్యాల టౌన్ సీఐ ఆర్ ప్రకాశ్ తెలిపారు.



జగిత్యాలలో చోరీ జరిగిన లాట్ మొబైల్ షాప్



సీసీ కెమెరాల్లో రికార్డయిన దొంగతనం దృశ్యం

మెల్‌బోర్న్‌లో 'భారత్' కాన్సులేట్ వద్ద
అనుమానాస్పద పార్శిల్
మరో 10 విదేశీ కాన్సులేట్ల వద్ద కూడా..


అనుమానాస్పద పార్శిళ్లను తొలగిస్తున్న భద్రతా సిబ్బంది

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో భారత్‌తోపాటు పలు ఇతర దౌత్య కార్యాలయాల వద్ద అనుమానాస్పద పార్శిళ్లు లభించాయి. ఈ సంగతి తెలిసిన వెంటనే సంబంధిత దౌత్య కార్యాలయాల నుంచి సిబ్బందిని తరలించి, దర్యాప్తు ప్రారంభించామని ఆస్ట్రేలియా అధికారులు చెప్పారు. భారత్, అమెరికాలతోపాటు మెల్‌బోర్న్‌లోని 10 విదేశీ దౌత్య కార్యాలయాల వద్ద బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ అనుమానాస్పద పార్శిళ్లు దొరకడంతో వాటిని అత్యవసర సర్వీసుల విభాగం పరిశీలిస్తున్నది. అంబులెన్సులు, ఫైరింజన్లు దౌత్య కార్యాలయాల వద్దకు చేరుకుని సహాయ చర్యలు చేపట్టాయి. భారత సిబ్బంది సురక్షితంగా ఉన్నారని ఒక భారత దౌత్యాధికారి తెలిపారు. సిడ్నీలోని అర్జెంటీనా కాన్సులేట్ వద్ద అనుమానాస్పద 'తెల్లటి పొడి' లభించిన రెండు రోజులకు మెల్‌బోర్న్‌లోని విదేశీ దౌత్య కార్యాలయాల వద్ద అనుమానాస్పద పార్శిళ్లు లభించాయి.

అమెరికన్ హీరో రొనిల్ రోన్ సింగ్
- అక్రమ వలసదారుడి కాల్పుల్లో మరణించిన భారత సంతతి పోలీసుపై అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసలు


రొనిల్ రోన్



వాషింగ్టన్: కాలిఫోర్నియాలో గత నెల 26న మెక్సికో అక్రమ వలసదారుడు జరిపిన కాల్పుల్లో మరణించిన భారత సంతతి పోలీస్ రొనిల్ రోన్ సింగ్ తమ హీరో అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొనియాడా రు. బుధవారం ట్రంప్ తన అధికార నివా సం 'ఓవల్ ఆఫీస్' నుంచి తొలిసారి జాతినుద్దేశించి మాట్లాడారు. 'క్రిస్మస్ మరుసటి రోజు యువ పోలీస్ హత్య కావడంతో అమెరికా గుండె పగిలింది. ఇది అక్రమంగా వలస వచ్చిన వ్యక్తి వల్లే జరిగింది' అని అన్నారు. ఫిజీ నుంచి వచ్చి 2011లో అమెరికా పోలీసుశాఖలో చేరిన రొనిల్ సింగ్ కుటుంబ సభ్యులను, సహచర సిబ్బందిని గత గురువారం ట్రంప్ పరామర్శించారు. యువ పోలీస్ హత్యకు, మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణానికి సంబంధం ఉన్నదన్నారు. సరిహద్దు భద్రతకు నిధులను కేటాయించేందుకు డెమోక్రాట్లు అనుమతించనందుకే ఫెడరల్ ప్రభుత్వ షట్ డౌన్ కొనసాగుతున్నదన్నారు.

చైనా చేతిలో
అత్యాధునిక నేవీ రాడార్


ఫైల్

బీజింగ్: చిన్న సైజులో ఉండే అత్యాధునిక మారిటైమ్ రాడార్‌ను చైనా అభివృద్ధి చేసింది. భారత దేశ భూభాగం కన్నా పెద్ద ప్రాంతంపైన కూడా ఈ రాడార్ నిఘా పెట్టగలదని హాంకాంగ్ నుంచి వెలువడే 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' పత్రిక బుధవారం వెల్లడించింది. దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ రాడార్.. చైనా నౌకాదళానికి మరింత శక్తినిస్తుందని, చైనా సముద్రాలపై పూర్తిస్థాయి పర్యవేక్షణ కొనసాగించేందుకు తోడ్పడుతుందని, శత్రు దేశాల నౌకలు, విమానాలు, క్షిపణుల నుంచి ఎదురయ్యే ప్రమాదాలను ఈ రాడార్ మరింత సమర్థంగా పసిగట్టగలుతుందని ఆ పత్రిక వివరించింది.

యుద్ధతంత్రం నూతన రూపం ఉగ్రవాదం
- ఉగ్రవాదులకు సోషల్ మీడియా వల్లే నిధులు లభ్యం
- ఆఫ్ఘన్‌లో శాంతి కోసం తాలిబన్లతో భేషరతుగా చర్చలు జరుపాలి
- సైనికాధిపతి బిపిన్ రావత్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: ఉగ్రవాదం అనేది యుద్ధతంత్రం నూతన రూపమని సైన్యాధ్యక్షుడు జనరల్ బిపిన్ రావత్ అన్నారు. వివిధ దేశాలు ఉగ్రవాదాన్ని తమ విధానంగా అమలు చేస్తుండటంతో అది 'బహుళ తలల రాక్షసుడి'గా ఎదుగుతున్నదన్నారు. రెచ్చగొట్టే ధోరణులను నిలువరించడంతోపాటు ఉగ్రవాదులకు నిధులు అందకుండా సోషల్ మీడియాపై కొంత నియంత్రణ పెట్టాల్సిన అవసరం ఉన్నదన్నారు. బుధవారం ఆయన 'రైజీనా డైలాగ్' కార్యక్రమంలో మాట్లాడుతూ ఆఫ్ఘన్‌లో శాంతి స్థాపనకుకు తాలిబన్లతో భేషరతుగా చర్చలు జరుపాలన్నారు. ఒక బలహీన దేశం ఉగ్రవాదులతో ఇతర దేశాలపై పరోక్ష యుద్ధానికి పాల్పడుతున్నదని, అటువంటి విధానాలను సహించబోమని పాకిస్థాన్‌ను ఉద్దేశించి రావత్ అన్నారు. ఉగ్రవాదం విస్తరణకు, ఉగ్రవాదులకు ఆర్థిక వనరులను సమకూర్చేందుకు సోషల్ మీడియా ఒక వేదికగా మారిందని బిపిన్ రావత్ పేర్కొన్నారు. సీమాంతర ఉగ్రవాదాన్ని విధానంగా అమలు చేస్తున్న దేశాల వల్లే కశ్మీర్‌లో ఉగ్రవాదం సుదీర్ఘకాలం మనుగడ సాధించగలుగుతున్నదని రావత్ తెలిపారు. కశ్మీర్ యువతను అబద్ధాలు, తప్పుడు సమాచారంతో తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. గతంలో గెరిల్లా యుద్ధతంత్రం గురించి చర్చించే వారమని, ఇప్పుడది ఉగ్రవాదంగా రూపాంతరం చెందిందన్నారు.

జమ్ముకశ్మీర్‌లో సైన్యం అకృత్యాలకు నిరసనగా..
కశ్మీర్ ఐఏఎస్ అధికారి రాజీనామా
- నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలో చేరే అవకాశం!


ఫైజల్

న్యూఢిల్లీ: కశ్మీరీలపై సైన్యం అమానుష కాండకు పాల్పడుతున్నదని ఆరోపిస్తూ ఆ రాష్ట్ర యువ ఐఏఎస్ షా ఫైజల్ (35) తన ఉద్యోగానికి రాజీనామా చేశా రు. త్వరలో రాజకీయాల్లో చేరనున్నారు. 2010 లో ఐఏఎస్‌లో టాపర్‌గా నిలిచిన తొలి కశ్మీరీగా ఫైజల్ దేశం దృష్టిని ఆకర్షించారు. 'సామాన్య కశ్మీరీలపై సైన్యం అకృత్యాలు పెరిగిపోతున్నా, అడ్డుకునేందుకు కేంద్రం చిత్తశుద్ధితో యత్నించడం లేదు. ఇందుకు నిరసనగానే రాజీనామా నిర్ణయం తీసుకున్నా' అని ఫేస్‌బుక్‌లో బుధవారం పోస్టు చేశారు. శుక్రవారం తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానన్నారు. 'హిందుత్వ అతివాద శక్తుల చేతిలో దేశంలోని 20 కోట్ల మంది ముస్లింలు అణిచివేతకు గురవుతున్నారు. కశ్మీరీలపై అకృత్యాలు పెరుగుతున్నాయి. నిజమైన ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటే దాడుల నుంచి కశ్మీరీలను కాపాడాలి' అని అన్నారు. ఫైజల్ రాజీనామా నిర్ణయాన్ని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా స్వాగతించారు.

పాకిస్థాన్ టీవీ చానెళ్లలో భారత్ ప్రసారాలపై నిషేధం

ఇస్లామాబాద్, జనవరి 9: తమ సంస్కృతిని దెబ్బ తీసే భారత సంస్కృతి, సంప్రదాయాలకు చెందిన కథలు, సీరియళ్లు, చిత్రాలను తమ టీవీ చానెళ్లలో ప్రసారం చేయడానికి అనుమతించబోమని పాకిస్థాన్ సుప్రీంకోర్టు బుధవారం తెలిపింది. టీవీ చానెళ్లలో భారత సమాచార ప్రసారాలను నిషేధిస్తూ లాహోర్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పాకిస్థాన్ ఎలక్ట్రానిక్ మీడియా నియంత్రణ సంస్థ (పెమ్రా) దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ సాఖిబ్ నిస్సార్ సారథ్యంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది.

ప్రతి కుటుంబానికి రూ.1000 నగదు పంపిణీకి నో
తమిళనాడు ప్రభుత్వ నిర్ణయంపై మద్రాస్ హైకోర్టు స్టే

చెన్నై, జనవరి 9: పొంగల్ (సంక్రాంతి) సందర్భంగా రేషన్ కార్డు దారులందరికీ రూ.1000 చొప్పున నగదు పంపిణీ చేయాలని తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. నగదు పంపిణీపై స్టే విధిస్తూ జస్టిస్‌లు ఎం సత్యనారాయణ్, పీ రాజమాణిక్కంలతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలు జారీచేసింది.

మహిళను అడ్డం పెట్టుకున్నారు
- రాఫెల్‌పై చర్చలో మోదీ సమాధానం చెప్పలేక నిర్మలా సీతారామన్‌ను తీసుకొచ్చారు
- నా ప్రశ్నలకు ఆమె నుంచి జవాబులే రాలేదు
- కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశమంతా రుణాల మాఫీ
- రాజస్థాన్ రైతు సభలో రాహుల్ గాంధీ ప్రకటన


జైపూర్‌లో జరిగిన కాంగ్రెస్ రైతు సభలో రాహుల్ గాంధీకి నాగలిని బహూకరిస్తున్న దృశ్యం

జైపూర్: రాఫెల్ ఒప్పందంపై లోక్‌సభలో జరిగిన చర్చలో పాల్గొనకుండా మోదీ పారిపోయారని, తనను కాపాడాలని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ముందుకు తెచ్చారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. అవినీతిని అనుమతించబోనని, చౌకీదార్‌లా దేశానికి కాపలా కాస్తానని చెప్పిన మోదీ లోక్‌సభలో రాఫెల్ ఒప్పందంపై చర్చ జరిగినప్పుడు కనీసం ఒక్క నిమిషం కూడా లేచి నిలబడలేకపోయారన్నారు. 'ఈ అంశంపై చర్చ సందర్భంగా నేను ప్రశ్నలు అడిగినప్పుడు 56 అంగుళాల ఛాతీ ఉన్న చౌకీదారు అక్కడినుంచి పారిపోయారు. తనను తాను సమర్థించు కోలేకపోతున్నానని, ఆ పని చేయాలని ఒక మహిళను (రక్షణమంత్రి సీతారామన్‌ను) కోరుకున్నారు. 2.30 గంటలు జరిగిన చర్చలో ఆమె మోదీని సమర్థించలేకపోయారు. అవినీతి జరిగిన మాట వాస్తవమా? కాదా? అని అడిగిన ప్రశ్నకు స్పష్టమైన సమాధానం చెప్పలేకపోయారు' అని రాహుల్ అన్నారు. వ్యవసాయ సంక్షోభంతో ఇబ్బందులు పడుతున్న రైతులు ఇటీవల రాజస్థాన్ సహా మూడు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని మట్టికరిపించి తమ శక్తి ఏమిటో ప్రధాని మోదీకి చూపారని అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు రాజస్థాన్‌లో ప్రచారాన్ని ప్రారంభించిన రాహుల్ జైపూర్‌లో బుధవారం రైతుల సభలో ప్రసంగిస్తూ 'ప్రధాని మోదీ ఎప్పుడూ బ్యాక్‌ఫుట్‌లో ఆడుతున్నారు. ఫ్రంట్‌ఫుట్‌లో ఆడి సిక్సర్ కొట్టాలని దేశ యువత కోరుతున్నా' అని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశమంతటా పంట రుణాల మాఫీ చేస్తామని రాహుల్ ప్రకటించారు.



హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో బోసిపోయిన పోస్టాఫీస్

రెండో రోజూ బంద్.. పాక్షికం!

న్యూఢిల్లీ, జనవరి 9: కార్మిక సంఘాలు చేపట్టిన భారత్ బంద్ రెండో రోజూ పాక్షికంగానే ప్రభావం చూపింది. పశ్చిమబెంగాల్‌లో కొన్ని హింసాత్మక ఘటనలు జరిగాయి. సీల్దా-బాన్‌గావ్ సెక్షన్‌లో రైలు పట్టాలపై గల బాంబును పోలీసులు నిర్వీర్యం చేశారు. కొన్ని రాష్ట్రాల్లో బ్యాంకు సేవలు పాక్షికంగా స్తంభించాయి. బుధవారం పశ్చిమబెంగాల్‌లోని హౌరా జిల్లాలో ఆందోళనకారులు పాఠశాల బస్సుపై రాళ్లు రువ్వారు. కేరళలోని తిరువనంతపురంలో ఎస్బీఐ ట్రెజరీ శాఖపై ఆందోళనకారులు దాడి చేశారు. తమిళనాడులోనూ కొన్ని చోట్ల ఆందోళనకారులు రైళ్లను అడ్డుకున్నారు. గోవాలో కొంత బంద్ ప్రభావం కనిపించింది. బెంగళూరులో బస్సులను వామపక్షాలు అడ్డుకున్నాయి. ఒడిశాలోనూ ఆందోళనకారులు రైళ్లను అడ్డుకున్నారు. హైదరాబాద్‌లో సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ బంద్ జయప్రదమైందన్నారు.

ఆ వ్యాఖ్యలు
మహిళా శక్తికి అవమానకరం
- రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌ను రాహుల్ అవమానించారంటూ ప్రధాని మోదీ మండిపాటు



సోలాపూర్: కాంగ్రెస్ నేతలు ఈ దేశ మహిళలను అవమానిస్తున్నారని ప్రధాని మోదీ ఆరోపించారు. ఆగ్రాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌పై రాహుల్ ఒక మహిళ అని చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాఫెల్ ఒప్పందంపై రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ఒక్కొక్క వాస్తవాన్ని వెల్లడిస్తూ ప్రతిపక్షం నోరు మూయించినా.. కాంగ్రెస్ నేతలు ఆ మహిళా రక్షణ మంత్రిని అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇది కేవలం ఒక మహిళకు జరిగిన అవమానం కాదు.. దేశంలోని మహిళా శక్తికి జరిగిన అవమానం. ఇందుకు ఆ బాధ్యతారహితులైన నేతలు మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఈ దేశంలో ఓ మహిళ తొలిసారి రక్షణ మంత్రి కావడం దేశానికే గర్వకారణం' అని అన్నారు. సోలాపూర్‌లో బుధవారం జరిగిన ఒక బహిరంగసభలో మోదీ మాట్లాడుతూ, వేల కోట్ల రూపాయల యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో రాఫెల్ సంస్థకు వ్యతిరేకంగా క్రిస్టియన్ మిషెల్ పనిచేశారని ఆరోపించారు. తనను తాను మరోసారి చౌకీదార్ (కాపలాదారు)గా చెప్పుకున్న మోదీ, అవినీతిని కూకటివేళ్లతో పెకిలించివేసే 'సఫాయి' పనిని చేపట్టానని చెప్పారు. 'మోదీ ప్రత్యేకమైన మట్టితో తయారైనవాడు. ఆయనను ఎవరూ భయపెట్టలేరు లేదా ప్రలోభపెట్టలేరు. ప్రతి పైసాకు లెక్క తీస్తాను. ఈ చౌకీదార్ నిద్రపోడు. తప్పుచేసే వారిని చీకటిలో కూడా పట్టుకోగలడు. వారు నన్ను ఎంతగానైనా దూషించవచ్చు.. కానీ అవినీతిని పెకిలించివేసే పనిని మాత్రం ఆపివేయబోను' అని ప్రధాని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడినవారికి విద్యా ఉద్యోగాలలో 10శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని ప్రధాని మోదీ సమర్థించుకున్నారు. అసత్యాలను ప్రచారం చేస్తున్నవారికి ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడం చెంపపెట్టు వంటిదని వ్యాఖ్యానించారు. ఈ బిల్లు వల్ల అణగారినవర్గాలు, దళితులు, గిరిజనుల హక్కులకు ఎటువంటి నష్టం ఉండదని తెలిపారు. ఇక పౌరసత్వ బిల్లు వల్ల అసోం, ఈశాన్య రాష్ట్రాల ప్రజల హక్కులు ఏమాత్రం తగ్గిపోవని చెప్పారు.


బుధవారం ప్రగతి భవన్‌లో పాలకుర్తి నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరుతూ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు

28 నుంచి సికింద్రాబాద్‌లో
ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారత సైన్యంలో చేరాలనుకునే యువత కోసం ఈ నెల 28 నుంచి సికింద్రాబాద్‌లో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు రక్షణశాఖ అధికారులు తెలిపారు. 125 ఇన్‌ఫ్యాంట్రీ బెటాలియన్ (టెరిటోరియల్ ఆర్మీ)లో 69, 123లో 10 కలిపి మొత్తం 79 వివిధ క్యాటగిరీల్లోని సైనిక ఉద్యోగాల ఖాళీలకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. జోన్ 6లో భాగంగా తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, రాజస్థాన్, తమిళనాడు, గుజరాత్, గోవా రాష్ట్రాల యువత అర్హులని చెప్పారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల అభ్యర్థులకు ఈ నెల 28 ఉదయం 5 గంటల నుంచి హైదరాబాద్, మౌలాలిలోని 1105, రైల్వే ఇంజినీర్ (టెరిటోరియల్ ఆర్మీ) ప్రాంతంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్టు చెప్పారు. 18 నుంచి 42 ఏండ్ల మధ్య వయసున్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 125 ఇన్‌ఫ్యాంట్రీ బెటాలియన్, ది గార్డ్స్, తిరుమలగిరి, సికింద్రాబాద్ చిరునామాలో సంప్రదించాలని సూచించారు.

యాసంగిలో వరినాట్లు 24%
42 శాతం విస్తీర్ణంలో సాగైన పంటలు • ఆదిలాబాద్ జిల్లాలో రికార్డుస్థాయి
వరిసాగులో ముందున్న ఇందూరు • 18 జిల్లాల్లో వర్షాభావం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యాసంగి వరినాట్లు మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు వరినాట్లు 24 శాతానికి చేరాయి. యాసంగిలో సాధారణంగా రాష్ట్రంలో 7.05 లక్షల హెక్టార్లలో వరిసాగవుతుండగా ఇప్పటి వరకు 1.65 లక్షల హెక్టార్లలో రైతులు వరినాట్లు వేసినట్టు వ్యవసాయశాఖ బుధవారం ఒక నివేదికలో వెల్లడించింది. యాసంగిలో అన్ని పంటలూ కలిపి సాధారణ సాగువిస్తీర్ణం 13.38 లక్షల హెక్టార్లకు గాను ఇప్పటివరకు 5.61 లక్షల హెక్టార్లలో అంటే 42శాతం భూమిలో పంటలు వేసినట్టు తేల్చింది. అత్యధికంగా వరి సాగు చేస్తున్న జిల్లాగా నిజామాబాద్ నిలిచింది. ఈ జిల్లాలో 36,421 హెక్టార్లలో వరి సాగుచేస్తున్నారు. నల్లగొండలో 12,620, సూర్యాపేటలో 16,538, పెద్దపల్లిలో 21,200 హెక్టార్లలో వరి సాగయింది. అదే విధంగా గోధుమ 42 శాతం, జొన్నలు 45 శాతం, మొక్కజొన్న 57 శాతం, పెసర 48 శాతం, మినుములు 57 శాతం, కంది 42 శాతం, శనగ 109 శాతం, వేరుశనగ 73 శాతం, పొద్దుతిరుగుడు 16 శాతం, పొగాకు 70 శాతం, ఉల్లిగడ్డ 29 శాతం విస్తీర్ణంలో సాగయ్యాయి.

ఆదిలాబాద్‌లో అధికసాగు

యాసంగి సీజన్‌లో ఆదిలాబాద్ జిల్లాలో రైతులు రికార్డుస్థాయిలో పంటలు సాగుచేశారు. అక్కడ సాధారణ విస్తీర్ణం 19,804 హెక్టార్లు ఉంటే.. 25,143 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. సాధారణంతో పోలిస్తే 127 శాతం విస్తీర్ణంలో ఈ జిల్లాలో పంటలు సాగుకావటం విశేషం. నాగర్‌కర్నూల్‌లో 85 శాతం శాతం, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 77 శాతం, వనపర్తిలో 68 శాతం, నిజామాబాద్‌లో 62 శాతం పంటలు సాగయ్యాయి. అతి తక్కువగా మంచిర్యాల జిల్లాలో 12 శాతం, జగిత్యాలలో 16 శాతం, నల్లగొండలో 19 శాతం, యాదాద్రి భువనగిరిలో 19 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి.

ఇంకా లోటు వర్షపాతమే

వానకాలం సాగుతోపాటు యాసంగి సీజన్‌లో కూడా ఆశించిన మేర వర్షాలు పడలేదు. ఇప్పటికీ 18 జిల్లాల్లో లోటు వర్షపాతం నెలకొంది. వరంగల్ రూరల్, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, జనగామ, యాదాద్రిభువనగిరి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి, మహబూబ్‌నగర్, జోగులాంబగద్వాల, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో సగటున 20 శాతం నుంచి 59 శాతం వరకు లోటు వర్షపాతం నమదైంది. మిగిలిన 13 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

డిమాండ్ లేని కోర్సులకు
అనుమతివ్వం
- నూతన కోర్సులను ప్రోత్సహిస్తాం
- రాష్ట్ర ఉన్నత విద్యామండలి వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అధిక డిమాండ్ ఉన్న కోర్సులకు మాత్రమే 2019-20 విద్యాసంవత్సరం నుంచి అనుమతులు ఇవ్వాలని, అంతగా ప్రవేశాలు లేని కోర్సులకు అనుమతించకూడదని రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయించారు. బీఏ, బీఎస్సీ, బీకాం వంటి సాధారణ కోర్సులను యథావిధిగా కొనసాగిస్తూనే.. బీఏ జర్నలిజం, బీఎస్సీ నర్సింగ్, ల్యాబ్ టెక్నిషియన్స్, హోటల్ మేనేజ్‌మెంట్ వంటి నూతన కోర్సులను ప్రోత్సహిస్తామని ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి, డిగ్రీ కాలేజీల్లో నాణ్యమైన విద్యావిధానాన్ని అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో
ఎన్సీడీఆర్సీ సర్క్యూట్ బెంచ్
- వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక ఏర్పాటు
- ఈ నెల 28 నుంచి వచ్చే నెల 8 వరకు పెండింగ్ కేసుల విచారణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయ వినియోగదారుల వివాదాలు, రిడ్రెసల్ కమిషన్ (ఎన్సీడీఆర్సీ) హైదరాబాద్‌లో సర్క్యూట్‌బెంచ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి జాతీయ వినియోగదారుల కమిషన్‌లో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల అప్పీలు, రివిజన్‌పిటిషన్లపై ఈ బెంచ్ విచారణ జరుపనున్నది. హైదరాబాద్ ఆదర్శనగర్‌లోని తెలంగాణ ఫుడ్ కమిషన్ కార్యాలయం నుంచి ఈ బెంచ్ పనిచేయనున్నది. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల పరిధుల్లో వినియోగదారుల భద్రతాచట్టం, 1986 ప్రకారం పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణను ఈ బెంచ్ చేపడుతున్నది. ముఖ్యంగా రూ.కోటి, అంతకు పైబడిన ఫిర్యాదులను వినియోగదారులు ఈ బెంచ్ వద్ద నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని తెలంగాణ పౌరసరఫరాలశాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. దీంతోపాటు రెండు రాష్ట్రాలకు సంబంధించి కొత్తగా అప్పీళ్లుగానీ, రివిజన్ పిటిషన్లుగానీ నేరుగా దాఖలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వినియోగదారులు తమ ఫిర్యాదుల పరిష్కారానికి ఢిల్లీ వరకు వెళ్లాల్సిన శ్రమను తగ్గించేందుకు జాతీయ కమిషన్ ఆయా రాష్ట్రాల్లో సర్క్యూట్ బెంచ్ ఏర్పాటుచేస్తున్నది. ఇప్పటికే బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, పుణె, కొచ్చి, అహ్మదాబాద్, భోపాల్, నాగ్‌పూర్, చండీగఢ్, జయపుర, లక్నో, కోల్‌కతల్లో ఈ బెంచ్‌లను నెలకొల్పారు. జాతీయ కమిషన్ అధ్యక్షుడు ఆర్కే అగర్వాల్ నేతృత్వంలో కేసుల విచారణ చేపట్టనున్నారు. వినియోగదారుల కేసులకు సంబంధించి నెలరోజుల ముందు నోటీసులు అందుకొన్నవారు ఈ సర్క్యూట్ బెంచ్ ఎదుట హాజరుకావాల్సిఉంటుంది.

చిట్‌ఫండ్
మోసాలకు కళ్లెం
- నిబంధనలు కఠినతరం చేసిన రిజిస్ట్రేషన్ల శాఖ
- ఖాతాదారులకు ఫుల్‌ప్రూఫ్ సిస్టమ్.. బ్లాక్ చైన్ టెక్నాలజీతో పారదర్శకత
- నగదు డిపాజిట్లకే అనుమతి.. చీటీ డబ్బుకోసం ప్రత్యేక అకౌంట్



ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: చిట్‌ఫండ్ కంపెనీలు ఖాతాదారులను మోసం చేయకుండా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిబంధనలను కఠినతరం చేసింది. రిజిస్టర్డ్ చిట్‌ఫండ్ కంపెనీలు తమ చీటి విలువ మొత్తాన్ని డబ్బురూపంలోనే తమశాఖ అకౌంట్‌లో డిపాజిట్ చేయాలని ఆదేశాలు జారీచేసింది. కంపెనీల వ్యవహారాలన్నింటినీ ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయనున్నారు. ఇందుకోసం దేశంలో ఎక్కడాలేనివిధంగా బ్లాక్‌చైన్ సిస్టమ్‌ను ఉపయోగించడానికి రంగం సిద్ధం చేశారు. మొదటిదశలో ఈనెల నుంచి రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాలలో ప్రయోగాత్మకంగా కొత్త విధానాన్ని అమలుచేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఖాతాదారులకు వెంటనే డబ్బులు ఇవ్వడానికి ఏదైనా లోపం ఉంటే సదరు డబ్బును చిట్‌ఫండ్ కంపెనీలు సొంతానికి ఉపయోగించుకోకుండా ప్రత్యేక ఖాతాలో జమచేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు.

తెలంగాణలో దాదాపు 10వేలకు పైగా గుర్తింపు పొందిన చిట్‌ఫండ్ కంపెనీలు ఏటా వందల కోట్లలో వ్యాపారం చేస్తున్నాయి. దేశంలో 40 శాతం టర్నోవర్ తెలంగాణలో జరుగుతున్నది. దేశంలో, రాష్ట్రంలో కొన్ని కంపెనీలు ఖాతాదారుల నుంచి భారీ మొత్తంలో సొమ్ము వసూలు చేసిన తర్వాత బిచాణా ఎత్తివేస్తున్నాయి. కొన్ని 'చీటింగ్ ఫండ్'ల వల్ల సామాన్యులు నిండా మునుగుతున్నారు. ఇటువంటి పరిస్థితిని నివారించడానికి తెలంగాణ స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ కొంతకాలంగా కసరత్తు చేస్తున్నది. కమిషనర్ చిరంజీవులు ఆధ్వర్యంలో జాయింట్ కమిషనర్ వేముల శ్రీనివాసులు చిట్‌ఫండ్ల నుంచి ప్రజలు మోసపోకుండా ఫుల్‌ప్రూఫ్ సిస్టమ్‌ను రూపొందించారు. ఇందులోభాగంగా చిట్‌ఫండ్ కంపెనీల నుంచి సెక్యూరిటీ కింద ఆస్తులను కాకుండా నగదును మాత్రమే తీసుకునే విధానాన్ని అమలుచేస్తున్నారు. వాస్తవానికి చిట్‌ఫండ్ కంపెనీల యజమానులు చిట్‌ఫండ్ యాక్ట్ 1992 లోని సెక్షన్ 20 కింద తమ చీటి విలువ ఎంత ఉందో అంతమొత్తాన్ని చిట్ రిజిస్ట్రార్ వద్ద డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. లేదా అంతే మొత్తం విలువచేసే స్థిరాస్తిని తనఖా పెట్టాలి. ఇకపై చిట్‌ఫండ్ యాక్ట్ ప్రకారం కేవలం బ్యాంకులో నగదు డిపాజిట్లు మాత్రమే సెక్యూరిటీగా పరిగణించాలని అధికారులు స్పష్టం చేశారు. చిట్‌ఫండ్ కంపెనీలలో చీటీవేసే సామాన్యులకు మరింత భరోసా ఇవ్వడానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్టు స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ జాయింట్‌కమిషనర్ వేముల శ్రీనివాసులు తెలిపారు. అలాగే చీటీ పాడిన తరువాత ఖాతాదారులను నెలల తరబడి తిప్పకుండా ప్రత్యేక అకౌంట్ విధానాన్ని తీసుకొస్తున్నట్టు చెప్పారు. రిజిస్ట్రేషన్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అకౌంట్‌లో డబ్బు జమచేయాలి. దీంతో ఖాతాదారులు నిబంధనలు పూర్తిచేసిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఖాతాదారుడికి డబ్బు అందుతుంది. www.tchits.telangana.gov.inలో చిట్‌ఫండ్‌కు సంబంధించి అన్ని వివరాలు తెలుసుకోవచ్చని శ్రీనివాసులు చెప్పారు.

నేటినుంచి రాజధాని వేదికగా
వరల్డ్ కల్చర్ టూరిజం సదస్సు
- హాజరుకానున్న 15 దేశాల టూరిజం ప్రతినిధులు
- తెలంగాణ పర్యాటక రంగం అభివృద్ధికి ప్రాధాన్యం
- అమెరికా నుంచి వచ్చిన 10 మంది విద్యార్థులు




హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) హైదరాబాద్ ఆధ్వర్యంలో గురువారం నుంచి మూడురోజులపాటు 23వ ఇంటర్నేషనల్ జాయింట్ వరల్డ్ కల్చర్ టూరిజం సదస్సును హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 15 దేశాల నుంచి ప్రతినిధులు సదస్సుకు హాజరవుతున్నారు. దక్షిణకొరియా, లాత్వియా, నైజీరియా, మారిషస్, వియత్నాం, జపాన్, ఇరాన్, సింగపూర్ తదితర దేశాలతోపాటు మనదేశంనుంచి కూడా పర్యాటక రంగానికి చెందిన ప్రతినిధులు, సీనియర్ ప్రొఫెసర్లు పాల్గొంటున్నారు. ఆయా దేశాలకు చెందిన సంస్కృతి సంప్రదాయాలు, పర్యాటక రంగ అంశాలపై చేసిన పరిశోధనాపత్రాలను ప్రతినిధులు ప్రవేశపెట్టనున్నారు. అమెరికా, జపాన్ దేశాల విద్యార్థులు పది మందికి తక్కువ కాకుండా సదస్సుకు హాజరవుతున్నారు. భారతదేశంలో, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీల ప్రతినిధులు కూడా హాజరై పర్యాటక రంగ అభివృద్ధిపై తమ అభిప్రాయాలు వెల్లడించనున్నారు. తెలంగాణ దేవాలయాలపై ప్రమోద్‌కుమార్ రూపొందించిన ప్రత్యేక నృత్యంతోపాటు దక్షిణకొరియాకు చెందిన బాలబాలికల నృత్య ప్రదర్శనలు ఉంటాయి. నిథమ్‌కు చెందిన 20 మంది విద్యార్థులు భారతీయ పండుగలపై రూపొందించిన ప్రత్యేకంగా నృత్యం చేయనున్నారు.

హైదరాబాద్‌లో నిర్వహించడం తొలిసారి

దేశవిదేశాలకు చెందిన సంస్కృతి, పర్యాటకం అనే అంశంపై హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సును నిర్వహించడం ఇదే తొలిసారి నిథమ్ డైరెక్టర్ చిన్నమరెడ్డి తెలిపారు. ఈ సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించడం తెలంగాణ పర్యాటక రంగం అభివృద్ధికి ఎంతో దోహద పడుతుందని అన్నారు. ఈ సదస్సుకు హాజరుకానున్న వివిధ దేశాల ప్రొఫెసర్లు, పర్యాటక రంగ ప్రతినిధులు తెలంగాణలోని దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు, కట్టడాలను సందర్శించనున్నారని చెప్పారు. దీనివల్ల రాష్ట్రంలో పర్యాటక రంగానికి మరింత చేయూత లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ప్రత్యేక అతిథిగా రాష్ట్ర ఉన్నతవిద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, ఎయిమ్స్ మాజీ చైర్మన్ అనిల్, నిథమ్ చైర్మన్ బీ వెంకటేశం తదితరులు హాజరుకానున్నట్టు డైరెక్టర్ పేర్కొన్నారు.

ఫిబ్రవరి 1న తాత్కాలిక కేంద్ర బడ్జెట్!

- ఈ నెల 31 నుంచి వచ్చేనెల 13 వరకు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు
- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భారీగా తాయిలాలను ప్రకటించనున్న మోదీ సర్కార్?



న్యూఢిల్లీ: వచ్చే ఏప్రిల్-మేనెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశమున్న నేపథ్యంలో తాత్కాలిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తున్నది. సాధారణంగా ఎన్నికలకు ముందు ప్రభుత్వాలు తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంటాయి. మోదీ ప్రభుత్వం కూడా ఈ నెల 31 నుంచి వచ్చేనెల 13 వరకు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను నిర్వహించి, ఫిబ్రవరి 1న తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. బడ్జెట్ సమావేశాలు ముగియగానే ప్రస్తుత పార్లమెంట్ పదవీకాలం కూడా పూర్తయినట్లే లెక్క. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈ నెల 31న ప్రసంగిస్తారు. అదే రోజు ఆర్థిక సర్వే నివేదికను కూడా ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. వాస్తవానికి బడ్జెట్ సమావేశాలు రెండు విడతలుగా జరుగుతుంటాయి. కానీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఒకే విడతగా సమావేశాలు ముగించి తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలన్నది కేంద్ర ప్రభుత్వ ఆలోచనగా ఉంది. కేంద్ర ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్ కావడం, త్వరలో ఎన్నికలు జరుగనుండటంతో భారీగా తాయిలాలను ప్రకటించడానికి మోదీ సర్కార్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది.

ప్రింట్ మీడియాలో ప్రభుత్వ ప్రకటన రేట్లు 25 శాతం పెంపు

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం

న్యూఢిల్లీ: ప్రింట్ మీడియాకు ప్రభుత్వం ఇచ్చే ప్రకటనల రేట్లను 25 శాతం పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీనివల్ల చిన్న, మధ్య తరహా పత్రికలు, ప్రాంతీయ, స్థానిక పత్రికలకు భారీగా లబ్ధి చేకూరనున్నదని పేర్కొంది. తక్షణం అమలులోకి రానున్న ఈ నిర్ణయం మూడేండ్ల పాటు కొనసాగుతుంది. ఇంతకుముందు 2010లో ఉన్న రేట్లను 2013లో 19 శాతం పెంచుతూ అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. కేంద్ర సమాచార, ప్రసారాలశాఖ నియమించిన 8వ ధరల స్థిరీకరణ కమిటీ చేసిన సిఫారసుల మేరకు పత్రికలకు ఇచ్చే ప్రకటన రేట్లను పెంచాలని నిర్ణయం తీసుకున్నట్లు ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. న్యూస్‌ప్రింట్ ధరలు, ప్రాసెసింగ్ చార్జీలు పెరుగటం తదితర కారణాల నేపథ్యంలో ప్రభుత్వ ప్రకటనల ధరలను పెంచాలని స్థిరీకరణ కమిటీ సిఫార్సు చేసింది. అయితే, కేంద్రం నిర్ణయంపై ప్రతిపక్ష కాంగ్రెస్ స్పందిస్తూ.. ఇప్పటి వరకూ మీడియాపై అణిచివేత ధోరణులను సాగించిన మోదీ సర్కార్.. ఎన్నికల నేపథ్యంలో ఈ ఎత్తు వేసిందని, కానీ ఫలితం ఉండదని పేర్కొంది.

విధుల్లోకి అలోక్‌వర్మ

సీబీఐ తాత్కాలిక అధిపతి నాగేశ్వరరావు చేపట్టిన బదిలీలు రద్దుచేసిన వర్మ


అలోక్‌వర్మ

న్యూఢిల్లీ, జనవరి 9: సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మ మళ్లీ విధుల్లో చేరారు. 77 రోజుల తర్వాత బుధవారం తన కార్యాలయానికి చేరుకున్న వర్మకు సీబీఐ తాత్కాలిక అధిపతి ఎం నాగేశ్వరరావు, ఇతర అధికారులు స్వాగతం పలికారు. అక్టోబర్ 23న కేంద్రం తనను బలవంతంగా సెలవులపై పంపిన తర్వాత సీబీఐలో నాగేశ్వరరావు చేపట్టిన బదిలీలను వర్మ రద్దు చేస్తూ వెనువెంటనే ఉత్తర్వులు జారీచేశారు. అక్టోబర్ 24, జనవరి 3 తేదీల్లో సీబీఐలో పలువురు అధికారులను నాగేశ్వరరావు బదిలీచేశారు. వీటన్నింటిని ఉపసంహరిస్తున్నట్లు వర్మ తన తాజా ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. రాత్రి పొద్దుపోయే వరకూ వర్మ తన కార్యాలయంలో తీరికలేకుండా గడిపారు. వర్మ పదవీకాలం ఈ నెల 31వ తేదీతో ముగియనున్నది. మరోవైపు అలోక్‌వర్మ భవిష్యత్తును నిర్ణయించే అత్యున్నత స్థాయి కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ తప్పుకున్నారు. మరో సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఏకే సిక్రీ పేరును ఆయన ప్రతిపాదించారు. ఈ అంశం న్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అలోక్‌వర్మ వెంటనే విధుల్లో చేరాలని, ఆయన్ను నిరవధిక సెలవులపై పంపడం తగదని మంగళవారం తీర్పు చెప్పిన ధర్మాసనానికి చీఫ్ జస్టిస్ గొగొయ్ నేతృత్వం వహించారు. ఈ నేపథ్యంలోనే ఆయన స్వచ్ఛందంగా కమిటీ నుంచి తప్పుకున్నట్లు న్యాయ నిపుణులు చెబుతున్నారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ అలోక్‌వర్మ భవితవ్యంపై నిర్ణయం తీసుకోనున్నది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, చీఫ్ జస్టిస్ లేదా ఆయన నామినీ సభ్యులుగా ఉండే ఈ కమిటీ వారంలోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. దీంతో ప్రధాని మోదీ, కాంగ్రెస్ నేత ఖర్గే, జస్టిస్ ఏకే సిక్రీలతో కూడిన కమిటీ అలోక్‌పై చర్యల విషయంలో బుధవారం రాత్రి ప్రధాని నివాసంలో ప్రత్యేకంగా సమావేశమైంది. అయితే, భేటీలో ఏం చర్చించారనే విషయాలు బయటకు వెల్లడికాలేదు. త్వరలో కమిటీ మరోసారి సమావేశమై దీనిపై చర్చించనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

మళ్లీ ఆమే..!

- ఈబీసీ కోటాను కోర్టులో సవాలు చేస్తానన్న ఇందిరా సాహ్నీ
- పీవీ హయాంలో ఇదే తరహా ప్రయత్నాన్ని అడ్డుకున్న న్యాయవాది


ఇందిరా సాహ్నీ

న్యూఢిల్లీ, జనవరి 9: అగ్రవర్ణాలలోని పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు మోదీ ప్రభుత్వం తేనున్న చట్టం చెల్లుబాటవుతుందా? లేదా? ప్రస్తుతం దేశమంతా ఇదే చర్చ జరుగుతున్నది. కొందరు సానుకూలంగా స్పందిస్తుండగా, మరికొందరు ఈ బిల్లు కోర్టులో వీగిపోతుందని అంటున్నారు. పార్లమెంట్‌లోని ఉభయ సభలో బిల్లుపై చర్చ జరిగినప్పుడు దాదాపు అన్ని పార్టీలు ఈ మద్దతు తెలిపాయి. దీంతో ఈ బిల్లును కోర్టులో ఎవరు సవాలు చేయనున్నారన్న ఆసక్తి ఇప్పుడు సర్వత్రా నెలకొంది. ఇంతకుముందు 1992లో అగ్రకులాల వారికి రిజర్వేషన్ కల్పించేందుకు పీవీ నరసింహారావు ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని కోర్టు ద్వారా అడ్డుకున్న సీనియర్ న్యాయవాది ఇందిరా సాహ్నీ మోదీ సర్కార్ నిర్ణయాన్ని కూడా సవాలు చేస్తామని చెప్పారు. ఓ వార్తా సంస్థతో బుధవారం ఇందిరా సాహ్నీ మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం తెచ్చిన ఈ బిల్లు వల్ల జనరల్ క్యాటగిరీలో అర్హులైన అభ్యర్థులు అవకాశాలను కోల్పోతారని చెప్పారు. అందుకనే ఈ బిల్లును కోర్టులో సవాలు చేస్తామని ఆమె చెప్పారు. బిల్లుపై పిటిషన్ దాఖలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత బిల్లు వల్ల రిజర్వేషన్లు 60 శాతానికి పెరుగుతాయని, ఫలితంగా ఓపెన్ క్యాటగిరీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుంది కాబట్టి దీనిని కోర్టు కొట్టి వేసే అవకాశం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. గతంలో తాను పీవీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్పందించేందుకు దారితీసిన పరిస్థితులను ఇందిర గుర్తు చేసుకున్నారు. అగ్రవర్ణాల్లోని పేదలకు రిజర్వేషన్ కల్పించాలన్న పీవీ సర్కార్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని జండేవాలన్ వద్ద జరిగిన ఒక ప్రదర్శనలో స్కూలు, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారని, అది చూసి రెండు రోజుల్లోనే పిటిషన్ వేశానని చెప్పారు. ఆ కేసు అనేక ధర్మాసనాలను దాటుకుంటూ రాగా, చివరికి జస్టిస్ వెంకటాచలయ్య నేతృత్వంలోని 9మంది సభ్యుల ధర్మాసనం ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టివేస్తూ తీర్పు చెప్పిందని గుర్తు చేశారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి 10 శాతం ప్రభుత్వ ఉద్యోగాలను రిజర్వు చేస్తూ పీవీ తప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు.

'ఈబీసీ' వ్యూహం ఫలించేనా?

ఆర్థికంగా వెనుకబడిన వర్గాల రిజర్వేషన్ బిల్లు బీజేపీకి లాభమా? నష్టమా? ■ గతంలో బెడిసికొట్టిన ఈ తరహా ప్రయత్నాలు

న్యూఢిల్లీ, జనవరి 9: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తురుపుముక్కగా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు భావిస్తున్న ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈబీసీ) రిజర్వేషన్ బిల్లు కమలం పార్టీని విజేతగా నిలుపుతుందా? లేదంటే పరాజితగా మారుస్తుందా?.. చివరి క్షణంలో ఆదరబాదరాగా తీసుకువచ్చిన ఈబీసీ బిల్లు అగ్రకులాల మనస్సును గెలుచుకుంటుందా? లేదంటే వారి తిరస్కారానికి గురవుతుందా? అనే ప్రశ్నలకు మరి కొద్ది నెలల్లో సమాధానం లభించనున్నది. గతంలోనూ వివిధ సందర్భాల్లో ఆఖరి క్షణాల్లో బిల్లులను తీసుకువచ్చిన ఉదంతాలున్నాయి. కానీ, అవేమీ నాడు ఆయా పార్టీలకు ఓట్లు రాల్చలేదు. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు తమను ఓబీసీ జాబితాలో చేర్చాలంటూ డిమాండ్ చేసిన జాట్ల విన్నపాన్ని నాటి యూపీఏ ప్రభుత్వం మన్నించింది. అలాగే మరాఠాలకు 16 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ ఆ సామాజిక వర్గం చేసిన డిమాండ్‌కు అప్పటి మహారాష్ట్రలో కొలువుదీరిన కాంగ్రెస్-ఎన్సీపీ సంకీర్ణ సర్కారు ఆమోదముద్ర వేసింది. అయితే, ఇవేవీ తదుపరి ఎన్నికల్లో ఆ పార్టీలను గట్టెక్కించలేకపోయాయి. లోక్‌సభ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించింది. జాట్లు, మరాఠాలు బీజేపీకే ఓటు వేసినట్లు ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ సరళిని బట్టి తెలుస్తున్నది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘోర పరాభవం తప్పలేదు. మరోవైపు రైతులు, యువత ఎన్డీఏ సర్కారుపై గుర్రుగా ఉన్నారు. వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం ఈ రెండు అంశాలు ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఓటమికి కారణమైంది. కాంగ్రెస్ ప్రకటించిన రైతు రుణమాఫీ ఆయా రాష్ట్రాల్లో ఆపద్బంధువుగా పనిచేసింది. సార్వత్రిక ఎన్నికల ముంగిట్లో తాజా విజయం కాంగ్రెస్‌కు కాస్త తెరిపినిచ్చినట్లయింది. అలాగే రాఫెల్ ఒప్పందం వివాదం కూడా హస్తం పార్టీకి కలిసివచ్చింది. రాహుల్‌గాంధీ గ్రాఫ్ కాస్త పెరిగింది.


మహారాష్ట్రలో మరాఠాలకు 16 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ నాగ్‌పూర్‌లో నిర్వహించిన భారీ ర్యాలీ (ఫైల్)

అటు అగ్రకులాలు.. ఇటు దళితులు

ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంలోని కఠిన నిబంధనలపై అగ్ర కులాలు గుర్రుగా ఉన్నాయి. ఈ చట్టంలోని మార్గదర్శకాలను సవరించేందుకు బీజేపీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఈ చట్టాన్ని సాకుగా తీసుకుని తమపై కేసులు నమోదు చేస్తూ దుర్వినియోగం చేస్తున్నారని వారు కొంతకాలంగా ఆరోపిస్తున్నారు. మరోవైపు అట్రాసిటీ చట్టంలో జోక్యం చేసుకుని నిబంధనలు మార్చేందుకు కేంద్రం కుట్ర చేస్తున్నదని, బీజేపీ హయాంలో తమపై అణిచివేత ధోరణి కొనసాగుతున్నదంటూ దళితులు కాషాయ పార్టీపై ఆగ్రహంగా ఉన్నారు. దీంతో అటు అగ్రకులాలు, ఇటు దళితులు.. రెంటికి చెడ్డ రేవడిలా ఇటీవల ఎన్నికల్లో బీజేపీ ఘోరంగా దెబ్బతిన్నది. ఈ నేపథ్యంలో ఆర్థికంగా వెనుకబడిన కులా (ఈబీసీ)లకు రిజర్వేషన్ అనే సరికొత్త ఆయుధాన్ని మోదీ తన అమ్ముల పొదినుంచి బయటకు తీశారు. తద్వారా ఉత్తరాదిలో బలమైన వర్గాలైన జాట్లు, బనియాలు, పటేళ్లు, భూమిహార్, మరాఠా, బ్రాహ్మణ తదితర వర్గాల మనసు గెల్చుకునే దిశగా బీజేపీ పావులు కదిపింది. వీరిలో జాట్లు, పటేళ్లు, మరాఠాలు తమను ఓబీసీ జాబితాలో చేర్చాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ వర్గాలను ఓబీసీల్లో చేర్చితే .. ఇప్పటికే ఆ గ్రూపులో ఉన్న కులాలు ఆందోళనకు దిగే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో నొప్పించక..తానొవ్వక రీతిలో కేంద్రం జనరల్ కేటగిరీలోనే ఈబీసీలకు రిజర్వేషన్లు కల్పించింది.

ఓబీసీల్లోనూ పట్టుకు యత్నం

ఓబీసీలను ఆకట్టుకునే దిశగా కూడా బీజేపీ యత్నించింది. జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌కు రాజ్యాంగహోదా కల్పించడం, ఓబీసీల్లో వర్గీకరణ కోసం ప్రత్యేకంగా కమిషన్‌ను నియమించడం ద్వారా ఆ వర్గాలకు దగ్గరైంది. యూపీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా యాదవేతర వర్గా (ఎంబీసీ)లను ఒక్కతాటిపైకి తీసుకురావడం ద్వారా అక్కడ బీజేపీ ఘనవిజయం సాధించింది. ఎంబీసీల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించింది. ప్రధాని మోదీ కూడా తాను ఓబీసీనేనని పదేపదే చెప్పడం ద్వారా ఆ వర్గాల మద్దతు కూడగట్టే యత్నం చేశారు. మరోవైపు రైతుల్ని ఆదుకునేందుకు భారీ కార్యాచరణను ప్రకటించనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఎన్నికలకు ముందే కేంద్రం పలు పథకాల్ని ప్రకటించే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి. మరోవైపు ఈబీసీ బిల్లుకు వ్యతిరేకంగా దళితులు, ఓబీసీలు విపక్ష పార్టీలకు మద్దతిచ్చే అవకాశం లేకపోలేదని, ముఖ్యంగా యూపీ, బీహార్‌లో ఇలాంటి పరిస్థితులు ఉంటాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

కోటా బిల్లుకు రాజ్యసభ ఆమోదం

మొదటిపేజీ తరువాయి...

ఆమోదించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఆ మెజారిటీతో రాజ్యసభ ఆమోదం పొందింది. ఈ బిల్లుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఇక రాష్ట్రపతి కూడా దీనిపై తన ఆమోదముద్ర వేస్తే అది చట్టంగా రూపొంది ఆర్థికంగా వెనుకబడినవారికి విద్య, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తుంది. ఈ బిల్లుతో దేశంలో రిజర్వేషన్ల కోటా 60 శాతానికి పెరిగింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మరో రెండు రోజుల్లో ముగియనున్నాయనగా మోదీ ప్రభుత్వం అనూహ్యంగా ఈ బిల్లును తెరపైకి తెచ్చింది. బిల్లును సోమవారం క్యాబినెట్ ఆమోదించడం, ఆ మరుసటి రోజు లోక్‌సభ, ఆ తరువాత రాజ్యసభ ఆమోదించడం వెంటవెంటనే జరిగిపోయాయి. ఈ బిల్లును దాదాపు అన్ని పార్టీలు సమర్థించినప్పటికీ దానిని తీసుకువచ్చిన సమయాన్ని, దీని వెనుక ప్రభుత్వ ఉద్దేశాన్ని ప్రశ్నించాయి. రాజ్యసభ మంగళవారమే నిరవధికంగా వాయిదా పడాల్సి ఉండగా, ఈ బిల్లు కోసం బుధవారం వరకు పొడిగించారు. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలంటూ డీఎంకే సభ్యురాలు కనిమొళి ప్రతిపాదించిన తీర్మానం వీగిపోయింది. ఈ తీర్మానంపై ఓటింగ్ జరుగగా, 18 మంది అనుకూలంగా 155 మంది సభ్యులు వ్యతిరేకంగా ఓటు వేశారు. అలాగే బిల్లుకు పలువురు ప్రతిపక్ష సభ్యులు చేసిన సవరణలు కూడా ఆమోదం పొందలేదు. కొన్నింటిపై ఓటింగ్ కూడా జరిగినప్పటికీ అవి వీగిపోయాయి. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ ప్రకటించారు. బిల్లుపై జరిగిన చర్చకు సామాజిక న్యాయశాఖ మంత్రి తావర్‌చంద్ గెహ్లాట్ సమాధానమిస్తూ, కాంగ్రెస్ పార్టీ కూడా అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చిందని, వారైనా రాజ్యాంగ సవరణ చేయకుండా తమ వాగ్దానాన్ని ఎలా నెరవేర్చేవారని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు పరిశీలనలో కూడా ఈ బిల్లు నిలబడగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ బిల్లు వల్ల ఎస్సీ/ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లకు ఎటువంటి నష్టం ఉండదని అన్నారు.

నిరసనల మధ్య సభలో బిల్లు

కాంగ్రెస్‌తోపాటు ఇతర ప్రతిపక్ష పార్టీల నిరసనల మధ్య ప్రభుత్వం బుధవారం ఉదయం ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించే బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టింది. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. సభ్యుల గందరగోళం మధ్యనే సాంఘిక సంక్షేమం, సాధికారత శాఖల మంత్రి తావర్‌చంద్ గెహ్లాట్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. జనరల్ క్యాటగిరీలోని ఆర్థికంగా బలహీనవర్గాల వారికి విద్యా, ఉద్యోగాలలో 10శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఈ బిల్లును ప్రవేశపెడుతున్నామని తెలిపారు. అయితే లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రభుత్వం చేస్తున్న 'జిమ్మిక్'గా ఈ బిల్లును ప్రతిపక్షం విమర్శించింది. బిల్లును ప్రవేశపెట్టిన సమయంలో కాంగ్రెస్, డీఎంకే, ఆర్జేడీ, ఆమ్‌ఆద్మీ పార్టీల సభ్యులు వెల్‌లోకి వెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. బిల్లును పరిశీలన నిమిత్తం సెలెక్ట్ కమిటీకి పంపాలని, తన తీర్మానంపై సభలో ఓటింగ్ నిర్వహించాలని డీఎంకే సభ్యురాలు కనిమొళి డిమాండ్ చేశారు. కనిమొళి డిమాండ్‌కు కాంగ్రెస్, సీపీఐతోపాటు ఇతర పార్టీల సభ్యులు కూడా మద్దతు తెలిపారు. కానీ చర్చ జరిగిన తరువాతనే ఓటింగ్ జరుగుతుందని డిప్యూటీ చైర్మన్ తేల్చి చెప్పారు. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలన్న ప్రతిపాదనకు మద్దతునిచ్చేందుకు సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీ నిరాకరించాయి. అంతకుముందు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి విజయ్ గోయల్ మాట్లాడుతూ, పేదల సంక్షేమం కోసం తెస్తున్న బిల్లును ప్రతిపక్ష సభ్యులు అడ్డుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణను కాంగ్రెస్ నాయకుడు ఆనంద్‌శర్మ తీవ్రంగా వ్యతిరేకించారు. తాము బిల్లుకు మద్దతునిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ బిల్లు 'రాజ్యాంగ మౌలిక స్వరూపంలో జోక్యం చేసుకొనేదిగా ఉంది' అని ఆర్జేడీ సభ్యుడు మనోజ్ ఝా పేర్కొన్నారు. ఇంత తొందరపాటుగా ఈ బిల్లును ప్రవేశపెట్టాల్సిన అవసరమేమొచ్చిందని కాంగ్రెస్ సభ్యుడు మధుసూదన్ మిస్త్రీ ప్రశ్నించారు.

బిల్లు చారిత్రాత్మకం

మంత్రి గెహ్లాట్ బిల్లును ప్రవేశపెడుతూ, 'రాజ్యాంగ సవరణ బిల్లు చారిత్రకమైనది, జనరల్ క్యాటగిరీలోని పేదలకు సమాన అవకాశాలు కల్పిస్తుంది' అని పేర్కొన్నారు. మునుపటి ప్రభుత్వాలు కూడా ఇటువంటి ప్రయత్నం చేశాయని, కానీ రాజ్యాంగం ప్రకారం అటువంటి అవకాశం లేనందున కోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. అయితే నరేంద్రమోదీ ప్రభుత్వం ఆర్థికంగా బలహీనవర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఈ బిల్లును తెచ్చిందని చెప్పారు. ఇది తొందరపాటుగా తీసుకున్న నిర్ణయం కాదని అన్నారు. ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడాన్ని రాజ్యాంగం అనుమతించడం లేదని, దీంతో జనరల్ క్యాటగిరీలోని పేదలు అవకాశాలను కోల్పోతున్నారని మంత్రి చెప్పారు. తీవ్ర తర్జనభర్జన అనంతరం బిల్లును తేవాలని నిశ్చయించామని మంత్రి చెప్పారు. ఈ బిల్లు వల్ల కోట్ల మంది పేదలు లబ్ధి పొందుతారని, ఈ చారిత్రాత్మకమైన రోజును ప్రజలు ఎల్లకాలం గుర్తుపెట్టుకుంటారని అన్నారు.

దమ్ముంటే మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టండి: ఆనంద్‌శర్మ

బిల్లుపై జరిగిన చర్చలో కాంగ్రెస్ సభ్యుడు ఆనంద్‌శర్మ మాట్లాడుతూ, మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఎదురుకావడంతో ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల ముంగిట ప్రజల ముందుకు ఒక క్యారట్ విసురుతున్నారని విమర్శించారు. దమ్ముంటే మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టాలని ఆయన సవాలు చేశారు. 'బేటీ బచావో బేటీ పఢావో వంటి నినాదాలు ఇవ్వటం కాదు.. మీకు నిజంగా మహిళల పట్ల ప్రేమ ఉంటే మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టండి.. ఈ రాత్రే దానిని ఆమోదించేద్దాం' అని అన్నారు. ఓబీసీల రిజర్వేషన్ కోటాను 54 శాతానికి పెంచాలని సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు రామ్‌గోపాల్ యాదవ్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎలాగూ బద్దలుకొడుతున్నారు గనుక ఓబీసీల రిజర్వేషన్‌ను పెంచాలని చెప్పారు. బిల్లును అన్నాడీఎంకే సభ్యుడు ఏ నవనీతకృష్ణన్ వ్యతిరేకించారు. ఇది రాజ్యాంగ వ్యతిరేకమైనది, అస్థిరమైనది అని ఆయన అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యుడు సంజయ్‌సింగ్ మాట్లాడుతూ, గత 90 ఏండ్లలో ఒక్క దళితుడిని కూడా తమ అధిపతిగా ఎన్నుకోని ఆరెస్సెస్ రానున్న రోజుల్లో దళితులకు, బీసీలకున్న రిజర్వేషన్‌ను పూర్తిగా ఎత్తివేస్తుందని అన్నారు. ఆదాయం పన్ను చెల్లింపునకు వార్షిక ఆదాయ పరిమితిని రూ.2.5 లక్షలుగా ఖరారుచేసిన ప్రభుత్వం రూ.8లక్షలు వార్షికాదాయం వచ్చే వారిని పేదలుగా ఎలా విశ్లేషిస్తుందని మరో సభ్యుడు ప్రశ్నించారు.



రాజ్యసభలో ఈబీసీ బిల్లు ఆమోదం అనంతరం పార్లమెంట్‌లో కేంద్ర మంత్రులు విజయ్‌గోయల్, తావర్‌చందర్ గెహ్లాట్, అథావలే విజయ సంకేతం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా 10 శాతం కోటా



జనరల్ క్యాటగిరీలోని పేదలకు కల్పిస్తున్న 10శాతం రిజర్వేషన్ సదుపాయం ఇటు కేంద్ర, అటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు కూడా వర్తిస్తుందని న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ చెప్పారు. రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన పాల్గొంటూ, లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అవసరమైన ఆర్థిక ప్రాతిపదికను నిర్ణయించే అధికారం ఈ బిల్లు రాష్ట్రాలకు ఇస్తుందని చెప్పారు. ఈ బిల్లు ప్రకారం, వార్షికాదాయం రూ.8 లక్షలు మించనివారు, ఐదెకరాల కన్నా తక్కువ వ్యవసాయ భూమి ఉన్నవారు ఈ రిజర్వేషన్ సదుపాయం పొందేందుకు అర్హులు. అయితే ఆర్థిక వెనుకబాటుతనాన్ని ఖరారుచేసే స్వేచ్ఛను ఈ బిల్లు రాష్ట్రాలకు కల్పిస్తుందని మంత్రి రవిశంకర్ వివరించారు. ఉదాహరణకు, ఈ రిజర్వేషన్ సదుపాయం పొందేందుకు అర్హతను వార్షికాదాయం రూ.5 లక్షలుగా రాష్ట్రాలు ఖరారు చేయవచ్చని చెప్పారు. ఆ మేరకు రాజ్యాంగం రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు కల్పిస్తుందని తెలిపారు. బిల్లును హడావుడిగా ప్రవేశపెడుతున్నారన్న విమర్శకు బదులిస్తూ..'క్రికెట్‌లో చివరి ఓవర్లలో సిక్స్‌లు పడుతుంటాయి. ఇది మా మొదటి సిక్స్. మరిన్ని సిక్సర్లు పడనున్నాయి వేచి చూడండి. లోక్‌సభ ఎన్నికల్లో ఎవరు ఓడిపోవాలో ప్రజలు నిర్ణయిస్తారు' అని అన్నారు.

ఆర్థిక వెనుకబాటుపై లెక్కలు సేకరించారా?: కపిల్ సిబల్



ఈ బిల్లు మూడు నాలుగు ప్రధాన ఆటంకాలను అధిగమించాల్సి ఉంటుందని కాంగ్రెస్ నాయకుడు కపిల్ సిబల్ హెచ్చరించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సంబంధించిన జనాభా వివరాలను ప్రభుత్వం సేకరించిందా అని ఆయన ప్రశ్నించారు. ఓబీసీలు, దళితులు మెజారిటీగా ఉన్న రాష్ట్రాల్లో ఈ రిజర్వేషన్లను ఎలా అమలు చేస్తారని అడిగారు. 'ఎంతమందికి ఐదెకరాల కన్నా తక్కువ భూమి, వంద గజాల ప్లాటు, వెయ్యి గజాలలో ఇల్లు ఉంది? దీనికి సంబంధించి ఏమైనా వివరాలు సేకరించారా?ఎస్సీ/ఎస్టీ రిజర్వేషన్లపై మండల్ కమిషన్ నివేదికను అమలు చేసేందుకు పదేండ్లు పట్టింది. ఇప్పుడు ఎటువంటి జనసంఖ్య వివరాలు లేకుండా బిల్లును ఆమోదిస్తున్నారు. ఇది కూడా నోట్ల రద్దులాగా ఓ బూటకపు ఎత్తుగడగా మిగిలిపోతుంది. గత ఐదేండ్లలో మీ ప్రభుత్వం ఏటా 45 వేల ఉద్యోగాలు కల్పించామని చెప్పుకుంది. వాటిలో అగ్రకులాలలోని పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తే 4,500 ఉద్యోగాలు వస్తాయి. అంటే.. కేవలం 4,500మందికి లబ్ధి చేకూర్చేందుకు ఈ బిల్లు తెస్తున్నారా?' అని సిబల్ నిలదీశారు.

అగ్రవర్ణాలకు రిజర్వేషన్.. పిచ్చి ఆలోచన

- తీవ్రమైన రాజకీయ, ఆర్థికపరమైన సమస్యలు వస్తాయి
- నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ వ్యాఖ్య



కోల్‌కతా, జనవరి 9: ఆర్థికంగా వెనుకబడిన వారికి పది శాతం రిజర్వేషన్ కల్పించడం 'పిచ్చి ఆలోచన' అని ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయం రాజకీయంగా, ఆర్థికపరంగా తీవ్రమైన ప్రభావం చూపుతుందని చెప్పారు. పూర్వ యూపీఏ ప్రభుత్వం సాధించిన అధిక ఆర్థిక వృద్ధిని మోదీ ప్రభుత్వం నిలబెట్టుకున్నప్పటికీ.. దానిని ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలన, అందరికీ విద్య, వైద్యం కల్పించే దిశగా మార్చలేకపోయిందని అన్నారు. ఇక అగ్రకులాలలోని పేదలకు రిజర్వేషన్ కల్పించడం భిన్నమైన సమస్య అని చెప్పారు. జనాభా అంతటినీ రిజర్వేషన్ల పరిధిలోకి తీసుకొని రావడమంటే.. రిజర్వేషన్లను పూర్తిగా ఎత్తివేయడమేనని పేర్కొన్నారు. అంతిమంగా ఇది ఒక పిచ్చి ఆలోచన అని ఆయన అభివర్ణించారు. ఆర్థిక వృద్ధి అధిక స్థాయిలో ఉన్నదని మోదీ ప్రభుత్వం చెప్పుకుంటున్నదని, కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నదని అన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీ అమలును కూడా అమర్త్యసేన్ విమర్శించారు.

కేంద్ర 'పంటల బీమా' పెద్ద స్కామ్

శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్‌ఠాక్రే ఆరోపణ



బీడ్ (మహారాష్ట్ర), జనవరి 9: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు మాదిరిగానే కేంద్రం అమలుజేస్తున్న పంట బీమా పథకం కూడా అతిపెద్ద కుంభకోణం అని శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్‌ఠాక్రే ఆరోపించారు. వర్షాభావ ప్రాంతం మరట్వాడాలో పర్యటిస్తున్న ఉద్ధవ్‌ఠాక్రే బుధవారం బీడ్ జిల్లాలో జరిగిన సభలో మాట్లాడుతూ.. తరుచుగా విదేశీ పర్యటనల్లో మునిగి తేలుతున్న ప్రధాని మోదీ ప్రసంగాలు, ప్రకటనలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తమతో పొత్తు పెట్టుకోవాలని భావిస్తే, ముందుగా రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఎంత మందికి ఆర్థిక సాయం అందిందో చెప్పాలన్నారు. పంటల బీమా పథకం కింద రైతులకు రూ.2, రూ.5, రూ.50, రూ.100 విలువైన చెక్కులు వచ్చాయని ఉద్ధవ్ ఠాక్రే ఎద్దేవా చేశారు. పంటల బీమా కింద వేలకోట్లలో కుంభకోణం జరిగిందన్నారు. ప్రముఖ జర్నలిస్టు సాయినాథ్ రాసిన పుస్తకంలో పంటల బీమా పథకం.. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు మాదిరిగా అతిపెద్ద కుంభకోణం అని పేర్కొన్నారని ఉద్ధవ్ ఠాక్రే తెలిపారు.

బ్రెగ్జిట్ ప్రక్రియలో థెరెసా సర్కార్‌కు ఎదురుదెబ్బ

లండన్: యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి వైదొలిగేందుకు అవసరమైన 'బ్రెగ్జిట్' ప్రక్రియ రూపకల్పనపై ప్రధాని థెరెసా మే సారథ్యంలోని బ్రిటన్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. బుధవారం పార్లమెంట్‌లో ప్రతిపక్షం ప్రవేశపెట్టిన సవరణ బిల్లు ఆమోదం పొందింది. దీంతో బ్రెగ్జిట్ కోసం తదుపరి దశల్లో తీసుకోబోయే చర్యలను ప్రభుత్వం ప్రకటించాల్సి ఉంటుంది.

మహాకూటమిలో చేరబోము

మొదటిపేజీ తరువాయి...

పలు బీజేపీ యేతర పక్షాలు మహాకూటమిని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో నవీన్ పట్నాయక్ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకున్నది. మహాకూటమిలో బీజేడీ చేరికపై నిర్ణయం తీసుకునేందుకు మరింత సమయం అవసరమని మంగళవారం ఢిల్లీ పర్యటన సందర్భంగా చెప్పిన నవీన్ పట్నాయక్.. ఆ మరుసటి రోజే మహాకూటమిలో చేరేది లేదని ప్రకటించడం గమనార్హం. దశాబ్ద కాలానికిపైగా బీజేపీతో పొత్తు కొనసాగించడంతోపాటు 2000 నుంచి 2009 వరకు ఆ పార్టీతో కలిసి ఒడిశాలో అధికారాన్ని పంచుకున్న బీజేడీ.. 2009లో ఎన్నికల సందర్భంగా కమలనాథులతో సంబంధాలను తెంచుకున్న విషయం విదితమే. అప్పటి నుంచి ఆ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేస్తూ బీజేపీ, కాంగ్రెస్‌కు సమదూరాన్ని పాటిస్తున్నది.

నిర్మాణంలో ఉన్న భవనంలో అగ్నిప్రమాదం

ముగ్గురి పరిస్థితి విషమం
మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఘటన

నాగ్‌పూర్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నగరం కింగ్స్‌వే రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల దవాఖానలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా మారింది. ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే 10 ఫైరింజన్లు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేసేందుకు పూనుకున్నాయి. రెండో అంతస్తులో అగ్ని ప్రమాదం సంభవించినట్లు తెలుస్తున్నది. ప్రమాద సమయంలో భవనం లోపల సుమారు 200 మంది కార్మికులు చిక్కుకున్నారని అధికారులు తెలిపారు. భవనంలో చిక్కుకున్న వారిలో ఏడుగురిని అగ్నిమాపక సిబ్బంది బయటకు వెలికి తీశారు. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని తెలుస్తున్నది.

ముగ్గురు అసోం మంత్రుల రాజీనామా

పౌరసత్వ ముసాయిదా బిల్లును వ్యతిరేకిస్తూ సీఎంకు లేఖ

గువాహటి: పౌరసత్వ ముసాయిదా బిల్లును మంగళవారం లోక్‌సభ ఆమోదించడాన్ని నిరసిస్తూ అసోం గణపరిషత్(ఏజీపీ) పార్టీకి చెందిన ముగ్గురు రాష్ట్ర మంత్రులు బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా చేసిన వారిలో అసోం వ్యవసాయ శాఖ మంత్రి అతుల్ బోరా, నీటిపారుదల శాఖ మంత్రి కేశవ్ మహంతా, పౌర సరఫరాల శాఖ మంత్రి ఫణిభూషణ్ ఉన్నారు. కేంద్రం ఈ బిల్లును తీసుకురావడాన్ని నిరసిస్తూ ఇప్పటికే బీజేపీతో ఉన్న పొత్తును ఏజీపీ తెంచుకుంది. తాజాగా ముగ్గురు మంత్రులు అసోం సీఎం సర్బానంద సోనోవాల్‌కు రాజీనామా లేఖలను అందజేశారు. దీంతో అసోంలోని సంకీర్ణ ప్రభుత్వంలో మంత్రుల సంఖ్య 15కు పడిపోయింది. ఇందులో 12 మంది బీజేపీకి చెందినవాళ్లు కాగా(సీఎంతో కలిపి), ముగ్గురు బీపీఎఫ్ మంత్రులు. ఏజీపీ అధ్యక్షుడు అతుల్ బోరా మాట్లాడుతూ తమకు రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ముఖ్యమన్నారు.



ప్రపంచంలోని అన్ని దేశాలు ఏదో స్థాయిలో, ఏదో రూపంలో ఉగ్రవాదంతో బాధపడుతున్నాయి. ఈ సమస్యను సమిష్టిగా ఎదుర్కోవాలని అంతర్జాతీయ వేదికలపై భారత్ చెబుతూనే ఉన్నది. కానీ కొన్ని దేశాలు ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నాయి.

సుష్మాస్వరాజ్, కేంద్రమంత్రి

ప్రస్తుత పరిస్థితుల్లో ఉగ్రవాదం అనేది కొత్తరూపంలో వచ్చిన యుద్ధ పద్ధతిగా ఉన్నది. సోషల్ మీడియా ద్వారానే ఉగ్రవాద ప్రచారం జరుగుతున్నది. చదువుకున్న యువతనే ఎక్కువభాగం ఉగ్రవాద బాట పడుతున్నారు. వక్రీకరణ చెందిన తప్పుడు సమాచారంతోనే ఉగ్రవాదం పెరుగుతున్నది.

బిపిన్ రావత్, భారత ఆర్మీ చీఫ్



చరిత్రలో నేడు



1920
లీగ్ ఆఫ్ నేషన్స్ ప్యారిస్‌లో ప్రారంభం.

1946
ఐరాస జనరల్ అసెంబ్లీ మొదటిసారి లండన్‌లో సమావేశం.





1951
అమెరికా మాన్‌హాటన్‌లో ఐరాస ప్రధాన కార్యాలయం ప్రారంభం.

రాఫెల్ జెట్ ఫైటర్ యుద్ధవిమానాల కొనుగోలు విషయంలో కేంద్రంపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్న రాహుల్‌గాంధీ, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) ఆర్థిక దుస్థితిని ప్రధానాంశంగా చేసుకున్నారు. హెచ్ఏఎల్ ఉద్యోగులకు జీతాలు ఇచ్చేందుకు కూడా రూ.వెయ్యికోట్లు అప్పు చేయాల్సిన దుస్థితికి కేంద్రమే కారణమని ఆరోపిస్తున్నారు. రక్షణ అవసరాలు, ఉత్పత్తుల విషయంలో రాజకీయాలు మాని దేశ అవసరాలు ప్రధానంగా చర్చిస్తే దేశానికి మేలు జరుగుతుంది.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

2018లో సమ్మెలు, బంద్‌ల కారణంగా కేరళ 97 పని దినాలను నష్టపోయింది. 2019 ప్రారంభంలోనే జనవరి 3న ఓ రాజకీయ పార్టీ పిలుపుతో రాష్ట్రంలో బంద్ పాటించారు. రెండో వారంలో 48 గంటల దేశవ్యాప్త బంద్‌లో భాగంగా కేరళలో జన జీవనం స్తంభించింది. చీటికి మాటికి రాష్ట్రంలో బంద్‌లు నిర్వహించటాన్ని తప్పుబడుతూ రాబోయే రోజుల్లో ఎవరు బంద్ పిలుపు ఇవ్వాలన్నా ఏడు రోజుల ముందే తెలియజేయాలని కోర్టు ఆదేశించింది. కేరళ హైకోర్టు తీర్పు ప్రభావం దేశవ్యాప్తంగా ఉంటుందనటంలో సందేహం లేదు.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

పౌరసత్వ బిల్లు

జాతీయ రాజకీయపక్షాలు ప్రాంతీయ భావనలను ఏ మాత్రం పట్టించుకోవని, అవసరమైతే దేశంలోని భిన్నజాతుల ప్రయోజనాలను దెబ్బకొట్టడానికి ఏ మాత్రం వెనుకాడవని పౌరసత్వ (సవరణ) బిల్లు ద్వారా మరోసారి రుజువైంది. అధికారపక్షమైన బీజేపీ అనేక అభ్యంతరాల మధ్య లోక్‌సభలో ఈ వివాదాస్పద బిల్లును ఆమోదింపజేసింది. తమ ప్రాంతంలోనే తాము అల్ప సంఖ్యాకులుగా మారిపోతున్నామనే భయాందోళనలతో అస్సామీయులు కొన్నేండ్లపాటు ఉద్యమించిన నేపథ్యంలో 1985లో ప్రధాని రాజీవ్‌గాంధీ, అఖిల అసోం విద్యార్థి సంఘం సంతకాలతో అసోం ఒప్పందం కుదిరింది. 1971 ప్రాతిపదికగా విదేశీయుల గుర్తింపు జరుగాలనేది ఈ ఒప్పందంలోని కీలకాంశం. కానీ లోక్‌సభ ఆమోదించిన పౌరసత్వ సవరణ బిల్లు చట్టరూపం దాలిస్తే అసోం ఒప్పందమే నిర్వీర్యమైపోతుంది. 1971 మార్చి 24 అర్ధరాత్రి తర్వాత బంగ్లాదేశ్ నుంచి అసోంలో ప్రవేశించినవారిని గుర్తించడానికి వీలుగా జాతీయ పౌరసత్వ పట్టికను తాజాగా చేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు కూడా ఈ పౌరసత్వ సవరణ బిల్లు విరుద్ధమైంది. అసలు జాతీయ పౌరసత్వ పట్టికనే ఈ బిల్లు నిరర్థకం చేస్తుంది. కొన్ని మతాల వారికి పౌరసత్వానికి అర్హులుగా చెబుతూ ఒక మతాన్ని మినహాయించడం కూడా లౌకిక విధానాలకు విరుద్ధమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా అసోంతో సహా ఈశాన్యంలోని జాతులన్నీ భగ్గున ఆగ్రహం వ్యక్తం చేశాయి. బంద్‌లు, నిరసనలు వెల్లువెత్తాయి. అసోం గణపరిషత్ బీజేపీతో తెగతెంపులు చేసుకున్నది. బీజేపీకి మిత్రపక్షాలుగా ఉన్న ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర, నేషనల్ పీపుల్స్ పార్టీ ఆఫ్ మేఘాలయ, మిజో నేషనల్ ఫ్రంట్ తదితర ప్రాంతీయ పక్షాలన్నీ బిల్లు పట్ల ఆగ్రహంగా ఉన్నాయి. మేఘాలయ, మిజోరం ప్రభుత్వాలు బిల్లును వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేశాయి. నాగాలాండ్‌లోని ఎడీపీపీ–బీజేపీ ప్రభుత్వం ఈ బిల్లుపై పునరాలోచించుకోవలసిందిగా కేంద్రాన్ని కోరాలని నిర్ణయించాయి. మిజోనేషనల్ ఫ్రంట్ నాయకుడు, మిజోరం ముఖ్యమంత్రి జోరామ్‌తంగ ఈ బిల్లును ప్రమాదకరమైనదని అభివర్ణించారు. ఈ బిల్లు కనుక చట్టరూపం పొందితే పొరుగున ఉన్న బంగ్లాదేశ్ నుంచి అనేకమంది బౌద్ధ మతస్తులు అక్రమంగా వలసవచ్చిన మిజోరంకు సమస్యలు తప్పవని ఆయన ఆందోళన వెలిబుచ్చారు. అసోంలోని 30 తెగలు ఆందోళనకు మద్దతు ఇచ్చాయి. ఈశాన్య రాష్ట్రాల విద్యార్థి సంఘాలకు ప్రాతినిధ్యం వహించే నెసో (ఈశాన్య విద్యార్థి సంఘం) కూడా బంద్‌కు మద్దతు ఇచ్చింది. అసోంలోని కృషక్ ముక్తి సంగ్రామ్ సమితి ఆధ్వర్యంలోని దాదాపు డెబ్బయి సంఘాలు అసోం ఆర్థిక దిగ్బంధానికి పిలుపు ఇచ్చాయి. రాష్ట్రం నుంచి పెట్రోలియం, అటవీ ఉత్పత్తులతో పాటు, బొగ్గు, సున్నపురాయి నిక్షేపాల ను బయటకు తరలించకుండా నిరోధిస్తామని ప్రకటించాయి. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి ఈశాన్య ప్రాంతంలోని వివిధ జాతులు, తెగలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘాలన్నీ ఏకతాటిపై నడిచి ఆందోళన చేపట్టడం ఇదే మొదటిసారి.

> **దేశ విభజన సమయంలో పాకిస్థాన్ నుంచి అనేకమంది పశ్చిమ రాష్ట్రాల్లోకి ప్రవేశించారు. ఇదేరీతిలో తూర్పు పాకిస్థాన్ లేదా బంగ్లాదేశ్ నుంచి రెండు దశల్లో అక్కడి నుంచి వలస సాగింది. అక్కడినుంచి వచ్చిన కొన్ని మతాల వారికి ఆశ్రయం ఇవ్వడాన్ని ఎవరూ వ్యతిరేకించలేదు. కానీ అసోం, ఇతర ఈశాన్య రాష్ట్రాల సమస్య వేరు. ఇక్కడ బెంగాలీల (ఏ మతం వారైనా) సంఖ్య పెరిగిపోవడం, వారి ఆధిపత్యం స్థానికుల ఆందోళనకు కారణం. శరణార్థులు వేరు, చొరబాటుదారుల వేరు. ఈ తేడాను పట్టించుకోకుండా, ప్రధాని మోదీ మత దృక్కోణంతో ప్రవేశపెట్టిన పౌరసత్వ సవరణ బిల్లు ఈశాన్య ప్రాంతంలో అనేక సమస్యలకు దారితీస్తుంది.**

దేశ విభజన సమయంలో పాకిస్థాన్ నుంచి అనేకమంది పశ్చిమ రాష్ట్రాల్లోకి ప్రవేశించారు. ఇదేరీతిలో తూర్పు పాకిస్థాన్ లేదా బంగ్లాదేశ్ నుంచి రెండు దశల్లో అక్కడి నుంచి వలస సాగింది. అక్కడినుంచి వచ్చిన కొన్ని మతాల వారికి ఆశ్రయం ఇవ్వడాన్ని ఎవరూ వ్యతిరేకించలేదు. కానీ అసోం, ఇతర ఈశాన్య రాష్ట్రాల సమస్య వేరు. ఇక్కడ బెంగాలీల (ఏ మతం వారైనా) సంఖ్య పెరిగిపోవడం, వారి ఆధిపత్యం స్థానికుల ఆందోళనకు కారణం. శరణార్థులు వేరు, చొరబాటుదారుల వేరు. ఈ తేడాను పట్టించుకోకుండా, ప్రధాని మోదీ మత దృక్కోణంతో ప్రవేశపెట్టిన పౌరసత్వ సవరణ బిల్లు ఈశాన్య ప్రాంతంలో అనేక సమస్యలకు దారితీస్తుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈశాన్య రాష్ట్రాలను తీవ్ర నిర్లక్ష్యం చేయడం, వారి మనోభావాలను గుర్తించకపోవడం వల్ల అనేక తీవ్రవాద ఉద్యమాలు తలెత్తాయి. ఇప్పటికీ ఇంకా ఈ పోరాటాలు సద్దుమణగలేదు. అసోం మొదలుకొని ఈశాన్యంలోని అనేక సమస్యలు ముదిరిపోయి జటిలం కావడానికి దేశాన్ని ఎక్కువకాలం పరిపాలించిన కాంగ్రెస్ ప్రధాన కారణం. బెంగాలీ లాబీ ఒత్తిళ్ళకు లేదా మతపరమైన ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ నాయకులు అసోం తదితర ఈశాన్య జాతుల తెగల ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలిగించారు. ఇప్పుడు అసోం భాషా సాంస్కృతిక ప్రయోజనాలను కాపాడుతామని వాగ్దానం చేసి కేంద్రంలో, రాష్ట్రంలో అధికారానికి వచ్చిన బీజేపీ కూడా వలస ప్రజల ఓట్ల కోసం పాకులాడుతూ అదే బాటలో పయనిస్తున్నది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఈశాన్య ప్రాంతంలో 21 లోక్‌సభ సీట్లు గెలుచుకోవడమే లక్ష్యమంటూ పాచికలాడుతున్న బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా తమ విధానాల వల్ల దేశ సమగ్రతకు భంగం కలుగుతున్నదని గ్రహించకపోవడమే విషాదం. ఇప్పుడిప్పుడే ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ప్రధాన భూభాగంతో సంబంధాలు పెరుగుతున్నాయి. ఈ దశలో అత్యంత నిరంకుశ పోకడతో పౌరసత్వ సవరణ బిల్లు తేవడం ప్రమాదకరం.

జనగళం

కుటీర పరిశ్రమలు నెలకొల్పాలె

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుంచి ఎన్నో మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతుబంధు, రైతు బీమా వంటి ఎన్నో సంక్షేమ పథకాలతో టీఆర్ఎస్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచింది. అదేవిధంగా నిరుద్యోగుల సమస్యలు కూడా పరిష్కరించే దిశగా రాష్ట్రస్థాయి నుంచి మండల స్థాయి దాకా అభివృద్ధి ప్రణాళికలు రచించాలి. నిరుద్యోగ యువతకు అందులో భాగస్వామ్యం కల్పించాలి. అదేవిధంగా గ్రామస్థాయి నుంచి ఆయా ప్రాంతాలకు అనుగుణంగా కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలి. తద్వారా ఎన్నో ఏండ్లుగా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న నిరుద్యోగ సమస్యను నిర్మూలించిన వారమవుతాం. ఆ దిశగా సీఎం కేసీఆర్ చర్యలు తీసుకోవాలి. అప్పుడే నిరుద్యోగ యువతకు ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడుతుంది.

- బత్తిని లక్ష్మయ్య, మిర్యాలగూడ

జాగ్రత్తగా వ్యవహరించాలి

సీబీఐ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. రాజ్యాంగబద్ధ పదవులపై ఇలాంటి వివాదాలు రావడం శోచనీయం. వాటిని స్వతంత్రంగా పనిచేసేలా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉన్నది. కాబట్టి సుప్రీంకోర్టు తాజా తీర్పుతో అయినా కేంద్రం ఇకముందు ఇలాంటి వివాదాలు తలెత్తినప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలి.

- డాక్టర్ ఎండీ ఆదిల్, అంబర్‌పేట్, హైదరాబాద్

విలువలు పెంచే విద్య కావాలె

సమాజంలో నానాటికీ హింస, అరాచకాలు పెరిగిపోతున్నాయి. అక్షరాస్యత శాతం పెరుగుతున్నా విలువలు ప్రాతిపదికగా విద్యాబోధన జరుగకపోవటం కారణంగా రోజురోజుకూ హింసా దౌర్జన్యాలు పెరుగుతున్నాయి. ఇప్పటికైనా విద్యాబోధనలో విద్యాప్రమాణాలతో పాటు, విలువలు పునాదిగా విద్యాబోధన జరుగాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. దీనికి అన్నిస్థాయిల్లో ప్రభుత్వాలు కృషిచేయాలి.

- ఫజల్ అహ్మద్, అక్బర్‌బాగ్, హైదరాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ఆలోకన



టంకశాల అశోక్

పది శాతం నిర్ణయం సరైనదే

యాభై శాతం పరిమితి భంగపాటును ఆహ్వానించటం మొదట జరుగాలి. అది చారిత్రకమైన ఒక ఇనుప చట్రానికి చారిత్రకమైన భంగపాటు అవుతుంది. ఆ తర్వాత 60 శాతం పరిమితి భంగపాటుకు, తమిళనాడు నమూనాకు తెలంగాణ వలెనే అన్ని రాష్ట్రాలు పట్టుబట్టాలి. ఇంద్రా సాహ్నీ తీర్పులో కోర్టు వారు పరిస్థితిని, వాస్తవ గణాంకాలను బట్టి యాభై శాతం పరిమితిని అధిగమించవచ్చుననే సూచన చేసినప్పుడే ఆ మేరకు సర్వేల కోసం, రాజ్యాంగ మార్పుల కోసం పట్టుబట్టవలసిన బలహీనవర్గాలు, రాష్ట్రాలు కొన్ని దశాబ్దాల పాటు దారుణంగా విఫలమయ్యాయి. కనీసం ఈ చారిత్రక అవకాశాన్ని ఉపయోగించుకొని అందుకు పూనుకోవాలి.

కులాలతో నిమిత్తం లేకుండా పేదవారి కోసం విద్య, ఉద్యోగరంగాల్లో 10 శాతం అవకాశాలను రిజర్వ్ చేస్తూ పార్లమెంట్ తీసుకున్న నిర్ణయం సరైనదే. ఇటువంటి బిల్లును నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రస్తుత పార్లమెంట్ కాలపు చివరి సమావేశాలలో చివరి రోజున ప్రతిపాదించటం, మరికొద్ది మాసాలలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రయోజనం కోసమన్నది స్పష్టమే. క్రమంగా ప్రతిష్ఠ దెబ్బతింటున్న బీజేపీ వీలైనంత నష్ట నివారణ కోసం తీసుకుంటున్న, తీసుకోగల చర్యలలో ఇది ఒకటి. ప్రధానమంత్రి ఏ ఉద్దేశం కోసం ఈ పనిచేసినా, అందుకు మనం ఆయనను విమర్శించినా, యథాతథంగా ఆ చర్య వల్ల కలిగే మంచిని విస్మరించటం కూడా సరికాబోదు. రెండింటినీ వేరుచేసి చూడాలి. మంచి చేసే ఉద్దేశం స్వయంగా లేకపోయినా ఎన్నికల కోసమో, మరొక ప్రయోజనం కోసమో, లేక ప్రజల నుంచి వచ్చే ఒత్తిళ్ల వల్లనో కొన్ని మంచి పనులు అప్పుడప్పుడు చేయటం అన్ని పార్టీలు చేస్తుండే పనే.

అందువల్లనే ఈ బిల్లుపై పార్లమెంట్‌లో చర్చ జరిగినప్పుడు ప్రతిపక్షాలు కూడా అందులోని రాజకీయ ఉద్దేశాలను ఆక్షేపిస్తూనే, బిల్లు వల్ల మంచి జరుగుతుందంటూ బలపరిచాయి. పార్లమెంట్‌కు బయటి సంస్థలు అనేకం కూడా అదే వైఖరి తీసుకున్నాయి. ఈ చర్యలో కొన్ని ప్రశ్నలు ఉన్నాయి. ఇది కోర్టుల విచారణకు నిలబడుతుందా లేదా అనేది తక్షణమైనది, అన్నింటికన్న ముఖ్యమైనది. ఇందుకు సమాధానం కోర్టు తీర్పు ద్వారా తెలియగలది మాత్రమే గనుక ఇప్పుడు ఊహించలేము. రిజర్వేషన్ల పరిమాణం యాభై శాతానికి మించరాదని ఇంద్రా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పటం, తర్వాత హైకోర్టులు అదే గీటురాయిని పాటించటం తెలిసిందే. అందువల్ల ఈ తాజా 10 శాతం రిజర్వేషన్ నిలబడదన్న అభిప్రాయం విస్తృతంగా ఉంది. ఇది తేలికగా కొట్టివేయగలది కాదు. అదే సమయంలో రెండు అంశాలను గుర్తించాలి. యాభై శాతం అన్నది అంతిమం కాదన్న సూచన కూడా అదే ఇంద్రా సాహ్నీ తీర్పులో ఉన్నది. నిర్దిష్ట పరిస్థితులు, నిర్ధారిత గణాంక వివరాలు ఉన్నట్లయితే రాష్ట్రాలు తమ నిర్ణయం తాము తీసుకోవచ్చునని కోర్టు ప్రకటించింది. తర్వాత కాలంలో కొన్ని అదనపు రిజర్వేషన్లను కొట్టివేసినప్పుడు న్యాయమూర్తులు ఎత్తిచూపిన ఒక విషయం అందుకు తగిన సర్వే, గణాంక వివర సేకరణ జరుగలేదని. కనుకనే బలహీన వర్గాల సంఘాలు దేశవ్యాప్తంగా కులగణన జరుగాలని కోరుకున్నాయి. అందుకు కేంద్రం ఇటీవలనే సూత్రప్రాయంగా అంగీకరించింది గనుక, భవిష్యత్తులో కొన్ని సమస్యలు పరిష్కారం కాగలవని భావించవచ్చు.

గుర్తించవలసిన మొదటి విషయం ఇది కాగా రెండవది, మంగళవారం నాటి లోక్‌సభ చర్చ సందర్భంగా ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ సభ దృష్టికి తెచ్చిన విషయం. యాభై శాతం పరిమితిని కోర్టు ఆర్టికల్ 16(4) కింద దకు వచ్చే సామాజిక–విద్య వెనుకబాటుతనం విషయంలోనే విధించిందని, ఆ విధంగా ఆ పరిమితిలోకి ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉమ్మడిగా వస్తారని, సామాజిక–విద్య వెనుకబాటుతనం వర్గీకరణలోకి రాని ఇతర కులాలకు ఆ పరిమితి వర్తించదని అన్నారాయన. ఇది కొత్త తరహా వివరణ అయినట్లు తోస్తున్నది. ఆ మాట నిజమైతే కోర్టులు దానిని ఆమోదించేదీ లేనిది తెలియదు. అదే సమయంలో, రాజ్యాంగస్ఫూర్తిని బట్టి చూసినప్పుడు జైట్లీ వివరణలో ఒక లోపం ఉన్నది. రాజ్యాంగ నిర్మాతలు రిజర్వేషన్ అనే ఆలోచన చేయటానికి మూల కారణం కొన్నివర్గాల సామాజిక వెనుకబాటుతనం. వారిపట్ల సామాజిక వివక్ష. విద్యా వెనుకబాటుతనం కన్న అది ముఖ్యమైనది. భారత సమాజంలోని సామాజిక వివక్షలు వేల సంవత్సరాలుగా అతి హీనమైన విధంగా కొనసాగుతున్నాయి. వీరిలోని ఎంతో విద్యావంతులు, సంపన్నులు కూడా చిన్నచూపునకు గురవుతున్నారు. ఆ దృష్టితో సామాజిక వివక్ష అన్నదే రిజర్వేషన్లకు మూల కారణం అయింది. విద్యా వెనుకబాటుతనానికి కారణం కూడా సామాజిక వివక్షే. అందువల్ల సామాజికం తర్వాత విద్య వచ్చింది. పేదరికపు స్థితి ఒక్కోసారి అతి త్వరగా కూడా మారవచ్చు. కనుకనే అది 60 (50 ప్లస్ 10) శాతం వద్ద ఎందుకు ఆగాలన్నది వాటిలో మొదటిది. ఏదైనా పరిస్థితులను బట్టి జరుగుతున్నప్పుడు, అదే పరిస్థితుల కారణంగా 60 శాతం పరిమితి కూడా భంగపడవలసి ఉంటుంది. తమిళనాడు వంటి రాష్ట్రాలు ఇప్పటికే ఆ పని చేశాయి. అసలు అట్లాంటి అత్యధిక రిజర్వేషన్ల సంప్రదాయం రాజ్యాంగం అమలుకు రాకముందు బ్రిటిష్ పాలనాకాలంలో, సంస్థానాల దశలోనే మొదలైంది. దేశంలో గాని, రాష్ట్రాలలో గాని రిజర్వేషన్లు బడుగు బలహీన వర్గాల జనసంఖ్య ప్రాతిపదికగా ఉండాలి అనే డిమాండ్లు ఎప్పటినుంచో ఉన్నాయి. ఆ ప్రాతిపదికను బట్టి నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ బలంగా కోరుతున్నారు. ఆ పార్టీ ఎంపీలు ఈ బిల్లుపై చర్చ సందర్భంగా అదే విషయం పార్లమెంట్ ముందుకుతెచ్చారు. దేశానికంతా ఒకే పద్ధతి ఉండాలి గాని ఒక్కో రాష్ట్రంలో ఒక్కొక్కటి ఎందుకని ప్రశ్నించారు. ఇప్పుడీ బిల్లు వల్ల కేంద్రానిది ఇంకొక పద్ధతి అవుతున్నది.

> **ఇక అగ్ర వర్ణాలలోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు తప్పక సమర్థించవలసినవే. వారిది కులం ఏదైనా పేదలు. ఈ దేశ ప్రజలు. తమ కులాలకు చెందిన సంపన్నులతో విద్యా, ఉద్యోగ విషయాల్లో పోటీ పడలేక తరతరాలుగా మగ్గిపోతున్నారు. వారికి న్యాయం జరుగాలనటంలో న్యాయం, సహజ న్యాయం, సమభావన, మానవత్వం, సామాజిక దృష్టి, రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల స్ఫూర్తి అన్నీ ఉన్నాయి.**

రాజ్యాంగ నిర్మాతలు సామాజిక వివక్ష లేని కులాలకు రిజర్వేషన్ల విషయాన్ని అసలు ఆలోచించలేదు. అటువంటి స్థితిలో, జైట్లీ భాష్యం సృజనాత్మకంగా అయితే కనిపిస్తున్నది గాని, న్యాయస్థానాల పరిశీలనకు నిలువగలదా అన్నది ప్రశ్న.

జైట్లీ తన ప్రసంగంలో మరొక ముఖ్యమైన విషయం ప్రస్తావించారు. ఆదేశిక సూత్రాలు పౌరులందరికీ సామాజిక, ఆర్థిక న్యాయం కోసం హామీ ఇస్తున్నాయని అన్నారాయన. అటువంటి స్థితిలో అగ్రకులాలకు ఆర్థిక న్యాయం చేకూరేందుకు అభ్యంతరం ఉండకూడదన్నది ఆయన భావం. ఇది నిజమే గాని, అటువంటి న్యాయాన్ని, సామాజిక వివక్ష అనే కోణంతో అవినాభావ సంబంధం గల రిజర్వేషన్లు అనే ఏర్పాటుతో విడదీసి చూస్తూ, అగ్రకులాలలోని పేదల అభ్యున్నతి కోసం ప్రత్యేక విద్యా, ఆర్థిక పథకాలను అమలుపరుచడం సరైనదనే వాదన ఒకటున్నది. దీనిపై ప్రభుత్వ ఆలోచన ఏమిటో జైట్లీ వివరణల ద్వారా తెలియరాలేదు. ఇటువంటి ప్రశ్నలపై లోగడ వ్యాఖ్యలు చేసిన న్యాయమూర్తులు ఈసారి ఏ వైఖరి తీసుకోగలరన్నది వేచి చూడవలసిన మరొక విషయం.


ఒకవేళ బిల్లు/ చట్టం ఇటువంటి అన్ని అవరోధాలను గడిచి అమలుకు వచ్చిన పక్షంలో అప్పుడు ఇతర విషయాలు కొన్ని ముందుకు వస్తాయి. ఒకసారి యాభై శాతం పరిమితిని భంగపరచటమంటూ జరిగితే అవుతున్నది.

అందువల్ల, యాభై శాతం పరిమితి భంగపాటును ఆహ్వానించటం మొదట జరుగాలి. అది చారిత్రకమైన ఒక ఇనుప చట్రానికి చారిత్రకమైన భంగపాటు అవుతుంది. ఆ తర్వాత 60 శాతం పరిమితి భంగపాటుకు, తమిళనాడు నమూనాకు తెలంగాణ వలెనే అన్ని రాష్ట్రాలు పట్టుబట్టాలి. ఇంద్రా సాహ్నీ తీర్పులో కోర్టు వారు పరిస్థితిని, వాస్తవ గణాంకాలను బట్టి యాభై శాతం పరిమితిని అధిగమించవచ్చుననే సూచన చేసినప్పుడే ఆ మేరకు సర్వేల కోసం, రాజ్యాంగ మార్పుల కోసం పట్టుబట్టవలసిన బలహీన వర్గాలు, రాష్ట్రాలు కొన్ని దశాబ్దాల పాటు దారుణంగా విఫలమయ్యాయి. కనీసం ఈ చారిత్రక అవకాశాన్ని ఉపయోగించుకొని అందుకు పూనుకోవాలి.

ఇక అగ్ర వర్ణాలలోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు తప్పక సమర్థించవలసినవే. వారిది కులం ఏదైనా పేదలు. ఈ దేశ ప్రజలు. తమ కులాలకు చెందిన సంపన్నులతో విద్యా, ఉద్యోగ విషయాల్లో పోటీ పడలేక తరతరాలుగా మగ్గిపోతున్నారు. వారికి న్యాయం జరుగాలనటంలో న్యాయం, సహజ న్యాయం, సమభావన, మానవత్వం, సామాజిక దృష్టి, రాజ్యాంగంలోని ఆదేశికసూత్రాల స్ఫూర్తి అన్నీ ఉన్నాయి.

కులాతీతంగా ఈబీసీ రిజర్వేషన్లు!

విశ్లేషణ



బి.ఎస్.రాములు

కేంద్రం ఆదరబాదరగా లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగరంగాల్లో రిజర్వేషన్లు అంటూ నిర్ణయించింది. దీనిపై లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టడం కోల్పోతున్న ప్రతిష్ఠ నుంచి మతం ప్రాతిపదిక ఇక ఎంతమాత్రం పాచిక పనిచేయడం లేదని గమనించి సామాజిక వర్గాల మధ్య సంఘర్షణాయుత చర్చను లేవదీసి తద్వారా మౌలిక సమస్యలను పక్కదారి పట్టించడానికి చేసే ప్రయత్నంలో భాగమే. అయితే ఆర్థికంగా వెనుకబడిన సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు ఇప్పటికైనా, ఎప్పటికైనా అవసరమే. కోట్ల సంపద కలిగిన వారితో జనరల్ క్యాటగిరిలో పోటీపడి ఉన్నత ఉద్యోగాలు, ఉన్నత పదవులు సాధించడం అంత సులభం కాదు.

ఢిల్లీ, బెంగళూరు, ముంబై, చెన్నై వంటి నగరాల్లో లక్షలు పోసి కోచింగ్‌లు పొందిన సంపన్నవర్గాల అభ్యర్థులతో గ్రామాల్లో, పట్టణాల్లో వ్యవసాయం, చిన్నచిన్న వృత్తులు చేసుకుంటూ బతికే అగ్రవర్ణ పేదలకు అవకాశాలు అందుకోవడం గగనకుసుమంగా మారింది. ఈ అసంతృప్తినే కొన్ని సామాజికవర్గాలు, పార్టీలు బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఆయా సామాజికవర్గాల అభివృద్ధి, సంక్షేమానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టి సంఘర్షణలు సృష్టిస్తూ వస్తున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన పేదలకు జనరల్ క్యాటగిరిలోని 50 శాతంలో 25 శాతం క్రీమీలేయర్ ప్రవేశపెట్టి అమలు జరుపడం అవసరం. ఎందుకంటే దేశంలో సంపన్నుల కన్నా, పేదలే ఎన్నో రెట్లు ఎక్కువ. సబ్సిడీ బియ్యం, రేషన్‌కార్డులు అందుకు సాక్ష్యం. అందువల్ల పేదలు అందుకోలేకపోతున్న అవకాశాలను కాలానుగుణంగా సామాజికంగా, విద్యాపరంగానే కాకుండా ఆర్థికంగా, ఉద్యోగపరంగా, వెనుకబడిన వర్గాలకు జనరల్ క్యాటగిరిలో ఈబీసీ రిజర్వేషన్లు 25 శాతానికి మించి ప్రవేశపెట్టడం అవసరం.

అయితే 1990 నుంచి వేగం పుంజుకున్న ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ ఆర్థిక విధానాల వల్ల విద్య, ఉద్యోగ, పారిశ్రామికరంగాల్లో ప్రైవేటీకరణ పెరిగిపోయింది. అందువల్ల ఏడుగురు మించి ఉన్న ప్రతి సంస్థలో ఉద్యోగరంగంలో, పారిశ్రామిక రంగంలో, విద్యారంగంలో, ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు జరుపడం ద్వారా వాటితో పాటు, ఆర్థికంగా వెనుకబడిన పేదలకు 25 శాతం జనరల్ క్యాటగిరిలో రిజర్వేషన్లు అమలు జరుపాలి. తద్వారా జనాభా ప్రాతిపదికన అభివృద్ధి ఫలాలు, సంక్షేమ ఫలాలు అందుకునే అవకాశం ఉంటుంది. సామాజిక న్యాయం అంటే కులాలవారీగా మతాల వారీగా మాత్రమే కాకుండా, గ్రామాల వారీగా, కుటుంబాల వారీగా, నియోజకవర్గాల వారీగా, పేదరికం వారీగా పరిశీలించి అమలు జరుపడం ఎంతో అవసరం.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు దేశంలో 70 శాతం. తెలంగాణ రాష్ట్రంలో 85–89 శాతం జనాభాగా ఉన్నారు. 20–25 శాతంగా ఉన్న సామాజికంగా, చారిత్రకంగా గౌరవాలు పొందుతున్న కులాలు 20–25 శాతం మాత్రమే. వీరిలో పేదలు ఈబీసీ రిజర్వేషన్ల ద్వారా కొంత లబ్ధి పొందే అవకాశం ఉన్నది. జనరల్ క్యాటగిరీలోని ఈబీసీ రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సామాజికవర్గాల వారందరికి వర్తిస్తాయి. పేదరికానికి కులం, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది.

రాజ్యాంగం మూడు అంశాలపై ప్రజాస్వామ్య మూలస్తంభాలుగా పేర్కొన్నది. చట్టసభలు, పరిపాలనా యంత్రాంగం, న్యాయవ్యవస్థ అనేవి మూడు మూల స్తంభాలు. చట్టసభల్లో ప్రాదేశిక నియోజకవర్గాల ప్రాతినిధ్యం ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు కొంత శాతం చట్టసభల్లో రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. మహిళలకు, బీసీలకు చట్టసభల్లో, న్యాయ వ్యవస్థలో రిజర్వేషన్లు అమల్లోకి రావాలని చాలాకాలంగా బిల్లులు లోక్‌సభలో పెండింగ్‌లో ఉన్నాయి. వీటి గురించి పట్టించుకోకుండా, అకస్మాత్తుగా ఆర్థికంగా వెనుకబడిన సామాజికవర్గాల రిజర్వేషన్ల బిల్లును ముం దుకు తీసుకురావడం ప్రస్తుత సందర్భం.

కేంద్రంలో 1993 నుంచి ప్రవేశపెట్టిన ఓబీసీ రిజర్వేషన్లు 27 శాతానికి గాను 7–11 శాతం మాత్రమే అమలవుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతం ఉన్నాయి కాబట్టి సగం ఉద్యోగాలు, విద్యావకాశాలు వీరికే చెందాల్సి ఉన్నది. అందుకని ఆయా రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు పరీక్ష ఒక్కటే అయినప్పటికీ రిజర్వేషన్ల కోసం ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్ వ్యవస్థ ఏర్పాటు చేసి రిజర్వేషన్లు నింపడం చారిత్రక అవసరం. ప్రభుత్వం నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం పొందిన ప్రైవేట్ పరిశ్రమలు, సంస్థలు అన్నిటిలో రిజర్వేషన్లు అమలు జరుపడం ద్వారా అందరికీ సామాజికన్యాయం, అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందుతాయి. రిజర్వేషన్ల క్యాటగిరీ విద్యార్థులను, అభ్యర్థులను, ఉద్యోగులను వారి నైపుణ్యాలను తీర్చిదిద్దాల్సిన ప్రత్యేక కర్తవ్యం కూడా అనివార్యంగా ముందుకు వస్తుంది. అందువల్ల నియోజక వర్గాల వారీగా, సామాజిక వర్గాల వారీగా, కుటుంబాల వారీగా, చట్టసభల్లో వలె న్యాయవ్యవస్థలో, పరిపాలనా యంత్రాంగంలో ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమల్లో, సమస్త విద్యాసంస్థల్లో, సైనిక రంగాల్లో, శాస్త్ర సాంకేతిక రంగాల్లో రిజర్వేషన్లు అమలుజరిపి నైపుణ్యాలు పెంపొందించడం చారిత్రక ఆవశ్యకత. అప్పుడే సమాజం సమతలంగా అభివృద్ధి చెందుతుంది.

ఇకపోతే అందరు ప్రచారం చేస్తున్నట్టు ఈబీసీ రిజర్వేషన్లు అగ్రకుల పేదలకే పరిమితం కాదు. ఈబీసీ రిజర్వేషన్లు అన్ని కులాలకు, అన్ని మతాలకు వర్తిస్తాయి. కులం సర్టిఫికెట్ లేనివారికి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అనే తేడా లేకుండా అందరికీ నూతన అవకాశాలు పెరుగుతాయి. బీసీలందరూ ఈబీసీ రిజర్వేషన్ల ద్వారా క్రీమీలేయర్ పరిమితిలో అవకాశాలు పెరుగుతాయి.

జనాభా ప్రాతిపదికపై బీసీ రిజర్వేషన్లు పెంచాల్సి ఉన్నది. బీసీ (ఈ) గ్రూపునకు పెంచిన రిజర్వేషన్లను కూడా కేంద్రం ఆమోదించడం ద్వారా సామాజిక సామరస్యం వెల్లివిరుస్తుంది. ఇవి అందరికి వర్తిస్తాయి. దీంతో అగ్రకుల రిజర్వేషన్ ఉద్యమాలు సృష్టించే సంఘర్షణలకు ఒక ముగింపు లభిస్తుందని ఆశించవచ్చు. 25 శాతానికి ఈబీసీ క్రీమీలేయర్ పెట్టాలని నేను కోరుతున్నాను.ప్రస్తుతం 10శాతం పెట్టారు. ఇంకా 15 శాతం కూడా క్రీమీ లేయర్ పరిధిలోకి తెస్తేనే గ్రామీణ, పట్టణ పేదలకు న్యాయం జరుగుతుంది. అగ్రవర్ణాలుగా పరిగణింపబడుతున్న వారిలోని పేదలు వందల వేల కోట్ల సంపన్నులతో జనరల్ క్యాటగిరీలో పోటీపడలేక దశాబ్దాలుగా వెనుకబడిపోతున్నారు. ఇది అమలైతే కొంత స్వాంతన లభిస్తుంది. తద్వారా రిజర్వేషన్లను వ్యతిరేకించే ప్రస్తుత దశ నుంచి రిజర్వేషన్లను సమర్థించే దిశగా ఎదుగుతారు. అలాగే చట్టసభల్లో, న్యాయవ్యవస్థలో బీసీలకు, మహిళలకు రిజర్వేషన్లు అవసరం. చట్టసభల్లో వలె ఉద్యోగ రంగంలో, న్యాయవ్యవస్థలో ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా అమలు జరిగినప్పుడే పూర్తిస్థాయి ప్రజాస్వామ్య వాతావరణం సమాజంలో నెలకొంటుంది. అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందరికీ అనుభవంలోకి వస్తాయి.

> **అగ్రవర్ణాలుగా పరిగణింపబడుతున్న వారిలోని పేదలు వందల వేల కోట్ల సంపన్నులతో జనరల్ క్యాటగిరీలో పోటీపడలేక దశాబ్దాలుగా వెనుకబడిపోతున్నారు. ఇది అమలైతే కొంత స్వాంతన లభిస్తుంది. తద్వారా రిజర్వేషన్లను వ్యతిరేకించే ప్రస్తుత దశ నుంచి రిజర్వేషన్లను సమర్థించే దిశగా ఎదుగుతారు. అలాగే చట్టసభల్లో, న్యాయవ్యవస్థలో బీసీలకు, మహిళలకు రిజర్వేషన్లు అవసరం.**

(వ్యాసకర్త: రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy**. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

కోకాకోలా లాటరీ పేరుతో
కోటి టోకరా!

ముఠాను ఢిల్లీలో అరెస్టుచేసిన వరంగల్ పోలీసులు ■ రూ.2 లక్షలు స్వాధీనం, బ్యాంకు ఖాతా సీజ్



వరంగల్‌లో కేసు వివరాలు వెల్లడిస్తున్న సీపీ విశ్వనాథ్‌రవీందర్

వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ: కొకకోలా లాటరీ వచ్చిందంటూ యువకులను నమ్మించి రూ.కోటి వరకు వసూలుచేసిన నైజీరియన్ మోసగాడితోపాటు నాగాలాండ్ రాష్ట్రానికి చెందిన ఓ యువతిని బుధవారం వరంగల్ జిల్లా శాయంపేట పోలీసులు ఢిల్లీలో అరెస్ట్‌చేశారు. నిందితుల నుంచి రూ.2 లక్షలు నగదు స్వాధీనం చేసుకోవడంతోపాటు బ్యాంక్ ఖాతాల్లోని రూ.28 లక్షలను సీజ్‌చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సీపీ విశ్వనాథ్ రవీందర్ కేసు వివరాలు వెల్లడించారు. శాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మైలారం గ్రామానికి చెందిన సిరిపురం మహేందర్‌కు 2017 ఏప్రిల్‌లో 'మీకు కోకాకోలా ఆన్‌లైన్ లాటరీ వచ్చింది. దాని విలువ రూ.4.45 కోట్లు. మీ పేరు, చిరునామా, ఫోన్ నెంబర్‌తోపాటు బ్యాంక్ ఖాతా వివరాలు మాకు మెయిల్ చేయండి' అంటూ ఓ ఎస్సెమ్మెస్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను మెయిల్ చేశాడు. తర్వాత ఢిల్లీకి మాథ్యూస్ అనే వ్యక్తి ఫోన్‌చేసి రిజిస్ట్రేషన్ చార్జీల రూ.1.80 లక్షలు కట్టించుకున్నాడు. ఆ తర్వాత వివిధ చార్జీల పేరుతో 12 బ్యాంకు ఖాతాల్లో రూ.10 లక్షల వరకు డిపాజిట్ చేశాడు. అయినా డబ్బు రాకపోవడం, వీరి వ్యవహారశైలిపై అనుమానం రావడంతో మహేందర్ శాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గతంలో జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన కరికే భరత్ కుమార్ అనే యువకుడిని సైతం ఇదేవిధంగా లాటరీపేరుతో నమ్మించి 24 బ్యాంక్ ఖాతాల్లో రూ.71 లక్షలు డిపాజిట్ చేయించుకొని మోసం చేశారు. వరంగల్ కమిషనరేట్ సైబర్ క్రైం పోలీసులు ఈ రెండు ఘటనలపై దర్యాప్తు జరిపి ఢిల్లీ కేంద్రంగా మోసాలు జరిగినట్టు నిర్ధారించారు. నిందితులను పట్టుకునేందుకు పరకాల ఏసీపీ వైవీఎస్ సుధీంద్ర పర్యవేక్షణలో శాయంపేట ఇన్‌స్పెక్టర్ సాదుల్లాబాబా నేతృత్వంలో రెండు ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఢిల్లీకి వెళ్లాయి. నైజీరియా దేశానికి చెందిన డిమ్యూయేన్ ఉచెన్ (37) ఈ మోసాలకు పాల్పడుతున్నట్టు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నాయి. అతడికి సహకరిస్తున్న నాగాలాండ్ రాష్ట్రం డిమాపూర్ జిల్లా అంగామి గ్రామానికి చెందిన హీనియాను కూడా అదుపులోకి తీసుకున్నారు. నగదుతోపాటు రెండు ల్యాప్‌టాపలు, 23 సెల్‌ఫోన్‌లు, విదేశీ పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక కోర్టు అనుమతితో నిందితులను వరంగల్‌కు తరలించారు. వీరిద్దరూ ఇప్పటివరకు ఆరు కేసుల్లో సుమారు రూ.కోటి వరకు వసూలు చేసినట్టు గుర్తించారు. వీరిపై వరంగల్, హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో కేసులు నమోదైనట్టు పోలీసులు తెలిపారు.



సిద్దిపేటలో హరితహోటల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

పరిశ్రమలతో యువతకు ఉపాధి

సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ: సిద్దిపేట జిల్లా ముండ్రాయి, రాజగోపాల్‌పేట, మందపల్లి ఇండస్ట్రీయల్ కారిడార్‌లో ఏర్పాటు చేయనున్న డీఎక్స్‌ఎన్ పరిశ్రమతో 2400 మందికి ఉద్యోగాలు లభించనున్నట్టు మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఆయన సిద్దిపేటలో పట్టణ అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. నాగులబండ వద్ద నిర్మిస్తున్న ఎల్వీ ప్రసాద్ ఐ దవాఖాన, త్రీస్టార్ టూరిజం హోటల్ నిర్మాణపనులను మున్సిపల్ చైర్మన్ రాజనర్సుతోకలిసి పరిశీలించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ నాలుగు నెలల్లోగా హరిత హోటల్‌ను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడడం తమ బాధ్యత అని పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు. సమావేశంలో టీఎస్‌ఐఐసీ డీఎం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కీతవారిగూడెం పార్వతీరామలింగేశ్వరస్వామి దేవాలయంలోని పార్వతీదేవి అమ్మవారి విగ్రహాన్ని బుధవారం సూర్యకిరణాలు తాకాయి. దక్షిణాయనం చివరి సమయంలో ఇలా అమ్మవారి విగ్రహాన్ని సూర్యకిరణాలు తాకుతాయని, ఈ సమయంలో అమ్మవారిని దర్శించుకుంటే శుభాలు కలుగుతాయని అర్చకుడు శ్రీరామయ్యశర్మ తెలిపారు. -గరిడేపల్లి



వెల్లివిరిసిన మతసామరస్యం

■ **అయ్యప్ప స్వాములకు మసీద్‌కమిటీ సభ్యుల భిక్ష**

వీర్నపల్లి: రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలకేంద్రంలో అయ్యప్పస్వామి భక్తులకు ముస్లిం సోదరులు అన్నదానంచేసి మతసామరస్యాన్ని చాటారు. వీర్నపల్లిలో బుధవారం అయ్యప్పదీక్షలో ఉన్న భక్తులకు మసీద్ కమిటీ సభ్యులు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నీలం రాజేశ్‌బాబు, గురుస్వామి రాములు, గుగులోతు తిరుపతి, దేశరాజు మణికంఠ, నేరెళ్ల ముత్యం ఉన్నారు.



గద్వాలలో టీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో టీఆర్‌ఎస్‌లో చేరినవారికి కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌లో టీఆర్‌ఎస్‌లో చేరినవారికి కండువాలు కప్పుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఏకగ్రీవాలకు అందరూ కలిసిరావాలి ■ మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి పిలుపు ■ టీఆర్‌ఎస్‌లోకి కొనసాగుతున్న చేరికలు

గ్రామ స్వరాజ్యం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: రాజకీయాలకతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాలకు అందరూ కలిసి రావాలని సూచించారు. గ్రామాలను ఏకగ్రీవంగా చేసుకుంటే ప్రభుత్వం రూ.15 లక్షలతో పాటు తాను ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.5 లక్షలు అందజేస్తానని తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని భక్తళాపురంలో బీజేపీకి చెందిన 250 మంది, రంగయ్యగూడెం, దూపాడ్, భాగ్యతండాలకు చెందిన పలువురు పలువురు టీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నాయకులంతా టీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు.

✦ నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, దామరచర్ల మండలాలకు చెందిన 300 మంది ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సమక్షంలో, నిడమనూరు మండలం వెనిగండ్ల గ్రామానికి చెందిన 50 మంది సాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య సమక్షంలో, సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని లక్ష్మాపురానికి చెందిన 30 మంది ఎమ్మెల్యే గాదరి కిశోర్ సమక్షంలో, చిలుకూరు మండలం రామచంద్రానగర్‌కు చెందిన 200 మంది కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సమక్షంలో, హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన 350 మంది టీఆర్‌ఎస్ రాష్ట్రనాయకుడు శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

✦ వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గానికి చెందిన 290 మంది ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో, కన్నారావుపేట శివారు పద్మాపురానికి చెందిన 30 మంది జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీ సమక్షంలో, నెక్కొండలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 20 మంది, వెంకటాపురానికి చెందిన కాంగ్రెస్ నాయకులు 20 మంది ఎంపీపీ గటిక అజయ్‌కుమార్ సమక్షంలో, జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు 50 మంది ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

✦ నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో, బిజినేపల్లి మండల కేంద్రానికి చెందిన 30 మంది ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో, జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం మల్లెందొడ్డి, కుర్తిరావుల చెర్వు గ్రామాలకు చెందిన 50 మంది ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం రూప్లాతండాకు చెందిన పలువురు టీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బదావత్‌శర్మ నాయక్, భీమ్‌గల్ సహకార సంఘం అధ్యక్షుడు చౌట్‌పల్లి రవి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.



సూర్యాపేట జిల్లా భక్తళాపురంలో బీజేపీ నాయకులకు గులాబీ కండువాలు కప్పి టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

అటవీశాఖలో ఇంటిదొంగలు

వేటగాళ్లు, స్మగ్లర్లకు సహకరించిన ముగ్గురు అధికారులపై వేటు

నీల్గాయిని చంపిన కేసులో ఇద్దరి అరెస్టు.. పరారీలో మరో అధికారి

నిర్మల్, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి: వన్యమృగాలను కాపాడాల్సిన అటవీశాఖ అధికారులే వేటగాళ్లు, స్మగ్లర్లకు సహకరించడం సంచలనంగా మారింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం కవ్వాల్ టైగర్ రిజర్వు ప్రాంతంలోని పెంబి అటవీ రేంజీలో ఉన్న తాటిగూడలో నీల్గాయిని హతమార్చిన కేసులో పెంబి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హఫీజుద్దీన్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎంఎ రషీద్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వసంత్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్‌చేశారు. వీరిపై డీఎఫ్‌వో దామోదర్‌రెడ్డి ఫిర్యాదుమేరకు పెంబి పోలీసులు కేసు నమోదుచేశారు. ఎఫ్‌ఎస్‌వో రషీద్, ఎఫ్‌బీవో వసంత్‌ను బుధవారం అరెస్టుచేశారు. ఎఫ్‌ఆర్‌వో హఫీజుద్దీన్ పరారీలో ఉన్నారు. గతేడాది డిసెంబర్ 31న పెంబి మండలం తాటిగూడలోని గుగ్లావత్ ప్రకాశ్ ఇంట్లో 10 కిలోల నీల్గాయి మాంసాన్ని ఎఫ్ఆర్వో హఫీజుద్దీన్ పట్టుకున్నారు. అయినా ఎలాంటి కేసులు నమోదు చేయలేదు. ఎఫ్‌ఎస్‌వో ఎంఎ రషీద్, ఎఫ్‌బీవో వసంత్‌కు ఈ విషయం కూడా తెలిసినా వారు ఉన్నతాధికారులకు కనీస సమాచారం ఇవ్వలేదు. ఈ క్రమంలో ఈ నెల 5న ఇచ్చోడలో పెద్దపులి చర్మాన్ని విక్రయిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా పెంబి మండలం తాటిగూడకు చెందిన గుగ్లావత్ ప్రకాశ్‌ను విచారించగా నీల్గాయి మాంసం కేసు వెలుగులోకి వచ్చింది. నిందితుడి ఇంట్లో మాంసాన్ని పట్టుకున్నా కేసు నమోదు చేయలేదని అటవీశాఖ ఉన్నతాధికారులకు సమాచారం వెళ్లింది. దీంతో ఉన్నతాధికారులు లోతుగా విచారణ జరుపగా ఎఫ్‌ఆర్‌వో హఫీజుద్దీన్, ఎఫ్‌ఎస్‌వో రషీద్, ఎఫ్‌బీవో వసంత్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంలో భారీగా డబ్బులు చేతులు మారాయని తేల్చారు. వీరి పరిధిలో కలప అక్రమ రవాణా, ఇసుక దందా జోరుగా సాగుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించారని వెల్లడైంది. పెంబి మండలంలోని పుల్గంఫాండ్రిలో పెద్దపులిని చంపి చర్మం విక్రయించిన విషయం కూడా తెలిసినా పట్టించుకోలేదని ఉన్నతాధికారుల విచారణలో తేలినట్టు సమాచారం. దీంతో ఈ ముగ్గురిపై సస్పెన్షన్ వేటుతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేశారు.



పులిని చంపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శశిధర్‌రాజు



వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామి వారిని బుధవారం రాష్ట్ర అడ్వకేట్ జనరల్ బీ శివానందప్రసాద్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో దూస రాజేశ్వర్ వారికి స్వామివారి ప్రసాదం అందజేశారు. -వేములవాడ కల్చరల్

యాదాద్రి జిల్లాలో ఈఎన్టీ, దంతవైద్య శిబిరం

బీబీనగర్: తెలంగాణ ప్రభుత్వం వచ్చే నెల నుంచి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోయే చెవి, ముక్కు, గొంతు, దంత వైద్యపరీక్షలు (ఈఎన్టీ) తరహాలో వైద్య శిబిరాలను కొనసాగించనున్నది. ఇందులో భాగంగా యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలంలోని నెమురగొముల గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా గుర్తించి మంగళ, బుధవారాల్లో శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో 164 మందికి పరీక్షలను నిర్వహించి.. 60 మందిని మెరుగైన చికిత్స కోసం ఈఎన్టీ దవాఖానకు రిఫర్ చేశారు. ట్రైనీ కలెక్టర్ ప్రియాంక, జేసీ రమేశ్, పైలట్ ప్రాజెక్టు మేనేజర్ సత్య శిబిరాన్ని పరిశీలించారు.

తెలంగాణలో సేంద్రియ వ్యవసాయం భేష్

■ **హాంకాంగ్ దేశస్థుల కితాబు**

దుగ్గొండి: తెలంగాణలో చేస్తున్న సేంద్రియ వ్యవసాయం అద్భుతంగా ఉన్నదని హాంకాంగ్ దేశంలో కడూరి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు కితాబిచ్చారు. ఆదర్శ గ్రామాల నిర్మాణంలో భాగంగా బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండి మండలంలోని వెంకటాపురంలో రైతులు సాగుచేస్తున్న సేంద్రియ వ్యవసాయ విధానాన్ని వారు పరిశీలించారు. హాంకాంగ్ దేశ కడూరి చారిబుల్ ట్రస్ట్ ప్రతినిధులు రిచర్డ్స్ ప్లవర్, స్టెఫిన్ చాంగ్, హర్‌మీత్ బసూర్ పాల్గొన్నారు.



దుగ్గొండి మండలం వెంకటాపురంలో సేంద్రియ వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న హాంకాంగ్ దేశస్తులు



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జపాన్ దేశస్థురాలు, స్పీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి యూకోతా యానుజీ కోరారు. బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలో ఆమె పర్యటించారు. - మల్దకల్

ఏకగ్రీవాలవైపు పల్లెలు





భూపాలపల్లి: మొగుళ్లపల్లి సర్పంచ్‌ను అభినందిస్తున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి.. మేడ్చల్: నర్సంపల్లి పాలకవర్గాన్ని టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి


నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: తొలివిడుత పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్రంలోని పలు పల్లెలు ఏకగ్రీవంవైపు నడిచాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని చింతలపల్లి పంచాయతీ సర్పంచ్‌గా లడె సమ్మక్కను ఎన్నుకున్నారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి పాలకవర్గాన్ని అభినందించారు. భూపాలపల్లి మండలంలోని వజినపల్లి సర్పంచ్‌గా తాళ్లపల్లి స్వామిగౌడ్‌ను, ఆముదాలపల్లి సర్పంచ్‌గా బౌతు రమాదేవిని ఎన్నుకున్నారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం మల్కినియాన్‌పల్లిలో కప్పెట శాంత, గోపాల్‌పేట మండలంఅనంతపూర్‌లో ఎద్దుల బాల్‌రెడ్డి ఏకగ్రీవమయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం అచ్యుతాపురం సర్పంచ్‌గా కృష్ణవేణిని ఎన్నుకున్నారు. మేడ్చల్ జిల్లా కీసర మండలం నర్సంపల్లి గ్రామస్థులు పనాల సత్తమ్మను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరు ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని కలిసి టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మేడ్చల్ జిల్లా రాజబొల్లారం తండా ప్రజలు ఏకగ్రీవానికి మొగ్గు చూపారు. మంగ్యానాయక్‌ను సర్పంచ్‌గా ఎన్నుకోవాలని నిర్ణయించుకున్నారు. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం ఉప్పరిగడ్డ తండా సర్పంచ్‌గా సుమితను ఎన్నుకున్నారు. కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేటకు కవిత, చింతకుంటపల్లికి అనెమోని పార్వతమ్మ ఎన్నికయ్యారు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండం నర్సాపూర్ సర్పంచ్‌గా హేమలతను ఎన్నుకున్నారు. వేములవాడ రూరల్ మండలం తుర్కకాశీనగర్ సర్పంచ్‌గా షేక్ రిజ్వాన్‌ను, చందుర్తి మండలం కట్టలింగంపేట సర్పంచ్‌గా ఎనుగుల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

ప్రముఖుల నామినేషన్

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కోరెం గ్రామ సర్పంచ్‌గా ఎంపీ వినోద్‌కుమార్ అత్త చెన్నాడి రాజ్యలక్ష్మి, ఆమె తోడికోడలు చెన్నాడి అరుంధతి బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం బూరెడ్డిపల్లి పంచాయతీకి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు.

నామినేషన్లు నిల్

కాసిపేట రూరల్: మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం ధర్మారావుపేట పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, 10 వార్డు స్థానాలకు ఒక్క నామినేషన్ కూడా దాఖలుకాలేదు. గ్రామంలో ఎస్టీలు లేకున్నా ఎస్టీకి రిజర్వ్ చేశారంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలకు ముందు కొందరు ఎస్టీలుగా పేర్లు నమోదు చేసుకున్నారంటూ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.



కిట్లు అందుకున్న విద్యార్థులతో అధికారులు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కిట్లు

■ **నిట్ యువజనోత్సవాల్లో భాగంగా పంపిణీ**

నిట్ క్యాంపస్(వరంగల్): వరంగల్‌లోని జాతీయ సాంకేతిక విద్యా సంస్థ(నిట్)లో ఈ ఏడాది యువజనోత్సవాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన 135 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు స్టుడెంట్ డీన్ ఎల్‌ఆర్జీ రెడ్డి, స్టుడెంట్ కౌన్సిల్ సెక్రటరీ ప్రశాంత్ రాంశెట్టి, మీర్ అఫ్రోజ్ ఉచితంగా కిట్లను అందించారు. ఉన్నతవిద్య కోసం కృషి చేయండి విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థానానికి చేరుకోవాలని నిట్ డైరెక్టర్ ఎన్వీ రమణారావు సూచించారు. నిట్‌లాంటి ఉన్నత విద్యాసంస్థలో చదవాలనే కోరిక పెంచుకుంటే మంచి భవిష్యత్ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ అర్బన్ డీఈవో నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

■ **టీఎన్జీవోస్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి**

రెడ్డికాలనీ (వరంగల్): సీపీఎస్‌ను వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎన్జీవోస్ కేంద్రకమిటీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దేశవ్యాప్త రెండ్రోజుల సమ్మెలోభాగంగా బుధవారం తెలంగాణ ఉద్యోగసంఘాల జాక్, టీఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని ఎంజీఎం కూడలి నుంచి హన్మకొండలోని కలెక్టరేట్ వద్దగల కీర్తిస్తూపం వరకు ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కారం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ, సీపీఎస్‌కు వ్యతిరేకంగా టీఎన్జీవోస్ యూనియన్ చేస్తున్న పోరాటాలను దేశంలోని పోరాటం చేస్తున్నారని అన్నారు.



వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని అమరవీరుల కీర్తి స్తూపం వద్ద మాట్లాడుతున్న టీఎన్జీవోస్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి

నిరంతర అభివృద్ధి సీఎం కేసీఆర్‌కే సాధ్యం

■ **మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**

సూర్యాపేట టౌన్: నిరంతర అభివృద్ధి, సుపాలన సీఎం కేసీఆర్‌కే సాధ్యమని మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఏరియా దవాఖానలో మెడికల్ కాలేజీ నిర్మించనున్న ప్రదేశంతోపాటు ఏరియా దవాఖాన, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పశుసంవర్ధక శాఖ కార్యాలయాలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యమకాలం నుంచే ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తిగా సీఎం కేసీఆర్ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రతిక్షణం తాపత్రయపడుతున్నారన్నారు. సూర్యాపేటను సుందరమైన, ఆరోగ్యమైన పట్టణంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పేట సబ్‌కోర్టుకు హాజరైన రేవంత్‌రెడ్డి

నారాయణపేట టౌన్ : మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట పట్టణంలోని సబ్‌కోర్టుకు బుధవారం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ వర్గీయుల మధ్య కొడంగల్ మండలం హస్నాబాద్‌లో జరిగిన ఘర్షణ కేసు విచారణకుగాను ఆయన సబ్‌కోర్టుకు హాజరయ్యారు. తదుపరి విచారణ ఫిబ్రవరి4 కు వాయిదా పడింది.

వేధింపులు తాళలేక భర్తను చంపిన భార్య

సంగారెడ్డి రూరల్: మద్యానికి బానిసైన భర్త వేధిస్తుండటంతో ఓ భార్య.. భర్తను హత్యచేసిన ఘటన సంగారెడ్డి జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. కంది మండలం చెర్యాలకు చెందిన మాద నర్సింహులు (50) కొంతకాలంగా మద్యానికి బానిసై భార్య జయమ్మను వేధిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లోనే మద్యం తాగి తీవ్రంగా కొట్టాడు. దీంతో జయమ్మ బీరుసీసాతో నర్సింహులు తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై ప్రాణాలు విడిచాడు. అయితే అతడు ఉరివేసి ఆత్మహత్య చేసుకున్నాడని జయమ్మ చెప్పగా, కూతురు ప్రమీళ మాత్రం ఘర్షణలో తండ్రి చనిపోయాడని చెప్పింది. మృతుడి సోదరుడు వెంకటయ్య ఫిర్యాదుమేరకు పోలీసులు జయమ్మను అదుపులోకి తీసుకున్నారు.

జిన్నింగ్‌లో అగ్ని ప్రమాదం

500 క్వింటాళ్ల పత్తి దగ్ధం ■ రూ.20 లక్షల ఆస్తి నష్టం

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని గలియాబాయితండా, కెస్లాగూడ గ్రామాల మధ్య ఉన్న విజయలక్ష్మి జిన్నింగ్‌మిల్లులో బుధవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దాదాపు 500 క్వింటాళ్ల పత్తి దగ్ధం కాగా.. రూ. 20 లక్షల మేర ఆస్తినష్టం జరిగింది. జిన్నింగ్ యజమాని గన్యాన్‌సింగ్ వివరాల ప్రకారం.. జిన్నింగ్ మిల్లులో కార్మికులు నిలువ ఉంచిన పత్తిని క్రషర్‌సహాయంతో దుదితీసే యంత్రాల వద్దకు తరలిస్తుండగా ప్రమాదవశాత్తు యంత్రం నుంచి మంటలు చెలరేగి పత్తికి అంటుకున్నాయి. ఉట్నూర్ అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినట్టు తెలిపారు.

చిరుత కళేబరం కలకలం

మెట్‌పల్లి రూరల్: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ శివారులో చిరుతపులి కళేబరం కలకలం సృష్టించింది. గొర్రెల కాపరులకు కళేబరం కనిపించగా వారు గ్రామస్థులకు, అటవీ అధికారులకు సమాచారం అందించారు. మెట్‌పల్లి రేంజ్ అధికారి రాజేశ్వర్‌రావుతో పాటు పశు వైద్యాధికారిణి నస్రీన్ ఘటన స్థలానికి చేరుకొని చిరుత కళేబరాన్ని పరిశీలించారు. చిరుతపులి రెండు నెలల క్రితం మరణించి ఉంటుందని.. వయస్సు సుమారు నాలుగు సంవత్సరాలుగా ఉండవచ్చని చెప్పారు.

చైనా మాంజాపై అటవీశాఖ పంజా

- హైదరాబాద్‌లోని గుల్జార్‌హౌజ్‌లో 50 కిలోల చైనా మాంజా స్వాధీనం
- నిషేధం అమలు.. అనర్థాలపై అవగాహనకు ప్రత్యేక బృందాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పక్షులకు ఉరితాడుగా, మనుషులకు ప్రాణాంతకంగా మారిన చైనా నైలాన్ మాంజా నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి అటవీ శాఖ ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది. హైదరాబాద్‌లో ఐదు బృందాలు, ప్రతి జిల్లాలో రెండేసి చొప్పున ప్రత్యేక బృందాలు చైనా మాంజా నిషేధాన్ని పక్కాగా అమలు చేసేందుకు పనిచేస్తున్నాయి. అన్ని జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు దీనిపై దృష్టి సారించారు. బుధవారం హైదరాబాద్‌లోని గుల్జార్‌హౌజ్‌లో 50 కిలోల చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. పతంగుల విక్రయదారులు చైనా నైలాన్ మాంజాను అమ్మినా, నిల్వచేసినా, రవాణాచేసినా ఐదేండ్ల జైలుశిక్షతో పాటు లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తామని అధికారులు వెల్లడించారు. చైనా మాంజా వాడకంతో కలిగే అనర్థాలు, ఎందుకు నిషేధించాల్సి వచ్చింది, వాడితే ఏ విధంగా శిక్షార్హులు అవుతారనే విషయాలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి అటవీశాఖ ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నది. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో కరపత్రాలను పంచుతున్నది. వీడియోచిత్రాలను కూడా రూపొందించింది. మాంజా విక్రయం, రవాణాపై సమాచారమందించాలని అటవీశాఖ అధికారులు కోరారు. చైనా మాంజా అమ్మకాలు, నిల్వకు సంబంధించిన వివరాలు తెలిస్తే 040-23231440, 18004255364 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

కోకాపేట భూ వివాదం సుఖాంతం

- హెచ్ఎండీఏకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ శివారులోని కోకాపేటలో వేల కోట్ల విలువైన భూముల వ్యవహారంలో ప్రభుత్వానికి, హెచ్ఎండీఏకు సుప్రీంకోర్టులో శాశ్వత ఊరట లభించింది. వారసత్వం విషయంలో వివాదాస్పదంగా మారిన 630 ఎకరాలపై ప్రభుత్వానికి, హెచ్ఎండీఏకే హక్కులున్నాయని తేల్చింది. నిజాం హయాంలో జాగీర్‌గా వ్యవహరించిన నవాబ్ నస్రత్ జంగ్ బహదూర్ -1కి చెందిన కోకాపేట భూములపై వారసులుగా తమకే వాటిపై హక్కు ఉందంటూ వారి ప్రతినిధిగా కేఎస్‌బీ ఆలీ వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్పీ)ను జస్టిస్ ఏకే సిక్రీ, అశోక్‌భూషణ్‌తో కూడిన ధర్మాసనం ఆ భూములు హెచ్ఎండీఏవే (ప్రభుత్వానివే)నని తీర్పును వెలువరించింది. ఈ నేపథ్యంలోనే కొనుగోలుదారులు, హెచ్ఎండీఏ మధ్య సుదీర్ఘ కాలంగా నడుస్తున్న వివాదంలో వేలందారులు హెచ్ఎండీఏకు చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వడంలో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చినట్టు అధికారవర్గాలు తెలిపాయి. కొందరు భూ కొనుగోలుదారులైన బిడ్డర్లు తాము చెల్లించిన రుసుమును తిరిగి చెల్లించాలన్న తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని వడ్డీతో చెల్లింపు జరుపాలని ఆదేశాలను కోరగా, మరికొందరు తాము చెల్లించిన రుసుముకు అనుగుణంగా లెక్కకట్టి అంతే విస్తీర్ణం గల భూమిని ఇప్పించాలన్న విషయాలను ఇక హెచ్ఎండీఏ తేల్చనున్నది. వేలందారులు చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వడంలో సుప్రీంకోర్టు ఇచ్చిన అనుకూల తీర్పు ఆర్డర్ కాపీ అందిన వెంటనే పూర్తి వివరాలను వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.


గాంధీలో కాలేయ మార్పిడి విభాగం!



గాంధీ దవాఖాన, నమస్తే తెలంగాణ: గాంధీ దవాఖానలో కాలేయ మార్పిడి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు ముమ్మరం చేశారు. బుధవారం డీఎంఈ డాక్టర్ రమేశ్‌రెడ్డి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్‌కుమార్‌తో కలిసి పనులను పరిశీలించారు. ప్రస్తుతం అక్కడ కొనసాగుతున్న నర్సింగ్ స్కూల్‌ను బోయిగూడలోని మరో భవనంలోకి తరలించి, నెలాఖరులోగా ఖాళీ చేయించాలని డీఎంఈ సూచించారు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగం ఏర్పాటు తదితర అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరుచేసినట్టు అధికారులు తెలిపారు. సర్జికల్ గ్యాస్ట్రో విభాగానికి సైతం అనుమతి లభించడంతో కాలేయ మార్పిడి విభాగం పక్కనే ఏర్పాటు చేసేలా పనులు మొదలుపెట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన మెటర్నిటీ చైల్డ్‌హెల్త్‌కేర్ సెంటర్ కూడా గాంధీ దవాఖానకు వచ్చింది. దీనికి ప్రత్యేక భవనాన్ని ఏర్పాటుచేయాలని అధికారులు నిర్ణయించారు. అన్ని వసతులతో కూడిన భవనాన్ని ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వం ఇచ్చిన రూ.30 కోట్లను రూ.50 కోట్లకు పెంచాలన్న ప్రతిపాదనలను పాలనాయంత్రాంగం, గైనిక్ విభాగాల వైద్యులు ఉన్నతాధికారులకు నివేదించారు.

రూ.30 కోట్లతో ఏర్పాటుకు సన్నాహాలు

ఈ ఘనత సీఎం కేసీఆర్‌దే..



ప్రభుత్వ దవాఖానల్లో అవయవమార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించడం నిరుపేదలకు ప్రాణదానం చేసినట్లేనని, ఆ ఘనత సీఎం కేసీఆర్ ప్రభుత్వానిదేనని వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ రమేశ్‌రెడ్డి అన్నారు. నిరుపేదలకు భారంగా మారుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావడమే కాకుండా ప్రభుత్వ దవాఖానల్లో సైతం పూర్తి ఉచితంగా జరిపేందుకు చర్యలు తీసుకున్నదని తెలిపారు. మెడికల్ గ్యాస్ట్రో, సర్జికల్ గ్యాస్ట్రో అనుబంధ విభాగాలు ఒకేచోట ఉండేలా గాంధీ దవాఖానలో ప్రత్యేకంగా కాలేయ మార్పిడి విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు.

– డాక్టర్ రమేశ్‌రెడ్డి, డీఎంఈ

సీతాకోకచిలుకల ఉనికిపై కాలుష్యం కాటు

- సైన్స్ కాంగ్రెస్‌లో పరిశోధనా పత్రాలు సమర్పించిన నిజాం ప్రొఫెసర్ మాధవి

బేగంబజార్: 'దేశంలో పెరిగి పోతున్న కాలుష్యంతో అందమైన సీతాకోకచిలుకలు అంతరించి పోతున్నాయి' అనే అంశంపై నిజాం కళాశాల జువాలజీ విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ మాధవి 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో పరిశోధనా పత్రాలు సమర్పించారు. హైదరాబాద్‌లో పర్యావరణ కాలుష్యం పెరుగుతుండటంతో సీతాకోకచిలుకలు అంతరించిపోతున్నాయన్నారు. సీతాకోకచిలుకలను కాపాడుకునేందుకుగాను నిజాం కళాశాల ఆవరణలో బటర్‌ఫ్లై హౌజ్‌ను నిర్మించామని మాధవి వివరించారు. ఆమె కృషిని గుర్తిస్తూ అవార్డు, ప్రశంసాపత్రంతో నిర్వాహకులు సన్మానించారు. నిజాం కాలేజీ జువాలజీ సిబ్బంది మాధవిని అభినందించారు.

గొలుసు దొంగల అరెస్టు

- చోరీ సొత్తు, బైక్, కత్తి స్వాధీనం
- వనస్థలిపురంవాసి మార్గదర్శకంలో యూపీ ముఠా దోపిడీ
- నోయిడా జైల్లో స్నాచర్లతో పరిచయం
- లాడ్జిలో బస.. అక్కడినుంచి పర్యవేక్షణ
- కేసు వివరాలు వెల్లడించిన సీపీ అంజనీకుమార్





అంతర్రాష్ట్ర చైన్‌స్నాచర్ల ముఠాను అరెస్ట్ చేసి చోరీ సొత్తు రికవరీని చూపుతున్న నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్. చిత్రంలో దక్షిణ మండలం డీసీపీ అంబర్ కిషోర్ కూడా ఉన్నారు.

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ శివారులో గతనెల 26, 27 తేదీల్లో సుమారు 15 గంటల వ్యవధిలో 11 గొలుసు దొంగతనాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగలను నగర పోలీసులు పట్టుకున్నారు. వారినుంచి చోరీ సొత్తుతోపాటు వారు వినియోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకొన్నారు. కేసు వివరాలను బుధవారం నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ మీడియాకు వెల్లడించారు. వనస్థలిపురం సాహెబ్‌నగర్‌కు చెందిన చింతమల్ల ప్రణీత్‌చౌదరి అలియాస్ మాన్య ఇంజినీరింగ్ విద్యను మధ్యలోనే ఆపేసి ఇంగ్లండ్ వెళ్లి బీబీఎం చదివాడు. ఆ సమయంలో అక్కడి నిబంధనల ఉల్లంఘనలు, నేరాలకు పాల్పడిన ఘటనలపై ప్రణీత్‌ను ఇమ్మిగ్రేషన్ విభాగం ఢిల్లీకి పంపించింది. నోయిడా ప్రాంతంలో కొన్నిరోజులు ఉండటంతో కొందరు నేరస్థులతో ప్రణీత్ పరిచయాలు పెంచుకొన్నాడు. 2014-15లో హైదరాబాద్‌కు వచ్చి సరూర్‌నగర్, ఉప్పల్‌లో గొలుసు దొంగతనాలకు పాల్పడి పోలీసులకు చిక్కాడు. జైలు నుంచి బయటకొచ్చి తిరిగి ఢిల్లీ వెళ్లి అక్కడ నేరాలుచేసి నోయిడా జైలుకు వెళ్లాడు. నోయిడా జైల్లో కరుడుగట్టిన నేరస్థులైన ఉత్తర్‌ప్రదేశ్, నోయిడా, గౌతమ్ బుద్ధనగర్‌కు చెందిన మోనువాల్మీకి అలియాస్ మోను, బులంద్‌షహర్‌కు చెందిన చోకలతో పరిచయం ఏర్పడింది. మోను వృత్తిరీత్యా పందుల పెంచుతూ యూపీ, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల్లో స్నాచింగ్, దోపిడీ ఘటనలకు పాల్పడ్డాడు. ఇతడిపై 40 కేసులు, చోకపై కూడా అలాగే కేసులున్నాయి.

తెలిసిన ప్రాంతం కావడంతో..

స్థానికుడైన ప్రణీత్‌కు ఎల్బీనగర్, వనస్థలిపురం ప్రాంతాల కాలనీలపై అవగాహన ఉన్నది. ఆ ప్రాంతంలో స్నాచింగ్‌లకు పాల్పడేందుకు నగరానికి వచ్చి ఓఎల్ఎక్స్ నుంచి కేటీఎం బైక్‌ను అద్దెకు తీసుకొని ఆయా కాలనీల్లో రెక్కీ నిర్వహించారు. డిసెంబర్ 26న పారిపోవడానికి వీలుగా ప్రధాన రహదారులకు దగ్గరలోని కాలనీల్లో వరుస స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ఆ రోజురాత్రి కాచిగూడలోని ఒక లాడ్జిలో బసచేసి మరుసటి రోజు ఉదయం తిరిగి ఎల్బీనగర్ జోన్‌లో 45 నిమిషాల వ్యవధిలోనే ఐదు స్నాచింగ్‌లకు పాల్పడి ఢిల్లీకి పరారయ్యారు. నిందితులను పట్టుకొనేందుకు 120 బృందాలను ఏర్పాటుచేసి వాహనాల తనిఖీలను విస్తృతం చేశారు. సీసీ కెమెరాల పుటేజీని విశ్లేషించి నిందితులు వాడిన బైక్‌ను, బస చేసిన లాడ్జిని పోలీసులు గుర్తించారు. నగరానికి మళ్లీ వచ్చిన ముఠాసభ్యుల్లో ఇద్దరు బుధవారం ఉదయం హైదరాబాద్ ఈదీబజార్‌లోని అన్మోల్ హోటల్ సమీపంలో పల్సర్ బైక్‌పై వెళ్తూ పోలీసులకు అనుమానాస్పదస్థితిలో పట్టుబడ్డారు. వారిని విచారించగా వరుస స్నాచింగ్‌లకు పాల్పడిన వాల్మీకి, చోకగా తేలింది. వాళ్లిచ్చిన సమాచారంతో కాచిగూడలోని ఒకలాడ్జిలో బసచేసిన ప్రణీత్ చౌదరిని అదుపులోకి తీసుకొన్నారు. విచారణలో స్నాచింగ్‌లకు ఉపయోగించిన కేటీఎం బైక్‌ను తలాబ్‌కట్టలోని రైల్వేట్రాక్ వద్ద వదిలేసినట్టు వెల్లడించారు. వీరి వద్ద కత్తి కూడా లభించింది. ముగ్గురిని అరెస్ట్‌చేసి స్నాచింగ్ సొమ్ముతోపాటు కేటీఎం పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో స్నాచింగ్, దోపిడి ఘటనలకు పాల్పడిందని, ఇప్పుడు అరెస్ట్ కాకుంటే మరోసారి హైదరాబాద్‌లో స్నాచింగ్ చేసేవారని, స్నాచింగ్ చేసేందుకు వచ్చి దొరికిపోయారని సీపీ వివరించారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ చైతన్యకుమార్ బృందాన్ని కమిషనర్ అభినందించారు. సమావేశంలో సౌత్‌జోన్ డీసీపీ అంబర్‌కిశోర్, రాచకొండ పోలీసులు పాల్గొన్నారు.




కోకాపేట ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన ట్రాలీ. (ఇన్‌సెట్) మృతులు హేమంత్‌రెడ్డి (ఫైల్), అనిల్

దూసుకొచ్చిన మృత్యువు ఇద్దరు దుర్మరణం

- ట్రాలీ ఆటోను ఢీకొట్టిన రెడీమిక్స్ లారీ
- విరిగిపడిన హైటెన్షన్ విద్యుత్ స్తంభం

మణికొండ, నమస్తే తెలంగాణ: వేగంగా దూసుకొచ్చిన రెడీమిక్స్ లారీ నిలిపి ఉంచిన ఆటో ట్రాలీని ఢీకొట్టడంతో ట్రాలీ నుజ్జునుజ్జయి ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ మంజీరా రిజర్వాయర్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గండిపేట మండలం వట్టినాగులపల్లికి చెందిన మర్రి హేమంత్‌రెడ్డి (30) కొంతకాలంగా మంచినీటి క్యాన్‌ల విక్రయాలు చేపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం నీటి క్యాన్‌లను విక్రయించేందుకు ఇంటి నుంచి బయలుదేరాడు. కోకాపేట సబితానగర్ వద్ద నీటిని విక్రయించి తిరిగి కోకాపేట్ మూవీటవర్ రోడ్డు ఖానాపూర్ మంజీరా రిజర్వాయర్ వద్ద తన ఆటో ట్రాలీని రోడ్డు పక్కన నిలిపాడు. ఎదురుగా దూసుకువచ్చిన రెడీమిక్స్ లారీ.. ఆటో ట్రాలీని ఢీకొట్టడంతో ట్రాలీలో ఉన్న హేమంత్‌రెడ్డి, అనిల్ (28) దుర్మరణం పాలవ్వగా.. ఆటో ట్రాలీ నుజ్జునుజ్జయింది. ఆటో ట్రాలీలో చిక్కుకు పోయిన హేమంత్‌రెడ్డి, అనిల్ మృతదేహాలను గ్యాస్ కట్టర్‌తో వెలికితీశారు. రెడీమిక్స్ లారీ అదే వేగంతో హైటెన్షన్ స్థంభాన్ని ఢీకొని పల్టీ కొట్టింది. ఈ సంఘటనలో లారీ డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి. విషయం తెలుసుకొన్న విద్యుత్‌శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ సరఫరా నిలిపివేసి తగు జాగ్రత్తలు తీసుకొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు నార్సింగి ఇన్‌స్పెక్టర్ రమణగౌడ్ తెలిపారు.

బాబుకు ఓటమి భయం



ఇచ్ఛాపురంలో నెలకొల్పిన విజయసంకల్ప స్థూపాన్ని బుధవారం ఆవిష్కరించిన వైఎస్ జగన్

జాతీయ రాజకీయాల పేరుతో కొత్త డ్రామా

ప్రజా సంకల్పయాత్ర ముగింపు సభలో వైఎస్ జగన్



శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రజాసంకల్పయాత్ర ముగింపు సందర్భంగా బహిరంగసభలో మాట్లాడుతున్న వైఎస్ జగన్

అమరావతి, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఇసుక నుంచి మట్టివరకు అంతా దోపిడీయేనని, ఎన్నికలు దగ్గరకు వచ్చేసరికి చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకొని ఆదరణ-2 అంటూ కొత్తనాటకాలకు తెరలేపుతున్నారని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కడప జిల్లా ఇడుపులపాయలో 2017 నవంబర్ 6న ప్రారంభమైన ప్రజాసంకల్పయాత్ర బుధవారం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగిసింది. 3,648 కిలోమీటర్లు సాగిన పాదయాత్ర విజయవంతంగా ముగిసింది. ఇచ్ఛాపురంలో విజయసంకల్ప స్థూపాన్ని జగన్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన భారీ బహిరంగసభలో ఆయన మాటాడుతూ.. 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలను సంతలో పశువుల మాదిరిగా కొన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మ్యానిఫెస్టోలో 650 వాగ్దానాలు పెట్టి మోసం చేశారని, చంద్రబాబు పాలనలో ఓ వైపు కరువు, మరో వైపు తుఫాన్లు వచ్చాయని విమర్శించారు. 'బెంగళూరుకు వెళ్లి కుమారస్వామితో కాఫీ తాగుతారు.. కానీ పక్కనే ఉన్న అనంతపురం రైతన్నను మాత్రం పట్టించుకోరు. మరుసటి రోజు చెన్నైకి వెళ్లి స్టాలిన్‌తో కలిసి ఇడ్లీ సాంబార్ తింటారు.. కానీ పక్కనే ఉన్న సొంత జిల్లా చిత్తూరు రైతులను పలుకరించరు.. ప్రభుత్వ సొమ్మే కదా అని ప్రైవేట్ విమానంలో కోల్‌కతాకు వెళ్లి మమతాబెనర్జీతో చికెన్ తింటారు.. కానీ రాష్ట్ర ప్రజల సమస్యలు పట్టించుకోరు' అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైఎస్సార్ హయాంలో సాగు విస్తీర్ణం 42.70 లక్షల హెక్టార్లు ఉంటే.. చంద్రబాబు హయాంలో 40 లక్షల హెక్టార్లకు పడిపోయిందన్నారు. కానీ ఈ పెద్ద మనిషి నదుల అనుసంధానం.. దేశంలోనే వ్యవసాయంలో మన రాష్ట్రమే నంబర్‌వన్ అంటున్నారని ఆగ్రహించారు. హెరిటేజ్ కోసం చంద్రబాబు దళారీ వ్యవస్థకు కెప్టెన్ అయ్యారని, రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్యాక్ చేసి రెండింతలు అధిక ధరకు అమ్ముతున్నారని ఆరోపించారు. యువతకు ఉద్యోగాలు రాలేదని, నిరుద్యోగభృతి ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా నటుడు భానుచందర్ వైఎస్సార్సీపీలో చేరారు.

అధికారంలోకి వస్తే రైతుబంధు, రైతుబీమా

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతుబంధు, రైతుబీమా తరహా పథకాలను అమలుచేసేందుకు వైసీపీ సిద్ధమైంది. అధికారంలోకి వస్తే ఈ పథకాలను అమలుచేయనున్నట్టు ప్రకటించింది. యేటా మే నెలలో అర్హులైన రైతులకు రూ.12,500 అందిస్తామని ఈ సభలో జగన్ ప్రకటించారు. మృతిచెందిన రైతు కుటుంబాలకు వైఎస్సార్ బీమా పేరిట రూ.5 లక్షలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. నష్టపరిహారాన్ని ఆ కుటుంబంలోని మహిళలకే అందేలా చట్టంచేస్తామని తెలిపారు.


ఇంజినీరింగ్ కాలేజీలకు 32 నిబంధనలు

- టీచర్ ట్రైనింగ్ విధానం, క్వాలిటీ సెల్, ఇంటర్న్‌షిప్ అనివార్యం
- కనీసం ఐదు కంపెనీలతో ఒప్పందాలు, ఆటల సదుపాయాలు
- నిబంధనల బుక్‌లెట్‌లో స్పష్టంచేసిన ఏఐసీటీఈ
- అనుమతుల దరఖాస్తులకు 14 నుంచి ఫిబ్రవరి 3 వరకు గడువు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలనే కేంద్ర సర్కార్ కూడా ఆచరించేందుకు సిద్ధమవుతున్నది. ఇప్పటికే రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో నాణ్యమైన విద్యావిధానం దాదాపుగా అందుబాటులోకి వచ్చింది. ఇదే స్ఫూర్తితో ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలను బలోపేతం చేయడానికి అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) సిద్ధమైంది. ఇందుకు 32 రకాల నిబంధనలు తప్పనిసరిగా అమలుచేయాలని, ఇలాంటి కళాశాలలకే అనుమతులు ఇవ్వనున్నామని ఇటీవల విడుదలచేసిన బుక్‌లెట్‌లో స్పష్టంచేసింది. ఈ ఏడాది అదనంగా ఏడు నిబంధనలను చేర్చింది. ముఖ్యంగా ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో టీచర్ ట్రైనింగ్ విధానం, కనీసం ఐదు కంపెనీలతో ఒప్పందాలు, క్వాలిటీ సెల్, విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేసేలా చర్యలు, పరీక్ష నిర్వహణలో సంస్కరణలు, స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమాలతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందని ఏఐసీటీఈ స్పష్టంచేసింది. ఇలామొత్తం 32 రకాల నిబంధనలు తప్పనిసరిగా అమలుచేసిన ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలకు మాత్రమే అనుమతులు ఇవ్వాలని నిర్ణయించినట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ తెలిపారు. విద్యార్థి, టీచర్ నిష్పత్తిని తప్పనిసరిగా పాటించడంతోపాటు సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, మౌలిక సదుపాయాలు, అన్ని కాలేజీల్లో ర్యాగింగ్ నియంత్రణ చర్యలతోపాటు ఫిర్యాదుల విభాగం, ఎస్సీ, ఎస్టీ విభాగాలను, ప్రమాద బీమా సౌకర్యాన్ని ఏర్పాటుచేయాల్సి ఉన్నది.

కొత్త కోర్సులకే అధిక ప్రాధాన్యం

ప్రస్తుతం మనుగడలో ఉండి డిమాండ్‌లేని కోర్సులకు అనుమతులు నిరాకరించాలని ఏఐసీటీఈ స్పష్టంచేసింది. లేనిపక్షంలో సాంకేతిక విద్యావిధానంలో నాణ్యత తగ్గుతుందని, బోధనలో లోపాలు తొంగిచూస్తున్నాయని, అవసరమైన ఫ్యాకల్టీ కూడా అందుబాటులో లేదని భావిస్తున్నది. ఈ క్రమంలో కాలేజీల్లో కోర్సులు, సీట్లసంఖ్య తగ్గించుకున్నట్లయితే నాణ్యమైన బోధన అందుబాటులోకి వస్తుందని జేఎన్టీయూహెచ్ వీసీ ఏ వేణుగోపాల్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఉన్న కోర్సులు కాకుండా.. భవిష్యత్తులో కొత్త కోర్సులను రూపొందించాల్సి ఉన్నదని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. నాణ్యమైన విద్యావిధానం అందుబాటులోకి తీసుకురావడంలో ఏఐసీటీఈ నిబంధనలు కాలేజీలు పాటించే విధంగా అవసరమైన చర్యలను తీసుకుంటామని తెలంగాణ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గౌతంరావు, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్ పేర్కొన్నారు.



బుధవారం రవీంద్రభారతిలో స్టేజ్ ఆర్టిస్ట్ దుర్వాసరాజును ఎమినెంట్ పర్సన్ ఆఫ్ 2018 అవార్డుతో సత్కరిస్తున్న ప్రభుత్వ సలహాదారు జీ వివేక్, ఆగ్రోస్ చైర్మన్ కిషన్‌రావు తదితరులు

సేవతోనే జీవితానికి సార్థకత

'ఎమినెంట్ పర్సన్ ఆఫ్ 2018' అవార్డుల ప్రదానోత్సవంలో వక్తలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సృష్టిలోని ప్రతి మనిషి సామాజిక స్పృహ, సేవాగుణం కలిగి ఉండాలని, అప్పుడే వారి జీవితానికి సార్థకత లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని బుధవారం రవీంద్రభారతిలో తెలంగాణ కళాపరిషత్ వ్యవస్థాపకుడు పగిడిపల్లి రాజారాం అధ్యక్షతన 'ఎమినెంట్ పర్సన్ ఆఫ్ 2018' అంతర్జాతీయ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ మాట్లాడుతూ అన్ని మతాల సారం సేవ చేయడమేనని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు జీ వివేక్, ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు మాట్లాడుతూ అన్నిరంగాల్లో సేవలు అందించిన వారికి ప్రోత్సాహం అందించడం సంతోషకరమన్నారు. వివిధ రంగాల్లో సేవలందించిన స్టేజ్ ఆర్టిస్ట్ వీ దుర్వాసరాజు, సౌందర్యరాజన్ రామస్వామి, డాంగ్ యోప్ కిమ్, ఇంద్రదీప్ ఘోష్, ప్రొఫెసర్ ప్రభాకర్, కడవెండి వేణుగోపాల్, వెన్నెల శ్రీనాథ్, యశోకృష్ణ గోరంట్ల, సీబాబు, నల్లమోతు వేణుగోపాల్‌రావు, పీ శ్రీవల్లి, కందికంటి వెంకన్న, పాలపర్తి శివకుమార్, వేసపోగు విజయబాబు, కపుగంటి కోటేశ్వరరావు, దువ్వూరి అన్నపూర్ణ, బాలు వేసపోగు, పగిడిపల్లి సూర్యం, యంగల్‌శెట్టి విజయసాయికుమార్, మహ్మద్ ఇలాస్ అహ్మద్, ఉండ్రాతి ప్రసన్నకుమార్, మేదర సురేశ్‌కుమార్, మానికిరెడ్డి సత్యనారాయణ, జ్యోత్స్న కుమారి, గ్లోరి ఆనంద, కొండా దయాకర్, పీ ప్రిన్స్ సుందర్‌రావులను సత్కరించారు. కార్యక్రమంలో వడ్డెపల్లి కృష్ణారావు, గ్లోబల్ క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ సీఈవో సీతా మాడభూషి, దక్షిణ కొరియా ప్రతినిధి డాంగ్ యోప్ కిమ్, ఎన్ఐబీ నేషనల్ యూత్ వింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



6 ఒకే రోజు ఏకగ్రీవం

సిద్దిపేట జిల్లాలో బుధవారం ఆరు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మాజీమంత్రి హరీశ్‌రావు దత్తత గ్రామమైన ఇబ్రహీంపూర్ సర్పంచ్‌గా కోడూరి దేవయ్య, జేపీ తండా సర్పంచ్‌గా భూక్యా భిక్షపతినాయక్, వెంకటగిరి తండా సర్పంచ్‌గా పాతులోత్ పెంటవ్వ, బేగంపేట సర్పంచ్‌గా పోతారం అనసూర్య, కొన్గల్ సర్పంచ్‌గా మాధవ రెడ్డిగారి ప్రేమలతారెడ్డి, రసూలాబాద్ సర్పంచ్‌గా పచ్చిమండ్ల స్వామిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపూర్ పాలకవర్గాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు అభినందిస్తున్న దృశ్యమిది.

- సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ



గ్రామ స్వరాజ్యం

పంచాయతీ పోటీ

రైతు సమన్వయ సమితి సభ్యులు అర్హులే

స్పష్టంచేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతు సమన్వయ సమితి సభ్యులు పంచాయతీ ఎన్నికల్లో పోటీకి అర్హులేనని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వం తరపున నియమితులైన రైతు సమన్వయ సమితి సభ్యులు పంచాయతీ ఎన్నికల్లో పోటీచేయవచ్చా? అనే సందిగ్ధతకు ఎన్నికల సంఘం తెరదించింది. సర్పంచ్‌లు, వార్డు సభ్యులుగా రైతు సమన్వయ సమితి సభ్యులు నామినేషన్లు వేస్తే వారిని అర్హులుగా ప్రకటించాలంటూ బుధవారం సాయంత్రం అత్యవసర ఆదేశాలు జారీచేసింది. నామినేషన్ల ప్రక్రియ మొదలైనప్పటి నుంచే రైతు సమన్వయ సమితి సభ్యులు పోటీచేసేందుకు అర్హత ఉందా లేదా అనే విషయంలో సందిగ్ధత నెలకొన్నది. వీరు పోటీకి అనర్హులంటూ గతంలో వ్యవసాయశాఖ ప్రకటించింది. దీంతో పలువురు రైతు సమన్వయ సమితి సభ్యులు నామినేషన్లు వేయడంలో కొంత గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారు. అయితే ప్రస్తుతం దీనిపై స్పష్టత ఇస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ ఆదేశాలివ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు. అర్హత ఉంటుందో? లేదో? అనే అనుమానంతో మొదటి విడుతలో కొంతమంది నామినేషన్లు దాఖలు చేయలేకపోయారు. రెండు, మూడువిడుతల్లో ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీల పరిధిలో రైతు సమన్వయ సమితి సభ్యులు ఎక్కువగా నామినేషన్లు వేసే అవకాశం ఉన్నది.

సోపానం

నాడు సర్పంచ్.. నేడు ఎమ్మెల్యే

దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ప్రస్థానమిది



దేవరకొండ, నమస్తేతెలంగాణ :

నల్లగొండ జిల్లా దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ రాజకీయ ప్రస్థానం సర్పంచ్ నుంచే మొదలైంది. దేవరకొండ మండలం శేరిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రత్యతండారవీంద్రకుమార్ స్వస్థలం. డిగ్రీ ఫైనలియర్ చదువుతుండగానే రవీంద్రకుమార్‌కు 1995లో శేరిపల్లి గ్రామ సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం వచ్చింది. సీపీఐ మద్దతుతో పోటీ చేసిన ఆయన తన ప్రత్యర్థిపై 150 ఓట్ల మెజార్టీతో తొలి ప్రయత్నంలోనే విజయం సాధించారు. రెండో సారి 2001లో తన ప్రత్యర్థిపై 70 ఓట్ల మెజార్టీతో రవీంద్రకుమార్ సర్పంచ్‌గా గెలుపొందారు. సర్పంచ్‌గా మూడేండ్ల పదవీ కాలం పూర్తయిన అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సీపీఐ నుంచి 2004లో దేవరకొండ ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశం వచ్చింది. ఎమ్మెల్యేగా విజయం సాధించిన తర్వాత సర్పంచ్ పదవికి రాజీనామా చేశారు. 2014లో మరోసారి సీపీఐ నుంచే పోటీచేసి ఎమ్మెల్యేగా రెండో సారి గెలుపొందారు. టీఆర్‌ఎస్ తొలిసారిగా అధికారంలోకి వచ్చాక సీపీఐ నుంచి టీఆర్‌ఎస్‌లో చేరారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్ తరపున పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో పాటు ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక మెజార్టీని సాధించడం విశేషం.

నామినేషన్లు పూర్తి

మొదటిపేజీ తరువాయి...

వ్యక్తికి కాకుండా వేరే వ్యక్తికి సమర్పించినట్టు గుర్తించినా నామినేషన్ తిరస్కరిస్తారు. నిర్దేశిత నమూనాలో నామినేషన్ పత్రాలను పూరించకపోవడం, పత్రాలపై అభ్యర్థి, ప్రతిపాదకుడు సంతకాలు చేయకపోవడం, రిజర్వుస్థానాల్లో ఇతరులు పోటీచేయడం, కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించకపోవటం వంటివి ఉంటే నామినేషన్లను తిరస్కరిస్తారు. వార్డు మెంబర్ పదవి కోసం ప్రతిపాదకుడు సంబంధిత వార్డులో ఓటరుగా నమోదు అయి ఉండాలి. సర్పంచ్ అభ్యర్థిని ప్రతిపాదించేవారు కూడా సంబంధిత గ్రామ పంచాయతీలో ఓటరుగా ఉండాలి. లేనిపక్షంలో ఆ నామినేషన్లు అనుమతించరు. నేర చరిత్ర, ఆస్తులు, అప్పులు, విద్యార్హతలకు సంబంధించిన సమాచారాన్ని నిర్దేశించిన నమూనాలో ఇద్దరు సాక్ష్యుల ధ్రువీకరణతోపాటు డిక్లరేషన్ పత్రాలను దాఖలుచేయకుంటే నామినేషన్లను తిరస్కరిస్తారు. వయస్సుకు సంబంధించిన ఆధారాలు, నగదు రూపంలో డిపాజిట్‌చేస్తే ఆర్వో దగ్గర నుంచి తీసుకున్న రశీదు, ప్రభుత్వ ట్రెజరీ, గ్రామ పంచాయతీ ఖాతాలో జమచేస్తే రశీదు, చలానా, నామినేషన్ దాఖలు తర్వాత ఆర్వో ఇచ్చిన రశీదు, పరిశీలన నోటీసు ప్రతులు, నామినేషన్లపై లేవనెత్తిన అభ్యంతరాలకు ధ్రువీకరణ పత్రాలను అభ్యర్థులు తప్పనిసరిగా చూపించాలి. నామినేషన్ల పరిశీలన ముగిసిన వెంటనే అర్హులైన అభ్యర్థుల జాబితాను రిటర్నింగ్ అధికారులు రూపొందించి, నోటీసు బోర్డుపై అంటించాలి. అభ్యర్థులు తమ నామినేషన్ ఎందుకు తిరస్కరణకు గురైందో తెలుసుకోవచ్చు. తిరస్కరణ విషయంలో అభ్యంతరాలు ఉన్న అభ్యర్థులు సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారి, సబ్ కలెక్టర్ దగ్గర మరుసటి రోజు అప్పీల్ చేసుకోవాలని ఎన్నికల సంఘం సూచించింది.

ఆ ఊరిలో పాలకులంతా మహిళలే

వరంగల్ రూరల్ జిల్లాలోని నర్సంపేట రూరల్ మండలం రాజపల్లి గ్రామం ఈ పంచాయతీ ఎన్నికల్లో ప్రత్యేకతను చాటుకున్నది. గ్రామంలో ఎనిమిది వార్డులకు గాను నాలుగింటిని మహిళలకు రిజర్వు చేశారు. సర్పంచ్ స్థానం కూడా మహిళలకే రిజర్వు చేయడంతో గ్రామస్థులంతా ఒక్కతాటిపైకి వచ్చి, మిగిలిన నాలుగు జనరల్ స్థానాల్లోనూ మహిళలనే బరిలో దించి ఏకగ్రీవం చేసుకున్నారు. సర్పంచ్‌గా నామాల భాగ్యమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం వివిధ జిల్లాల్లో దాఖలైన నామినేషన్లు, ఏకగ్రీవాల వివరాలు ఇలా ఉన్నాయి.

జిల్లా	గ్రామాలు/ వార్డులు	సర్పంచ్‌లు/ వార్డు మెంబర్లు	ఏకగ్రీవాలు సర్పంచ్‌లు/ వార్డు మెంబర్లు
నల్లగొండ		1735/5706	43/
వికారాబాద్	249/1180	4275/5655	25/
మహబూబ్‌నగర్	249	1543/5119	23/185
మెదక్	154/1364	1364/3007	20/
వరంగల్ రూరల్	145/1264	801/2261	19/
నాగర్‌కర్నూల్	160	848/3203	17/
జయశంకర్ భూపాలపల్లి	158/1358	956/3350	16/16
మహబూబాబాద్	156/1366	881/3375	12/117
జనగామ	100/906	218/625	11/
సంగారెడ్డి	258/1679	2398/7576	10/
వనపర్తి	80		10/
యాదాద్రి భువనగిరి			9/
రంగారెడ్డి			8/6
భద్రాద్రి కొత్తగూడెం	174/825	1534/3950	7/48
జగిత్యాల	131	991/2650	7/44
సిద్దిపేట	186/948	1,712/3502	6/49
వరంగల్ అర్బన్	49/472	280/1261	5/24
కుమ్రంభీం ఆసిఫాబాద్	113/992	589/1854	5/8
ఖమ్మం	188/1125	1736/4564	4/36
మేడ్చల్ మల్కాజిగిరి	55/322	199/1178	4/
కరీంనగర్	97 /928	906/2,980	2/80
సూర్యాపేట		1236/4130	1/42
పెద్దపల్లి	106 /962	1048/2,536	0/5
జోగులాంబ గద్వాల	106	490/1838	00/00

పల్లెల్లో పట్నం రాజకీయం

- రాజధాని శివారు గ్రామాల్లో హైదరాబాదీల హవా
- ఊరిలో ఓటు.. హైదరాబాద్‌లో నివాసం
- గ్రామానికి దూరంగా ఉన్నా ఎన్నికల్లో కీలక పాత్ర
- కొందరు పోటీకి సిద్ధం.. మరికొందరు ఆర్థిక సాయం

శిరందాస్ ప్రవీణ్‌కుమార్, హైదరాబాద్ సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

పల్లె ఎన్నికల్లో పలు ఆసక్తికరమైన సన్నివేశాలు ఆవిష్కృతం అవుతున్నాయి. నగర శివారు పల్లెల్లో పట్నం రాజకీయం నడుస్తున్నది. చాలా గ్రామాల్లో సర్పంచ్, వార్డుస్థానాల్లో అభ్యర్థుల ఎంపిక నుంచి గెలుపు వరకు హైదరాబాద్‌లో స్థిరపడిన వారి ఆధిపత్యం కొనసాగుతున్నది. వారంతా దశాబ్దాల కిందటే పిల్లల చదువులు, వ్యాపారాలు, ఉపాధి కోసమంటూ హైదరాబాద్‌కు వచ్చారు. అయినా ఇప్పటికీ అక్కడి ఓటరు జాబితాలో వారి పేర్లు కొనసాగుతున్నాయి. ఇలా నగరంలో ఉంటూ పండుగలకు, ఫంక్షన్లకు వచ్చి వెళ్లేవారు ఇప్పుడు చక్రం తిప్పుతున్నారు. కొందరు నేరుగా పోటీకి సై అంటుండగా.. మరికొందరు తమ అనుచరులను బరిలోకి దింపి, ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ శివారులోని ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి, చేవెళ్ల, షాద్‌నగర్, మేడ్చల్, మునుగోడు, భువనగిరి, ఆలేరు, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో పట్నంవాసుల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తున్నది. ఎక్కువగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు ఊరి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. క్యాంపు రాజకీయాలు, నామినేషన్ల ఉపసంహరణ, ఊరడింపుల ప్రక్రియ, ఉప సర్పంచ్ ఎన్నిక వంటి ప్రధాన ఘట్టాలన్నీ వీరి పర్యవేక్షణలోనే నడుస్తున్నాయి.



50 కిలోమీటర్ల పరిధిలోని మండలాల్లో..

హైదరాబాద్ చుట్టూ దాదాపు 50 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో ఇలాంటి రాజకీయం ఎక్కువగా కనిపిస్తున్నది. ఊరిలోని ఇతర వర్గాల ప్రతినిధులను కూర్చోబెట్టి తమవాడికి మద్దతు ఇవ్వాలంటూ నచ్చజెప్తున్నారు. శంకర్‌పల్లి మండలంలోని ఓ గ్రామంలో అభ్యర్థి ఎంపికలో ఐటీ కారిడార్‌లో నివాసం ఉంటున్న 10 మంది వ్యాపారులు కీలక పాత్ర పోషిస్తే.. మేడ్చల్ ప్రాంతంలో బెంగళూరులో నివాసం ఉంటున్న ఓ వక్తి వచ్చి వార్డు సభ్యుడిగా నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యాడు. కేశంపేట, కొందుర్గు మండలాల్లో పోటీచేసేవారిలో కొందరు షాద్‌నగర్‌లో స్థిరపడ్డవారున్నారు. ఆదాయం అధికంగా వచ్చే కొత్తూరు, నందిగామ, చౌదరిగూడ మండలాల్లోని పలు గ్రామాల్లో హైదరాబాద్‌లో స్థిరపడిన వ్యాపారులు క్యాంపు రాజకీయాలు నడిపిస్తున్నారు. అత్యంత ఖరీదైన భూములున్న మొయినాబాద్, శంకర్‌పల్లి, శామీర్‌పేట మండలాల్లోనూ స్థానికేతరుల పెత్తనం నడుస్తున్నది. కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లోని కొన్ని తండాల్లో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నవారు బరిలోకి దిగుతున్నారు. దీంతో అభ్యర్థులు ఎక్కువగానే వ్యయం చేయనున్నారు. ఈ ఖర్చుకు భయపడి గ్రామంలోనే ఉంటున్నవారు వెనుకడుగు వేస్తున్నారు.

ఆర్‌ఆర్‌ఆర్‌తో పెరిగిన రేటు

ఔటర్ రింగ్‌రోడ్‌కు అవతల రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణానికి ఏడాదిగా ప్రయత్నాలు చేస్తుండటం, ఇటీవలే కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో హైదరాబాద్ చుట్టూ 30-50 కిలోమీటర్ల పరిధిలో భూముల ధరలు పెరిగాయి. ఈ డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు రియల్టర్లు ప్రయత్నిస్తున్నారు. పల్లెల్లో అధికారాన్ని చేజిక్కించుకుంటే తమ వ్యాపారం వర్ధిల్లుతుందని ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ఈసారి ధన ప్రవాహం పెరిగే అవకాశాలున్నాయి. కొన్నిచోట్ల నేరుగా రియల్టర్లు బరిలోకి దిగుతుండగా, మరికొన్ని చోట్ల అనుయాయులను దింపి ఎంతైనా ఖర్చు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

బ్రాండ్ బాబులు

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో దావత్‌ల జోరు నడుస్తున్నది. శామీర్‌పేట మండలంలో ఓ పంచాయతీ నుంచి పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థి దావత్‌లలోనూ బ్రాండ్‌ను మెయింటెయిన్ చేస్తున్నారు. ఇప్పటికే ఐదారు సార్లు వందల మందిని కూర్చోబెట్టి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. ప్రతి దావత్‌లోనూ ఒకటే బ్రాండ్ మద్యాన్ని మెయింటేయిన్ చేస్తున్నారు. అభ్యర్థికి ఉన్న నలుగురు అన్నదమ్ములు కూడా అదే బ్రాండ్ మద్యంతో దావత్‌లు నిర్వహిస్తున్నారు. ఈ ఐదుగురు వారి క్లాస్‌మేట్స్ దావత్‌లలోనూ అదే బ్రాండ్‌ను వాడుతుండటంతో ఊరిలో యువతంతా బ్రాండ్ బాబులుగా మారారంటూ చర్చించుకుంటున్నారు. ఒకే రకం వినియోగిస్తే గిఫ్టుల కింద మరికొంత సరుకు వస్తుందని, ఒక్కటే రకం తీసుకుంటే కంపెనీ భారీ డిస్కౌంట్ ఇస్తుందని చర్చించుకుంటున్నారు.

గిరిజనం.. ఐక్యతారాగం!

యాతాలం చిన్నారెడ్డి, నిర్మల్, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి:

దట్టమైన అడవులు, వాగులు, వంకలు.. కవ్వాల్ పులుల అభయారణ్యంలోని కుగ్రామాలు, తండాలు, గూడేలు.. ఒకప్పుడు మావోయిస్టులకు పట్టున్న ప్రాంతాలు.. ఇవి పూర్తిగా గిరిజనులే నివాసం ఉండే పెంబి మండలంలోని గ్రామాలు. 95 శాతం వ్యవసాయమే జీవనాధారంగా ఉండే ఇక్కడి గిరిజనంలో అక్షరాస్యత అంతంత మాత్రమే. ఈ గిరిజన తండాలు, గూడేలు పంచాయతీ ఎన్నికల్లో రాజకీయంగా ఎంతో చైతన్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. అందులోనూ అన్ని గిరిజన తండాలు కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలే అయినప్పటికీ వీటిలో ఇప్పటికే మెజారిటీ తండాలు, గూడేలలో పంచాయతీ పాలకవర్గాలను ఏకగ్రీవంచేశారు. అంతా ఏకమై ఒక్కమాటపై నిలబడుతున్నారు. తమ గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేసుకున్నారు. రాజకీయ కక్షలు, వివాదాలు, గ్రూపులు, గొడవలకు తావే లేకుండా.. అభివృద్ధే లక్ష్యంగా కలిసి ముందుకు సాగుతున్నారు.



- గ్రామాభివృద్ధి లక్ష్యంగా ఏకమవుతున్న గిరిజనులు
- మారుమూల పెంబి మండలంలో ఏకగ్రీవాల జోరు
- 18 కొత్త పంచాయతీల్లో 12 చోట్ల ఏకగ్రీవ తీర్మానాలు
- ప్రభుత్వ నజరానాకు తోడు ఎమ్మెల్యేల అదనపు నిధులు
- ఆదర్శ పంచాయతీలుగా మారిన తండాలు, గూడేలు

నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గంలోని పెంబి మండలం మారుమూల ప్రాంతం. 2016 అక్టోబర్ 11న జిల్లాల పునర్విభజన సమయంలో కొత్త మండలంగా ఏర్పాటుచేశారు. గతంలో ఖానాపూర్ మండలంలో అంతర్భాగంగా ఉండేది. ఆరు గ్రామ పంచాయతీలను విడదీసి కొత్తగా పెంబి మండలాన్ని ఏర్పాటుచేశారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం తండాలు, గూడేలు, అనుబంధ గ్రామాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. ఒక్క పెంబి మండలంలోనే 18 తండాలు, గూడేలు కొత్తగా గ్రామపంచాయతీలుగా ఆవిర్భవించాయి. కొత్తగా ఏర్పాటు చేసిన 18 గ్రామపంచాయతీలు పూర్తిగా గిరిజన తండాలు, గూడేలు. వీటిలో ఇప్పటికే 12 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కాగా, మిగతావీ ఇదేబాటలో పయనిస్తున్నాయి. సర్పంచ్ పదవులతో పాటు ఉపసర్పంచ్, వార్డుసభ్యుల పదవులను కూడా ఏకగ్రీవంచేయడం గమనార్హం. హరిచంద్‌తండా, కోరకంటితండా, లోత్‌ర్య తండా, క్రిష్ణానాయక్‌తండా, జంగగూడ, రామ్‌నగర్, దోందారి, కోసగుట్ట, వేణునగర్, యాపల్‌గూడ, పుల్గంపాండ్రి, నాగాపూర్‌తండాలను ఏకగ్రీవంచేశారు. తాటిగూడ గ్రామ పంచాయతీ కూడా ఇప్పటికే ఏకగ్రీవంచేయగా ఇంకా వెల్లడించాల్సి ఉంది.


పాత పంచాయతీలు సైతం..

మండలంలోని ఆరు పాత గ్రామపంచాయతీల నుంచి వెంకంపోచంపాడ్, పసుపుల గ్రామపంచాయతీలను ఇప్పటికే ఏకగ్రీవం చేశారు. ఇప్పటికే 14 ఏకగ్రీవం చేయగా, తాజాగా తాటిగూడను ప్రకటించనున్నారు. గిరిజన సంఘాల చొరువతో తండాలు, గూడేలు ఏకగ్రీవాల బాటలో పయనిస్తున్నాయి. జిల్లాలోని ఖానాపూర్, కడెం, మామడ, సారంగాపూర్, నర్సాపూర్(జి), కుంటాల మండలాల్లోని పలు తండాలు, గూడెంలు, కొత్త గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. నామినేషన్ల గడువు ముగిసే నాటికి మరిన్ని గ్రామాలు ఏకగ్రీవమయ్యే అవకాశాలున్నాయి. ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల నజరానా ప్రభుత్వం ఇస్తుండగా, స్థానిక ఎమ్మెల్యేలు అదనపు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ నజరానా, అదనపు నిధులతో గ్రామాలు అభివృద్ధి బాటన పయనిస్తాయనే నమ్మకంతో గ్రామస్థులంతా ఏకమై ఏకగ్రీవం చేసుకుంటున్నారు.




నా మీద నమ్మకంతో ఏకగ్రీవ తీర్మానం చేసి సర్పంచ్‌గా ఎంపిక చేసిన గ్రామస్థులకు రుణపడి ఉంటాను. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాన్ని అభివృద్ధి చేస్తా. గ్రామస్థులందరం సమావేశాన్ని ఏర్పాటుచేసుకుని ఏకగ్రీవంగా సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను ఎన్నుకున్నాం. ప్రభుత్వ నజరానాతో పాటు ఇతర నిధులతో పల్లెను అభివృద్ధి చేసుకుంటాం.

-ఆత్రం రాధ, ఏకగ్రీవ సర్పంచ్ అభ్యర్థి, వేణునగర్



మా తండా నూతన పంచాతీగా ఏర్పాటవడంతో నాకు సర్పంచ్‌గా అవకాశం వచ్చింది. మా గ్రామస్థులందరూ నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వం అందజేసే నజరానాతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటాం. రాజకీయ వివాదాలు, ఘర్షణలు, గ్రూపులు లేకుండా సమిష్టిగా అభివృద్ధికి కృషిచేస్తాం.

-జాదవ్ సుదర్శన్, ఏకగ్రీవ సర్పంచ్, హరిచంద్‌తండా



ఏకగ్రీవ తీర్మానాలతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. గత ఎన్నికల్లోనూ పసుపుల గ్రామ పంచాయతీకి ఏకగ్రీవంగా సర్పంచ్‌ను ఎన్నుకున్నాం. ప్రభుత్వం అందజేసిన నజరానాతో అంతర్గత రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించుకున్నాం. ఇప్పుడు కూడా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడానికి తీర్మానం చేసి సర్పంచ్‌ను ఎన్నుకున్నాం.

-భుక్య గోవింద్, పసుపుల



ఏడోసారి ఏకగ్రీవం

ఆదర్శంగా నిలుస్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా అక్కారం గ్రామం

అచ్చంపేట రూరల్: చుట్టూ నల్లమల అటవీ ప్రాంతం.. ఫోన్ సిగ్నల్స్ కూడా ఉండవు. అయినా ఆ గ్రామం ఏకగ్రీవంగా పంచాయతీ పాలకవర్గాన్ని ఎన్నుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నది. అదే నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని ఏజెన్సీ గ్రామం అక్కారం. మండల కేంద్రానికి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామ జనాభా 1,826. ఎక్కువగా బంజారాలు ఉండే ఈ గ్రామస్థుల ఐకమత్యానికి మారు పేరుగా నిలుస్తున్నారు. ఇప్పటికి ఈ గ్రామంలో ఏడుసార్లు పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. 1975 నుంచి 2000 వరకు ఐదుసార్లు మూడావత్ చత్రునాయక్ ఏకగ్రీవ సర్పంచ్‌గా పాలించారు. 2001, 2006లో మాత్రం ఎన్నికలు జరిగాయి. 2013 ఎన్నికల్లో మందు కమల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామస్థులు సమావేశం ఏర్పాటుచేసుకొని ఇస్లావత్ కృష్ణవేణిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్టు తీర్మానం చేశారు. దీంతో అక్కారం పంచాయతీ ఏర్పడ్డ నాటి నుంచి ఇప్పటివరకు ఏడుసార్లు ఏకగ్రీవంగా పాలకవర్గాలు ఎన్నికయ్యాయి. కేవలం రెండుసార్లు మాత్రమే ఎన్నికలు జరిగాయి.

సర్పంచ్ అభ్యర్థి అదృశ్యం

దౌల్తాబాద్ : వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని నీటూర్ గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థి విశ్వనాథ్ మంగళవారం అర్ధరాత్రి నుంచి కనిపించడం లేదు. ఆయన భార్య నిర్మల బుధవారం దౌల్తాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సతీశ్ గ్రామంలో విచారణ జరిపి మిస్సింగ్ కేసుగా నమోదుచేశారు. ఈ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో పరిగి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, కొడంగల్ సీఐ నాగేశ్వర్‌రావు గ్రామానికి చేరుకొని దర్యాప్తు చేశారు. విశ్వనాథ్ కాంగ్రెస్ మద్దతులో పంచాయతీ ఎన్నికల బరిలోకి దిగుతున్నట్టు తెలిసింది.

నమస్తే తెలంగాణ
ఆట
10
[కరీంనగర్]
గురువారం 10 జనవరి 2019
WWW.NTNEWS.COM

ఈ నెల 14 నుంచి గిరిజన విద్యార్థుల
జాతీయస్థాయి క్రీడల పోటీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గిరిజన పాఠశాలల జాతీయ స్థాయి స్పోర్ట్స్ మీట్–2019 ఈ నెల 14 నుంచి హైదరాబాద్‌లో ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కేంద్ర గిరిజన శాఖ, తెలంగాణ ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు ఈ టోర్నీలో పాల్గొంటున్నారు. హాకీ, రెజ్లింగ్, ఫుట్‌బాల్, ఆర్చరీ, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, బాక్సింగ్, అథ్లెటిక్స్ తదితర క్రీడాంశాల్లో గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో పోటీలు నిర్వహించనున్నారు.

అవధే వారియర్స్ విజయం

బెంగళూరు: పీబీఎల్ నాలుగో సీజన్‌లో దుమ్ము రేపుతున్న అవధే వారియర్స్ బుధవారం నార్త్ ఈస్టర్న్ వారియర్స్ జట్టుపై 5–0తో ఘన విజయం సాధించింది. తద్వారా 25 పాయింట్లు సాధించి టేబుల్ టాపర్‌గా నిలిచింది. నార్త్ ఈస్టర్న్ జట్టు స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్‌పై 15–11,11–15,7–15 స్కోరుతో ప్రపంచ పదో నంబర్ బీవెన్ జాంగ్ విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో క్రిస్టియన్‌సేన్, అశ్వినీ పొన్నప్ప జోడీ 15–7,15–14 స్కోరుతో లియావో మిన్‌చున్, కిమ్ హా నా జోడీని ఓడించింది.

ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం

రూ.700 కోట్లతో నిర్మాణం



అహ్మదాబాద్: 63 ఎకరాలు.. రూ.700 కోట్ల ఖర్చుతో గుజరాత్ రాష్ట్రం, అహ్మదాబాద్‌లోని మొతెరాలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం నిర్మాణం కొనసాగుతున్నది. లక్షమంది సీటింగ్ సామర్థ్యంతో ఈ స్టేడియం నిర్మిస్తున్నట్లు గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పరిమల్ నత్వాని వెల్లడించారు. 2018లో శంకుస్థాపన చేసిన ఈ స్టేడియం నిర్మాణం శరవేగంగా సాగుతున్నది. ఇది గుజరాత్ క్రికెట్ అసోసియేషన్‌కు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టని, ఈ స్టేడియం దేశానికే తలమానికంగా నిలువనుందని ఆయన చెప్పారు. 90వేల సీటింగ్ సామర్థ్యంతో ప్రపంచంలోనే అతిపెద్ద స్టేడియంగా ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ స్టేడియం ఉండగా.. నిర్మాణం పూర్తి చేసుకుంటే మొతేరా ఈ రికార్డును బద్దలు కొట్టనుంది.

యూఏఈతో సై

దూకుడుగా యువ భారత్
తొలి విజయం కోసం ఆతిథ్య జట్టు ఆరాటం
ఏఎఫ్‌సీ ఆసియా కప్



అబుదాబి: పునర్‌వైభవం దిశగా సాగుతున్న భారత ఫుట్‌బాల్ జట్టు ఏఎఫ్‌సీ ఆసియాకప్‌లో మరో కీలక పోరుకు సిద్ధమైంది. తొలి మ్యాచ్‌లో మనకంటే మెరుగైన థాయిలాండ్‌పై 4–1 గోల్స్ తేడాతో విజయం సాధించిన ఛెత్రిసేన ..గురువారం అబుదాబిలో జరిగే గ్రూప్–ఏ రెండోలీగ్ మ్యాచ్‌లో పటిష్ఠమైన యూఏఈ జట్టుతో తలపడనుంది. భారత చీఫ్ కోచ్ కాన్‌స్టాంటైన్ శిక్షణలో అద్భుత విజయాలతో దూసుకెళుతున్న ఛెత్రి సేన ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే దాదాపు నాకౌట్‌లో స్థానం ఖాయం కానుంది. బహ్రెయిన్ జట్టుతో జరిగిన తొలి మ్యాచ్‌ను 1–1తో పేలవ డ్రాగా ముగించుకున్న యూఏఈ జట్టు.. భారత్‌పై విజయం సాధించాలన్న ఒత్తిడితో బరిలోకి దిగనుంది. ఇప్పటికి రెండు జట్లు 13 సార్లు ముఖాముఖీ తలపడగా యూఏఈ జట్టు 8 విజయాలు సాధించి పైచేయిని ప్రదర్శించింది. భారత జట్టు కేవలం రెండు విజయాలు సాధించి మరో రెండు మ్యాచ్‌లను డ్రాగా ముగించింది. చివరిసారిగా 2011లో ప్రపంచకప్ అర్హత మ్యాచ్ సందర్భంగా ఇరుజట్లూ తలపడిన మ్యాచ్ 2–2 స్కోరుతో డ్రాగా ముగిసింది. తాజాగా ఫిఫా ర్యాంకింగ్స్‌లో యూఏఈ జట్టు 79వ స్థానంలో ఉండగా..భారత ఫుట్‌బాల్ జట్టు 97వ స్థానంలో కొనసాగుతున్నది.

విజయంపై ఆతిథ్యదేశం ఆశలు

తొలిమ్యాచ్‌ను డ్రా చేసుకున్న ఆతిథ్య దేశం ..భారత్‌పై గెలుపు సాధించాలని ఉవ్విళ్లూరుతున్నది. బహ్రెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో 2015 ఆసియా ఉత్తమ ఫుట్‌బాలర్‌గా నిలిచిన అహ్మద్ ఖలీల్ బరిలోకి దిగి గోల్ కొట్టడంతో స్కోరు సమమైంది. 'తొలిమ్యాచ్‌లో మేం ఓడిపోనందుకు సంతోషించాలి. ఇప్పుడు భారత్‌తో జరిగే తదుపరి మ్యాచ్ గురించి ఆలోచిస్తున్నాం. విజయం సాధిస్తే నాకౌట్ అవకాశాలు సజీవంగా ఉంటాయి' అని అహ్మద్ ఖలీల్ అన్నాడు. ఒమర్ అబ్దుల్లా, అలీతోపాటు ఖలీల్‌తో కూడిన యూఏఈ ఫార్వర్డ్ శ్రేణి భారత డిఫెండర్లు సందేశ్ జింగాన్, ఎదాతోదికాకు కఠిన పరీక్ష పెట్టనున్నారు. ఫాంలో ఉన్న భారత స్ట్రైకర్లను నిలువరించడమే ధ్యేయంగా యూఏఈ బరిలోకి దిగుతుండగా..మరోవైపు దూకుడైన ఆటతీరుతో రెండో విజయం కోసం భారత జట్టు సై అంటున్నది.

దూకుడుగా బ్లూ టైగర్స్:
సారథి సునీల్ ఛెత్రి.. భారత్ బలం అంతా ఈ సూపర్ ఫార్వర్డ్ ప్లేయర్ అంటే అతిశయోక్తి కాదు. కోచ్ వ్యూహాలకు అనుగుణంగా మైదానంలో దూకుడుగా కనిపిస్తున్నాడు. మరోవైపు యువ ఆటగాళ్లు సైతం ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై శరపరంపరగా దాడులు చేస్తూ ఫలితం రాబడుతున్నారు. అటాకింగ్‌లో భారత్ రాణిస్తున్నా డిఫెన్స్ లోపాలపై కోచ్ కాన్‌స్టాంటైన్ జట్టు సభ్యులను హెచ్చరిస్తున్నాడు. థాయిలాండ్‌తో జరిగిన లీగ్ మ్యాచ్ ..తొలి అర్థభాగంలో ఛెత్రి గోల్‌తో 1–0 ఆధిక్యం సంపాదించినా మరో పది నిమిషాల్లోనే 1–1తో స్కోరు సమం చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నాడు. రెండో అర్థభాగంలో చెలరేగిన విధంగానే యూఏఈతోనూ ఆడాలని సూచిస్తూ ప్రతిదాడులను టీమ్ ఇండియా సమర్థంగా అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నాడు. 'మా జట్టంతా కుర్రాళ్లతో నిండి ఉంది. వారంతా చాలా ఉద్వేగంగా కనిపిస్తున్నారు. అతిథ్య జట్టు యూఏఈ అనుభవం ఉన్న జట్టు కావొచ్చు. వారి ఆటతీరు విభిన్నం కావొచ్చు. మేం ఇవేం పరిగణనలోకి తీసుకోం. మా ప్రయాణంలో ఎదురవతున్న మరో ప్రత్యర్థి జట్టుగా భావిస్తున్నాం. విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాం' అని కాన్‌స్టాంటైన్ అన్నాడు. రెండు గోల్స్ సాధించి మాంచి ఊపుమీద కనిపిస్తున్న సునీల్ ఛెత్రి మీద భారత్ అతిగా ఆధారపడతుండడం కాస్త ఆందోళన కలిగిస్తున్నది. తొలిమ్యాచ్‌లో లాల్ ఫెక్లువా, యువ అనిరుధ్ థాపా కీలక సమయంలో గోల్స్ అందించడం శుభపరిణామంగా చెప్పొచ్చు. ఎలాంటి ఒత్తిడి లేకుండా భారతజట్టు మైదానంలో చెలరేగితే యూఏఈపై విజయం సాధించడం సునాయాసమే.

హాకీ కోచ్ హరేంద్రసింగ్‌పై వేటు

జూనియర్ జట్టు కోచ్‌గా తిరిగి నియామకం

ఆరేండ్లలో ఆరోకోచ్‌ను మార్చిన హాకీ



న్యూఢిల్లీ: గత ఆరేండ్లలో ఆరో కోచ్ మార్పుతో హాకీ ఇండియా (హెచ్‌ఐ) తన తీరు మారదని మరో మారు స్పష్టం చేసింది. గతేడాది మే నెలలో పదవీ బాధ్యతలు చేపట్టిన భారత హాకీ జట్టు సీనియర్ కోచ్ హరేంద్ర సింగ్‌ను తప్పిస్తున్నట్లు హాకీ ఇండియా బుధవారం ప్రకటించింది. 'అంచనాలకు తగినట్లుగా భారత పురుషుల హాకీ జట్టు రాణించలేకపోవడం నిరాశను కలిగించింది. భవిష్యత్ అవసరాలరీత్యా జూనియర్లను సానబెట్టే కార్యక్రమం కోసం హరేంద్ర సింగ్ సేవలను వినియోగించుకోవడం మంచిదని భావిస్తున్నాం' అని హాకీ ఇండియా పేర్కొంది. బుధవారం హై ఫెర్ఫార్మెన్స్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో చైర్మన్ ఆర్‌పీ సింగ్, హర్బిందర్ సింగ్, బీపీ గోవిందా, సయ్యద్ అలీ పాల్గొన్నారు. 2018 ఏడాదిలో భారత హాకీ జట్టు కామన్వెల్త్ క్రీడల్లో పతకం సాధించలేకపోయింది. ఆసియా క్రీడల్లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగి కాంస్యంతో సరిపెట్టుకుంది. భువనేశ్వర్‌లో జరిగిన ప్రపంచకప్‌లో క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. అంతేకాదు 2020 ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించడంలో విఫలమైంది. దీంతో సీనియర్ జట్టు కోచ్ పదవినుంచి హరేంద్రను తప్పించాలని కమిటీ నిర్ణయించింది. వచ్చే మార్చిలో జరుగనున్న సుల్తాన్ అజ్లాన్ షా కప్ సమయానికి కొత్త కోచ్‌ను నియమిస్తామని పేర్కొంది. భారత హాకీ కోచ్ పదవి కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తామని చెప్పింది. కొత్త కోచ్ నియామకం జరిగే వరకు జట్టు హైఫెర్ఫార్మెన్స్ డైరెక్టర్ డేవిడ్ జాన్, జట్టు విశ్లేషకుడు క్రిస్ కిరియెల్లో తాత్కాలిక కోచ్‌లుగా బాధ్యతలు నెరవేరుస్తారని హాకీ ఇండియా పేర్కొంది.

రెండో రౌండ్‌లో ప్రజ్నేశ్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ అర్హత మ్యాచ్‌లలో భారత వర్ధమాన టెన్నిస్ ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్ రెండో రౌండ్ చేరుకున్నాడు. బుధవారం క్రొయేషియాకు చెందిన విక్టర్ గాలోవిచ్‌తో జరిగిన మ్యాచ్‌లో 6–4,6–4 స్కోరుతో వరుససెట్లలో విజయం సాధించాడు. 'ఇదొక సాధారణ మ్యాచ్. నేను బాగా ఆడగలిగాను. పొరపాట్లకు తావీయకుండా స్థిరంగా ఆడి విజయం సాధించాను' అని మ్యాచ్ అనంతరం ప్రజ్నేశ్ తెలిపాడు. స్పెయిన్‌కు చెందిన లోపెజ్ పెరెజ్‌ను రెండో రౌండ్‌లో ప్రజ్నేశ్ ఢీకొట్టనున్నాడు.

నన్ను క్షమించండి

మహిళలపై అనుచిత వ్యాఖ్యలకు హార్దిక్ పశ్చాత్తాపం
బీసీసీఐ షోకాజ్ నోటీస్‌కు స్పందన
కాఫీ విత్ కరణ్ షోలో హార్దిక్ మాటలు వైరల్

సిడ్నీ/న్యూఢిల్లీ: నోటి దురుసుతనం చేటు తెచ్చింది. నోరును అదుపులో పెట్టుకోలేని తత్వం పశ్చాత్తాప పడేలా చేసింది. వివరాల్లోకి వెళితే..బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు కరణ్ జోహర్ నిర్వహించే 'కాఫీ విత్ కరణ్' కార్యక్రమంలో భారత యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా.. మహిళల పట్ల చేసిన వ్యాఖ్యలు మంటలు పుట్టిస్తున్నాయి. సహచర క్రికెటర్ కేఎల్ రాహుల్‌తో కలిసి కరణ్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న హార్దిక్..మహిళలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియా వేదికగా వైరల్‌గా మారాయి. దీనిపై వెంటనే స్పందించిన క్రికెట్ పరిపాలన కమిటీ(సీవోఏ) చీఫ్ వినోద్ రాయ్..హార్దిక్‌తో పాటు రాహుల్‌కు బుధవారం షోకాజ్ నోటీసులు పంపించారు. 24 గంటల్లోగా సమాధానమివ్వాల్సిందిగా రాయ్ కోరారు. అయితే దీనిపై హార్దిక్ పాండ్యా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రతిస్పందించాడు. 'కరణ్ షాట్ షోలో మహిళల పట్ల నేను చేసిన వ్యాఖ్యలకు పశ్చాత్తాప పడుతున్నాను. ఎవరినీ అగౌరవపరుచాలన్న ఉద్దేశం నాకు లేదు. వీక్షకుల మనోభావాలు దెబ్బతింటే అందుకు క్షమాపణ కోరుతున్నాను. ఎవరినీ కించపరుస్తూ వ్యాఖ్యలు చేయాలన్న దుర్బుద్ధి నాకు లేదు. సమాజంలో ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకోవాలన్న ఉద్దేశం లేదు. షాట్ షోలో మాట్లాడుతున్న క్రమంలోనే అలా మాట్లాడాను తప్పించి..ఇలా వివాదాస్పదం అవుతాయని అనుకోలేదు. ఈ విషయంలో పూర్తి విచక్షణాధికారం బీసీసీఐదే. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి తప్పులు జరుగవని మాట ఇస్తున్నా' అని పాండ్యా ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చాడు. ఇదిలా ఉంటే హార్దిక్ పాండ్యా, రాహుల్ వివరణలపై రాయ్ మాట్లాడుతూ 'వాళ్ల వివరణలను ఇంకా పరిశీలించాల్సి ఉంది. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశం లేదు' అని రాయ్ అన్నాడు.

వివాదం రేపిన మాటలివే:
కొన్ని వారాల క్రితం కరణ్ షోలో రాహుల్‌తో కలిసి హార్దిక్ మహిళల గురించి అగౌరవంగా మాట్లాడాడు. 'మా అమ్మ, నాన్నలతో ప్రతి విషయాన్ని షేర్ చేసుకుంటాను. సెక్స్‌కు సంబంధించిన విషయాలు కూడా చర్చిస్తా. అమ్మాయిలతో గడిపిన సమయాన్ని కూడా వారి వద్ద దాచిపెట్టను. నా కన్యత్వం కోల్పోయిన సందర్భాన్ని నా తల్లిదండ్రులకు చెప్పా' అని హార్దిక్ అన్నాడు. అంతటితో ఆగకుండా మహిళలను ఏకవచనంతో బోధిస్తూ అది, ఇది అని వ్యాఖ్యానించడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

సచిన్ కంటే కోహ్లీ బెస్ట్

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, కెప్టెన్ విరాట్ కోహ్లీలో ఎవరు అత్యుత్తమ ఆటగాడు అన్న ప్రశ్నకు హార్దిక్, రాహుల్ ఇచ్చిన సమాధానం అభిమానులకు కోపం తెప్పించింది. సచిన్ కంటే కోహ్లీ బెస్ట్ అంటూ ఈ ఇద్దరు చెప్పారు. దీనిపై ఫ్యాన్స్ సోషల్‌మీడియాలో సెటైర్లతో విరుచుకుపడ్డారు. దేశ క్రికెట్‌కు ఎనలేని సేవలందించిన సచిన్ కంటే కోహ్లీ గొప్ప ఎలా అవుతాడని అభిమానులు ప్రశ్నల వర్షం కురిపించారు. వన్డే సిరీస్ కోసం ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న హార్దిక్, రాహుల్‌పై బీసీసీఐ ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.


పాండ్యా
రాహుల్

35/3 నుంచి 35కే ఆలౌట్

ఎంపీపై ఆంధ్ర ఘనవిజయం

ఇండోర్: రంజీ ట్రోఫీలో లోస్కోరింగ్ మ్యాచ్ నమోదైంది. ఆంధ్ర, మధ్యప్రదేశ్(ఎంపీ)మధ్య మూడు రోజుల్లోనే ముగిసిన మ్యాచ్‌లో వికెట్లు టపాటపా రాలాయి. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆంధ్ర 307 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆంధ్ర నిర్దేశించిన 343 పరుగుల లక్ష్యఛేదనలో ఎంపీ జట్టు 16.5 ఓవర్లలో 35 పరుగులకే కుప్పకూలింది. 35 పరుగులకు 3 వికెట్లతో ఉన్న ఎంపీ..శశికాంత్(6/18), విజయ్ కుమార్(3/17) ధాటికి పేకమేడలా కూలిపోయింది. క్రీజులోకి వచ్చిన బ్యాట్స్‌మెన్ వచ్చినట్లు పెవిలియన్ వెళ్లేందుకు పోటీపడ్డారు. స్కోరుబోర్డుపై పరుగు చేరకుండానే 23 బంతుల తేడాతో ఆఖరి ఆరు వికెట్లు కోల్పోవడం విశేషం. ఈ క్రమంలో ఐదుగురు ఆటగాళ్లు పరుగుల ఖాతా తెరువలేకపోయారు. గాయంతో గౌరవ్ యాదవ్ బ్యాటింగ్‌కు రాలేదు. ఇన్నింగ్స్ మొత్తమ్మీద ఆర్యమన్ బిర్లా(12), దూబే(16) టాప్‌స్కోరర్‌గా నిలిచారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరుతో 198/7 మూడో రోజు రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఆంధ్ర 301 పరుగులకు ఆలౌటైంది. అజేయ సెంచరీతో రాణించిన కరణ్ షిండే(103) మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. పాండే(3/55)కు మూడు వికెట్లు దక్కగా, గౌరవ్, సేన్, శర్మ రెండేసి వికెట్లు తీశారు.




బుధవారం పుణె, ఛత్రపతి శివాజీ స్టేడియంలో అండర్-17 విభాగంలో ఖేలో ఇండియా యూత్ క్రీడల ప్రారంభోత్సవానికి హాజరైన తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ(సాట్స్) చైర్మన్ ఏ వెంకటేశ్వరరెడ్డి, రవీందర్. ఈ క్రీడలను కేంద్రక్రీడల మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ ప్రారంభించారు.

ప్రాక్టీస్‌లో ధోనీ, ధవన్ బిజీ బిజీ


రాయుడు
ధవన్

సిడ్నీ: ఆస్ట్రేలియా గడ్డపై టెస్ట్ సిరీస్ కలను సాకారం చేసుకున్న భారత్ ఇక వన్డేలపై దృష్టి పెట్టింది. మరో మూడు నెలల వ్యవధిలో మొదలయ్యే వన్డే ప్రపంచకప్ దృష్ట్యా జట్టుకు మరింత మెరుగులు అద్దేందుకు పూనుకుంది. ఆసీస్‌తో ఈనెల 12న మొదలయ్యే మూడు వన్డేల సిరీస్‌తో పాటు న్యూజిలాండ్‌తో ఐదు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌లను టీమ్‌ఇండియా ఆడబోతున్నది. వీటికి తోడు స్వదేశం వేదికగా మార్చి 23 నుంచి ఆసీస్‌తో ఐదు వన్డేలు, రెండు టీ20 మ్యాచ్‌ల ఆడనుంది. ఇలా మెగాటోర్నీకి ముందు కోహ్లీ సారథ్యంలోని టీమ్‌ఇండియా కీలక సిరీస్‌లు ఆడబోతున్నది. ఈ సిరీస్‌లలో మెరుగైన ప్రదర్శన ఆధారంగా మెగాటోర్నీకి ఆటగాళ్లను ఎంపిక చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓవైపు ఆసీస్‌పై చారిత్రాత్మక సిరీస్ విజయాన్ని టెస్ట్ స్పెషలిస్టులు ఆస్వాదిస్తుంటే..మరోవైపు పరిమిత ఓవర్ల ఫార్మాట్ కోసం ధోనీ, ధవన్, రాయుడు, జాదవ్, రోహిత్, కార్తీక్, ఖలీల్, చాహల్ ఆసీస్‌కు చేరుకున్నారు. శనివారం సిడ్నీ వేదికగా జరిగే తొలి వన్డే కోసం ఇక్కడి పిచ్‌లకు అలవాటు పడేందుకు నెట్స్‌లో చెమటోడుస్తున్నారు. బుధవారం ప్రాక్టీస్ సెషన్‌లో బౌలర్లు ఎవరూ పాల్గొనకపోగా.. త్రోడౌన్స్ స్పెషలిస్టులతో రాయుడు, ధవన్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశారు. మరోవైపు బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ పర్యవేక్షణలో ధోనీ నెట్స్‌లో బ్యాటింగ్ చేశాడు. ఇదిలా ఉంటే భారత స్పీడ్‌స్టర్ జస్‌ప్రీత్ బుమ్రా ప్రదర్శనపై ఆసీస్ మాజీ పేసర్ డిర్క్ నానెస్ మీడియాతో మట్లాడాడు. 'అద్భుత నైపుణ్యముంటే పరిమిత ఓవర్ల ఫార్మాట్ నుంచి టెస్టులకు ఈజీగా మారిపోవచ్చు. అది బుమ్రా చేసి చూపాడు. అన్ని ఫార్మాట్లలో కీలక బౌలర్‌గా ఎదుగడానికి అతని ఫిట్‌నెస్ కారణమని చెప్పొచ్చు. జిమ్‌లో గంటల కొద్ది గడుపకపోయినా..సహజంగా ఉన్న ఫిట్‌నెస్ బుమ్రాకు అదనపు బలం. మెల్‌బోర్న్ టెస్ట్‌లో షాన్‌మార్ష్‌ను ఔట్ చేసిన తీరు అద్భుతం. టీ20 స్కిల్స్‌ను టెస్ట్ క్రికెట్‌లో ఉపయోగించడం అతని ప్రతిభకు నిదర్శనం. లెఫ్ట్‌ఆర్మ్ పేసర్ ఉంటే భారత టెస్ట్ జట్టు మరింత పటిష్ఠంగా కనిపిస్తుంది' అని నానెస్ అన్నాడు.


ధోనీ

'కోహ్లీసేన'పై పాక్ క్రికెటర్ల ప్రశంసలు

కరాచీ: ఆస్ట్రేలియా గడ్డపై చరిత్ర సృష్టించిన భారత క్రికెట్ జట్టుపై అభినందనల వర్షం కురుస్తున్నది. స్వదేశంలోని ప్రముఖులతో పాటు చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ నుంచి కూడా ప్రశంసలు వస్తున్నాయి. 71 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ విరాట్ కోహ్లీ కెప్టెన్సీలోని భారత్..ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపైనే మట్టికరిపించి ప్రతిష్ఠాత్మక బోర్డర్–గవాస్కర్ ట్రోఫీని సగర్వంగా ముద్దాడిన సంగతి తెలిసిందే. కంగారూలపై టెస్ట్ సిరీస్ గెలిచిన తొలి ఆసియా జట్టుగా టీమ్‌ఇండియా అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆ దేశ ప్రధానమంత్రి, మాజీ కెప్టెన్ ఇమ్రాన్‌ఖాన్‌తో పాటు దిగ్గజ క్రికెటర్లు వసీం అక్రమ్, మొయిన్ ఖాన్, మొహిసిన్ ఖాన్ తమదైన రీతిలో ప్రశంసలు కురిపించారు. 'ఆసీస్‌పై తొలిసారి టెస్ట్ సిరీస్ గెలిచిన తొలి ఆసియా జట్టుగా నిలిచిన భారత జట్టుతో పాటు కెప్టెన్ కోహ్లీకి ప్రత్యేక అభినందనలు' అని ఇమ్రాన్ ట్వీట్ చేశారు. మరోవైపు అక్రమ్ స్పందిస్తూ 'ఆసీస్ గడ్డపై భారత్‌కు చిరస్మరణీయ విజయమందించడంలో కెప్టెన్ కోహ్లీ ప్రశంసలకు అర్హుడు. అద్భుతమైన దేశవాళీ టోర్నీల వల్లే ఈ విజయం సాధ్యమైంది' అని అన్నాడు.

ఈ ఏడాది వృద్ధి 7.3 శాతం

ప్రపంచ బ్యాంక్ అంచనా



వాషింగ్టన్, జనవరి 9: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 7.3 శాతంగా ఉంటుందని ప్రపంచబ్యాంక్ అంచనావేస్తున్నది. ఆ తర్వాతి రెండు ఆర్థిక సంవత్సరాల్లో సరాసరిగా వృద్ధి 7.5 శాతంగా ఉంటుందని తెలిపింది. పెట్టుబడులు, వినియోగంతో పెరుగుదలే దీనికి కారణమని బ్యాంక్ విశ్లేషించింది. అంతేకాక వేగంగా అభివృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో భారత్ కొనసాగనున్నదని పేర్కొంది. ఇదే సమయంలో పొరుగు దేశమైన చైనా వృద్ధిరేటు 6.2 శాతంగా ఉంటుందని వరల్డ్ బ్యాంక్ అంచనావేస్తున్నది. 2021లో మాత్రం ఇంకా తగ్గి 6 శాతానికి పరిమితం కానున్నదని 2019 సంవత్సరానికిగాను అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. గతేడాది విషయానికి వస్తే చైనా 6.5 శాతం వృద్ధిని అంచనావేస్తున్న ప్రపంచ బ్యాంక్..ఇదే భారత్ 7.3 శాతంగా ఉండనున్నదని తెలిపింది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ కారణంగా భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదుడుకులకు లోనవడంతో 2017లో దేశ వృద్ధి 6.7 శాతానికి పరిమితం కాగా, ఇదే సమయంలో చైనా 6.9 శాతం నమోదు చేసుకున్నది. దేశీయ వృద్ధిలో గతేడాది భారత కంటే చైనా ముం దుందని, అయితే ఈ ఏడాది మాత్రం ఆ దేశ వృద్ధి మందగిస్తున్నది అంచనావేస్తున్నది. ప్రస్తుతానికి అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న భారత్..భవిష్యత్తుల్లోనే ఇదే జోరు కొనసాగనున్నదని వరల్డ్ బ్యాంక్ ప్రాస్‌పెక్ట్స్ గ్రూపు డైరెక్టర్ అయాన్ కోస్ తెలిపారు. వినియోగంలో పెరుగుదల, పెట్టుబడులు భారీగా పుంజుకోవడంతో ఈ ఏడాది వృద్ధి 7.5 శాతానికి ఎగబాకనున్నని చెప్పారు. దేశవ్యాప్తంగా డిమాండ్ ఊపందుకోవడం, నిర్మాణాత్మక సంస్కరణలకు పెద్దపీట వేయడంలోభాగంగా అమలులోకి తెచ్చిన జీఎస్టీ, బ్యాంకులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి భారీ స్థాయిలో నిధుల కేటాయించడం కూడా ఆర్థిక వృద్ధి మరింత పరుగులు పెట్టనున్నదని తెలిపింది. దీనికి తోడు ప్రైవేట్ వినిమయం పెరుగుతుండటం, పెట్టుబడులను ఆకట్టుకోవడానికి ఇటీవల ప్రవేశపెట్టిన పాలసీ నిర్ణయాలు పరోక్షంగా దోహదం చేశాయని, ముఖ్యంగా వచ్చే ఏడాది జీడీపీలో కరెంట్ ఖాతాలోటు(క్యాడ్) 2.6 శాతానికి పరిమితంకానున్నదని వెల్లడించింది. ద్రవ్యోల్బణ విషయానికి వస్తే 2 శాతం నుంచి 6 శాతం మధ్యలో ఉంటుందని రిజర్వు బ్యాంక్ అంచనాకు వరల్డ్ బ్యాంక్ జై కొట్టింది. ఇటీవల అమలులోకి వచ్చిన జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దుతో అనాధికార విభాగం నుంచి అధికార విభాగానికి బదిలీ అయ్యేవారు పెరిగారని తెలిపింది. భారత్ నికరంగా ఏడు శాతం వృద్ధిని సాధించనున్నదని, భవిష్యత్తులో కూడా ఇంతే స్థాయిలో కొనసాగనున్నదని విలేకరు అడిగిన ప్రశ్నకు కోస్ సమాధానమిచ్చారు. ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర సర్కార్ సంస్కరణలకు మొగ్గుచూపే అవకాశాలు లేవని ఆయన స్పష్టంచేశారు.

మూడో అతిపెద్ద వినిమయ మార్కెట్

ప్రపంచంలోనే మూడో అతిపెద్ద వినిమయ మార్కెట్‌గా భారత్ అవతరించనున్నదని వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) అంచనా వేసింది. అమెరికా, చైనా తర్వాత భారతీయ కన్జ్యూమర్ మార్కెటేనని బుధవారం ఓ నివేదికలో అభిప్రాయపడింది. 2030 నాటికి ప్రస్తుతమున్న 1.5 లక్షల కోట్ల డాలర్ల నుంచి దాదాపు 6 లక్షల కోట్ల డాలర్లకు కన్జ్యూమర్ మార్కెట్ పెరిగే వీలుందని చెప్పింది.

3వేలు దాటిన 'రెరా' దరఖాస్తులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిర్మాణ రంగ సంస్థల్లో పారదర్శకత నెలకొల్పడమే కాకుండా కొనుగోలుదారుల్ని పరిరక్షించడానికి ప్రారంభమైన 'రెరా' (రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) సత్ఫలితాల్ని ఇస్తున్నది. గతేడాది సెప్టెంబరు 1 నుంచి ఈ నెల 9 వరకు రెరా వద్ద దాదాపు మూడు వేల దరఖాస్తులు నమోదయ్యాయి. ఇందులో రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు దాదాపు 1,600. మరో 1,400 మంది రియల్ ఎస్టేట్ ఏజెంట్లు నమోదు చేసుకున్నారు. నవంబరు 30లోపు దాదాపు 2,850 దరఖాస్తులు నమోదయ్యాయి. ఆ తర్వాత అపరాధ రుసుము చెల్లించి దాదాపు 150 మంది ప్రమోటర్లు ప్రాజెక్టులను రిజిస్టర్ చేసుకున్నారు. ఇంకా 1,500దాకా ప్రాజెక్టులు నమోదు కావాల్సి ఉన్నదని రెరా మెంబర్ సెక్రెటరీ కొమ్ము విద్యాధర్ తెలిపారు. మరోవైపు 2017 జనవరి 1 తర్వాత తెలంగాణలో ప్రారంభమైన అపార్టుమెంట్లు, లేఅవుట్లు, ఇండిపెండెంట్ ఇండ్ల ప్రాజెక్టులు రెరాలో నమోదు చేసుకోవాలంటే.. రూ. 2 లక్షల జరిమానా చెల్లించాలి. ఈ అవకాశం ఈ నెల 15 వరకే ఉంటుంది. ఆ తర్వాతి భవితవ్యం ప్రభుత్వం నిర్ణయంపైనే.

మార్చి 2 నుంచి భారీ ప్రాపర్టీ షో

రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రాపర్టీ షోను మార్చి 2 నుంచి 4దాకా మూడు రోజులపాటు హైటెక్స్‌లో నిర్వహిస్తున్నామని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎస్ రాంరెడ్డి తెలిపారు. ఇందులో సుమారు 120 మంది డెవలపర్లు తమ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్నారని వెల్లడించారు. బుధవారం ఆయన క్రెడాయ్ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు అవసరమయ్యే ఇండ్ల వివరాలు క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షోలో లభిస్తాయన్నారు. హైదరాబాద్‌లో స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ఇంతకుమించిన సరైన సమయం లేదన్నారు. ప్రధాన కార్యదర్శి మన్‌భూమ్ రామకృష్ణారావు మాట్లాడుతూ.. ఈసారి మూడు రోజుల పాటు జరిగే ప్రాపర్టీషోలో కనీసం యాభై వేల మంది సందర్శకులు విచ్చేస్తారని అంచనా వేశారు.

రూ:5 లక్షలకు పెంచాలి

- ఐటీ మినహాయింపుపై సీఐఐ డిమాండ్



న్యూఢిల్లీ, జనవరి 9: వ్యక్తిగత ఆదాయం పన్ను (ఐటీ) మినహాయింపు పరిమితిని రూ.5 లక్షలకు పెంచాలని వ్యాపార, పారిశ్రామిక సంఘం సీఐఐ డిమాండ్ చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంట్‌లో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం రూ.2.50 లక్షలుగా ఉన్న ఐటీ మినహాయింపును రెట్టింపు చేయాలని కోరింది. ఈ మేరకు ముందస్తు బడ్జెట్ సిఫార్సుల్లో భాగంగా ఆర్థిక మంత్రిత్వ శాఖకు సీఐఐ సూచించింది. ప్రస్తుతం రూ.2.50 లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్నవారికి ఐటీ పన్ను నుంచి మినహాయింపు లభిస్తున్నది. రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షల మధ్య ఆదాయం ఉన్నవారికి 5 శాతం పన్ను, రూ.5 లక్షల నుంచి 10 లక్షల మధ్య ఆదాయం ఉన్నవారికి 20 శాతం, అపై ఆదాయం ఉన్నవారికి 30 శాతం పన్ను అమల్లో ఉన్నది. ఈ నేపథ్యంలో గరిష్ఠ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించాలంటున్న సీఐఐ.. దీన్ని రూ.20 లక్షలకుపైగా వార్షిక ఆదాయం ఉన్నవారికి వర్తింపజేయాలని కోరుతున్నది. రూ.10 లక్షల నుంచి 20 లక్షల మధ్య వార్షిక ఆదాయం ఉన్నవారి కోసం కొత్త శ్లాబును సృష్టించి వారికి 20 శాతం పన్ను వేయాలని సూచించింది. అంతేగాక రూ.5 లక్షల నుంచి 10 లక్షల మధ్య ఆదాయం గలవారికి 10 శాతం పన్నునే వేయాలన్నది. ఇకపోతే టర్నోవర్‌తో సంబంధం లేకుండా కార్పొరేట్ పన్ను రేటునూ 25 శాతానికి తగ్గించాలని సీఐఐ ఈ సందర్భంగా ఆర్థిక మంత్రిత్వ శాఖకు సూచించింది. దశలవారీగా దీన్ని 18 శాతానికి తీసుకురావాలని కోరింది. సెక్షన్ 80సీ కింద కోతల పరిమితిని రూ.1.50 లక్షల నుంచి రూ.2.50 లక్షలకు పెంచాలన్నది.

ఇండస్‌ఇండ్‌కు ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ దెబ్బ


- క్యూ3లో రూ.985 కోట్ల లాభంతో సరి

న్యూఢిల్లీ, జనవరి 9: ఇండస్‌ఇండ్ బ్యాంక్ లాభాలకు ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్ దెబ్బ పడింది. మౌలిక రంగానికి రుణాలు సమకూర్చే ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్‌కు ఇచ్చిన రుణాలు వసూలు కాకపోవడంతో బ్యాంక్ లాభాల్లో భారీ వృద్ధి పడిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభం కేవలం 5 శాతం పెరిగి రూ.985.03 కోట్లు మాత్రమే ఆర్జించింది. హిందుజా గ్రూపునకు చెందిన బ్యాంక్ గడిచిన కొన్ని త్రైమాసికాలుగా 20-25 శాతం వృద్ధిని నమోదు చేసుకుంటున్నది. పెద్ద నోట్లను రద్దు చేసిన సమయంలో కూడా రెండంకెల వృద్ధి నమోదు చేసుకున్నప్పటికీ ప్రస్తుత త్రైమాసికంలో నిరాశాజనక పనితీరు కనబరిచే అవకాశం ఉన్నదని బ్యాంక్ ఎండీ, సీఈవో రోమేష్ సోబ్టి తెలిపారు. మొత్తంమీద గత త్రైమాసికంలో మొండి బకాయిలను పూడ్చుకోవడానికి రూ.607 కోట్ల నిధులను కేటాయించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో కేటాయించిన రూ.237 కోట్లతో పోలిస్తే మూడు రెట్లు పెరిగాయి. తొలి త్రైమాసికంలో రూ.590 కోట్లు కేటాయించింది. ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్‌కు రూ.3 వేల కోట్లు రుణంగా అందించగా, అనుబంధ సంస్థలకు రూ.2 వేల కోట్లనిచ్చింది.

36వేల ఎగువన సెన్సెక్స్

అమెరికా-చైనాల మధ్య వాణిజ్య యుద్ధ వాతావరణానికి ఉపశమనం కలుగవచ్చునన్న అంచనాలు, గ్లోబల్ మార్కెట్లు లాభాల్లో ట్రేడ్ అవుతుండడంతో దేశీయ మార్కెట్లు కూడా లాభాల్లో ముగిశాయి. త్రైమాసిక ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్న అంచనాలతో ఇన్వెస్టర్లు తాజా కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. బీఎస్ఈ సెన్సెక్స్ 231.98 పాయింట్ల లాభంతో 36,212.91 వద్ద ముగిసింది. దాదాపు 467 పాయింట్ల హెచ్చుతగ్గులకు సెన్సెక్స్ లోనైంది. నిఫ్టీ 53 పాయింట్ల లాభంతో 10,855.15 వద్ద ముగిసింది. ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఫలితాలు మార్కెట్ అంచనాలకు అనుగుణంగా వెలువడడంతో ఆ షేరు ధర దాదాపు ఒకటిన్నర శాతం లాభంతో ముగిసింది. అలాగే ఇన్ఫోసిస్ బైబ్యాక్, స్పెషల్ డివిడెండ్ వార్తలు, గురువారం నాడు టీసీఎస్ ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో మార్కెట్‌లో ఆశావహ ధృక్పథంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఐటీ షేర్లకు తోడు ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంక్ షేర్లలో ర్యాలీ కూడా మార్కెట్ పెరుగుదలకు దోహదపడింది. ప్రపంచ బ్యాంకు.. ఇండియా జీడీపీ 7.3 శాతం వృద్ధి చెందనున్నట్టు అంచనాలు విడుదల చేయడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను పెంచింది. దేశీయ వినియోగంలోనూ పెరుగుదల నమోదు అవుతున్నట్టు వస్తున్న వార్తలు కూడా మార్కెట్‌ను ఉత్సాహపరిచాయి. దీంతో ఎఫ్ఎంసీజీ ఇండెక్స్ 1.01 శాతం మేర పెరిగింది. కాగా, బ్యాంక్ నిఫ్టీ 0.77శాతం, ఆటో 0.54 శాతం, ఫార్మా 0.47 శాతం , రియల్టీ 0.65 శాతం మేర లాభప డ్డాయి. మెటల్ ఇండెక్స్ 1.16 శాతం, ఇంధనం 0.32 శాతం నష్టాల పాలయ్యాయి. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ ఇండెక్స్‌లు స్వల్ప నష్టాలతో ముగిశాయి. మార్కెట్ ప్రధాన సూచీలు లాభాలతో ముగిసినా ట్రెడ్ మాత్రం నెగటివ్‌గా ఉంది. 1,059 షేర్లు ఎన్ఎస్ఈలో నష్టాలతో ముగిస్తే..717 షేర్లు మాత్రమే లాభాలతో ముగిశాయి. ఎఫ్ఐఐలు రూ. 276.14 కోట్ల కొనుగోళ్లు జరుపగా, డీఐఐలు రూ.439.67 కోట్ల కొనుగోళ్లు జరిపారు.

హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో మరో 26 పార్కింగ్‌లు



హైదరాబాద్, జనవరి 9: శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మరో 26 ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్ స్టాండ్స్‌ను అందుబాటులోకి తెచ్చింది జీఎమ్మార్ సంస్థ. తద్వారా శరవేగంగా కొనసాగుతున్న విస్తరణ పనుల్లో మరో మైలురాయిని అధిగమించింది. కొత్తవి అందుబాటులోకి రావడంతో మొత్తం పార్కింగ్ స్టాండ్ల సంఖ్య 83కు చేరింది. ఈ మేరకు బుధవారం జీఎమ్మార్ కమ్యూనికేషన్స్ అధికార వర్గాలు ఒక ప్రకటన విడుదల చేశాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కొత్త ఎయిర్‌క్రాఫ్ట్ స్టాండ్ల నిర్మాణంతో 45 శాతానికి పైగా హ్యాండ్లింగ్ సామర్థ్యం పెరుగుతున్నదన్నాయి. దాదాపు 65 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో 10 నెలల్లో ఈ స్టాండ్స్ నిర్మాణం పూర్తి చేశారు. 20 శాతం మేర పెరిగిన ప్రయాణీకులకు అనుగుణంగా విస్తరణ, స్టాండ్ల వినియోగం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని సీఈవో కిశోర్ తెలిపారు.

ఆర్థికలోటు పూడ్చేందుకు ప్రయత్నిద్దాం

- ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: విద్యుత్ సంస్థల్లో ఆర్థికలోటును పూడ్చేందుకు ఉద్యోగులు ప్రయత్నించాలని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు అన్నారు. దేశం మొత్తంమీద ట్రాన్స్‌మిషన్ లాస్ 3.5 శాతంగా ఉండగా.. తెలంగాణ కేవలం 2.8 శాతం ఉన్నదని చెప్పారు. బుధవారం మింట్ కాంపౌండ్‌లోని అంబేద్కర్ స్ఫూర్తిభవన్‌లో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రానున్నకాలంలో సాగునీటి ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తున్నందున విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. తెలంగాణ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగి ఉత్తమ ఉద్యోగిగా నిలువాలని ఆకాంక్షించారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యామ్‌మనోహర్, మేడి రమేశ్, టీఎస్‌ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు మదన్‌మోహన్‌రావు, పర్వతం, రాములు, స్వామిరెడ్డి, జెన్‌కో డైరెక్టర్ సీహెచ్ వెంకటరాజం, ట్రాన్స్‌కో డైరెక్టర్ టీ జగత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బుధవారం మింట్ కాంపౌండ్‌లోని అంబేద్కర్ స్ఫూర్తిభవన్‌లో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులసంక్షేమ సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్యామ్ మనోహర్, రమేశ్ మేడి తదితరులు.


బుధవారం తెలంగాణభవన్‌లో గౌడ ఐక్యసాధన సమితి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు, గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్

గౌడ ఐక్య సాధనసమితి క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : కూల్‌డ్రింక్స్ తరహాలో నీరాను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గీత కార్మికులకు చెట్టు పన్ను రద్దు చేసిన ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. తెలంగాణభవన్‌లో బుధవారం గౌడ ఐక్య సాధనసమితి క్యాలెండర్‌ను శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికుల పిల్లలు విదేశాల్లో చదువుకొనేందుకు ప్రభుత్వం రూ.20 లక్షలు ఇస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు, గ్రూప్ -1 అధికారులసంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, గౌడ ఐక్యసాధనసమితి రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ్, టీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కిశోర్‌గౌడ్, గౌడసంఘం నాయకులు బబ్బురి భిక్షపతిగౌడ్,రాజుగౌడ్, బింగి ఇందిరాగౌడ్ పాల్గొన్నారు.

'గగన్‌యాన్' కీలక మలుపు

- 2022 నాటికి భూకక్ష్యలోకి ముగ్గురు వ్యోమగాములు: మాధవన్ నాయర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మన అంతరిక్ష చరిత్రలోనే 'గగన్‌యాన్' కీలక మలుపు అని ఇస్రో మాజీ చైర్మన్ జీ మాధవన్ నాయర్ అభివర్ణించారు. ఇది భారత్‌లో ప్రప్రథమ మానవ అంతరిక్ష విమాన ప్రయోగమని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌కు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇస్రో ఈ ఘనత సాధిస్తే అంతర్జాతీయ సంస్థలు మన దేశంతో జతకట్టే అవకాశమున్నదని పేర్కొన్నారు. తాను చైర్మన్‌గా ఉన్నప్పుడు సిద్ధమైన ఈ ప్రాజెక్టును.. రూ.9,023 కోట్లతో ప్రారంభించేందుకు కేంద్ర క్యాబినెట్ గత డిసెంబరు 28న అనుమతినిచ్చిందని చెప్పారు. ముగ్గురు వ్యోమగాములను భూకక్ష్యలోకి పంపి క్షేమంగా తీసుకురావడమే ప్రాజెక్టు లక్ష్యమన్నారు. 2022 నాటికి ఇస్రో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తిచేస్తుందన్న ధీమాను వ్యక్తంచేశారు.


బుధవారం బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ బీఎస్ రాములు, సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందిస్తున్న మేరు సంఘం ప్రతినిధులు

బీసీ జాబితాలో 'మేరు'గా మార్చండి

- బీసీ కమిషన్‌కు మేరు సంఘం ప్రతినిధుల విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవహారికంగా తమను మేరోళ్లు, మేరు అని పిలిచే వారిని బీసీ జాబితాలో చిప్పోళ్లు, మేర అని పేర్కొన్నారని, దానిని సవరించి 'మేరు' పదాన్ని చేర్చాలని తెలంగాణ మేరు సంఘం ప్రతినిధి బృందం బీసీ కమిషన్‌కు విజ్ఞప్తి చేసింది. బుధవారం తెలంగాణ బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ బీఎస్ రాములును, కమిషన్ సభ్యులను మేరు సంఘం నాయకులు కలిశారు. ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్‌తోపాటు మేరు సంఘం రాష్ట్ర నాయకులు కోవూరి భాస్కర్‌రావు, పోడిశెట్టి నర్సింగరావుల ఆధ్వర్యంలో బీసీ కమిషన్‌ను కలిశారు. తమను ఎంబీసీ జాబితాలో చేర్చాలని, తమ కార్పొరేషన్ పేరును టైలర్ ఫెడరేషన్ నుంచి మేరు ఫెడరేషన్‌గా మార్చాలని ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రావి పాపన్న, మురళీధర్ తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
గురువారం 10 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



సంక్రాంతి వస్తున్నది. నోరూరించే పిండివంటలతో పాటు.. ఘాటు ఘాటు మాంసం వంటలు కూడా మీ కోసం సిద్ధంగా ఉన్నాయ్. ఆకాశం నిండా రంగురంగుల గాలిపటాలు, వాకిలి నిండా ముచ్చట గొలిపే ముగ్గులు, సిరినిచ్చే గొబ్బెమ్మలతో పాటు ఊరికి నోరూరించే వంటలు ఈ వారం మీకందిస్తున్నాం. కమ్మగా వండి వార్చండి మరి!

సంక్రాంతి వంటలొచ్చె తుమ్మెదా!

పాలమూరు మాంసం పలావ్



కావలిసిన పదార్థాలు :

మటన్ : 200గ్రా, **బాస్మతీ రైస్ :** 200గ్రా, **ఉప్పు:** తగినంత, **ఉల్లిపాయ :** పన్నెండు, **పచ్చిమిర్చి :** 4, **బిర్యానీ ఆకు :** 4, **అల్లంవెల్లుల్లి పేస్ట్ :** 1టీస్పూన్, **ధనియాలపాడి :** 1 టీస్పూన్, **పుదీన :** 1 కట్ట, **కొత్తిమీర :** 1కట్ట, **నూనె :** 1 టీస్పూన్, **నెయ్యి :** 1 టీస్పూన్, **కాజు :** 100 గ్రా, **పెరుగు :** 100 గ్రా

ఇలా చేయండి :

ఒక ప్యాన్‌లో నూనె పోసి మాంసం ఉడికించి పక్కన పెట్టుకోవాలి. మరో గిన్నెలో బియ్యం నానబెట్టాలి. ప్యాన్‌లో నూనె పోసి వేడి అయిన తర్వాత నెయ్యి వేయాలి. ఆ మిశ్రమంలో ఉల్లిపాయ, పచ్చిమిర్చి వేసి వేయించాలి. అవి దోరగా వేగిన తర్వాత అల్లంవెల్లుల్లి పేస్ట్, పసుపు, పెరుగు, ఉప్పు, పచ్చిమిర్చి కారం, ఉడికించిన మటన్ వేసి వేయించాలి. ఇప్పుడు తగినన్ని నీళ్లు పోసి ముందుగానే నానబెట్టుకున్న బియ్యం ఇందులో వేయాలి. సన్నటి మంట మీద ఇవన్నీ ఉడికించాలి. బియ్యం ఉడికిన తర్వాత మూత పెట్టి దమ్ ఇవ్వాలి. నోరూరించే పాలమూరు మాంసం పలావ్ రెడీ.

సోయాకూర బోటి ఫ్రై

సోయాకూర బోటి ఫ్రై

కావలసిన పదార్థాలు : **సోయాకూర :** 200 గ్రా, **బోటి :** 200 గ్రా, **ఉప్పు :** తగినంత, **కారం :** 1 టీస్పూన్, **పసుపు :** పావు టీస్పూన్, **అల్లంవెల్లుల్లి పేస్ట్ :** 1 టీస్పూన్, **ఉల్లిపాయ :** 1, **ధనియాల పొడి :** 1 టీస్పూన్, **కొత్తిమీర :** 1 కట్ట, **కరివేపాకు :** 1 రెమ్మ, **గరం మసాలా :** పావు టీస్పూన్



ఇలా చేయండి :

ఒక ప్యాన్‌లో బోటి వేసి అందులో ఉప్పు, పసుపు, అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసి బాగా ఉడికించాలి. ఆ తరవాత మరో పాన్‌లో నూనె పోసి ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, సోయాకూర వేసి వేయించాలి. ఇప్పుడు కరివేపాకు, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి మళ్లీ వేయించాలి. ఆ తర్వాత ఉడికించిన బోటి, కాస్తంత ఉప్పు, ధనియాలపొడి, కొత్తిమీర, గరంమసాలా, సోయాకూర వేసి బాగా కలుపాలి. కొద్దిసేపు వేగనివ్వాలి. దించేముందు కొత్తిమీర చల్లి సర్వ్ చేసుకుంటూ కమ్మగా ఉంటుంది సోయాకూర బోటీఫ్రై.

పొనగంటి కూర మాంసం పొలావ్



కావలసిన పదార్థాలు :

మటన్ : 200 గ్రా, **పొనగంటి కూర :** 200 గ్రా, **బియ్యం:** 200గ్రా, **పచ్చిమిర్చి :** 100 గ్రా, **కొత్తిమీర :** 1కట్ట, **ఉల్లిగడ్డ :** ఒకటి, **ఉప్పు :** తగినంత, **ధనియాల పొడి :** 1 టీస్పూన్, **నూనె :** 2 టీస్పూన్లు, **నెయ్యి :** 1 టీస్పూన్, **అల్లంవెల్లుల్లి పేస్ట్ :** 1 టీస్పూన్

ఇలా చేయండి :

ముందుగా మటన్‌ను బాగా ఉడికించాలి. ఒక గిన్నెలో బియ్యం నానబెట్టాలి. ఒక ప్యాన్‌లో నూనె పోసి అది వేడి అయిన తర్వాత నెయ్యి వేయాలి. అందులో పచ్చిమిర్చి, ఉల్లిపాయ, పొన్నగంటికూర, అల్లంవెల్లుల్లి పేస్ట్, ఉప్పు, కారం, ధనియాలపొడి వేయాలి. ఉడికించి పక్కన పెట్టుకున్న మటన్‌ను ఈ మిశ్రమంలో వేయాలి. సరిపడా నీళ్లు పోసి నానబెట్టిన బియ్యం అందులో వేయాలి. సన్నటి మంట మీద ఉడికించాలి. బియ్యం ఉడికిన తర్వాత దమ్ ఇవ్వాలి. నోరూరించే పొనగంటి మటన్ పలావ్ రెడీ.

తలకాయ కూర



కావలసిన పదార్థాలు

తలకాయ మాంసం : 200 గ్రా, **ఉల్లిపాయ :** 2, **పచ్చిమిర్చి:** 100 గ్రా, **కరివేపాకు :** 1 రెమ్మ, **కొత్తిమీర:** 1కట్ట, **ఉప్పు:** తగినంత, **కారం :** 2 టీస్పూన్లు, **ధనియాల పొడి:** 1 టీస్పూన్, **పసుపు:** పావు టీస్పూన్, **అల్లం వెల్లుల్లి పేస్ట్ :** 1టీస్పూన్, **గరం మసాలా :** 1 టీస్పూన్, **నూనె :** 2 టీస్పూన్లు

ఎలా చేయాలి ?

ముందుగా పాన్‌లో నూనె వేసి అందులో ఉల్లిపాయ, పచ్చిమిర్చి, కరివేపాకు వేయాలి. ఇవన్నీ వేగిన తర్వాత అల్లంవెల్లుల్లి పేస్ట్ వేయాలి. ఆ తర్వాత పసుపు, ఉప్పు, కారం, ధనియాలపొడితో పాటు తలకాయ మాంసం వేయాలి. మాంసానికి ఆ మిశ్రమాలన్నీ బాగా కలిసేలా కలియబెట్టి ఐదు నిమిషాలు వేగనివ్వాలి. ఐదు నిమిషాల తర్వాత సరిపడా నీళ్లు పోసి ఉడికించాలి. దింపేటప్పుడు కొత్తిమీర, గరంమసాలా పొడి కలుపాలి. వేడి వేడి అన్నంతో పాటు కలిపి తింటే భలే రుచిగా ఉంటుంది.



భార్యకు ప్రేమతో..!

ఈ సృష్టిలో ప్రేమకు ఎవ్వరూ సరైన నిర్వచనం ఇవ్వలేరు. ఎందుకంటే ప్రేమ అజరామరం. అదొక ఫీలింగ్. క్షణకాలంలో మొదలై.. జీవితాంతం వరకూ ఉంటుంది స్వచ్ఛమైన ప్రేమ. అందుకే కాబోలు.. తన భార్యను బతికించుకునేందుకు ఈ ప్రేమికుడు దేశమంతా తిరుగుతున్నాడు.


ప్రేమ ఎప్పుడు ఎలా పుడుతుందో ఎవ్వరికీ అంతుబట్టదు. కోల్‌కతాకు చెందిన 75 యేండ్ల స్వపన్ సేత్ మనసులో ఈ ప్రేమ ఎప్పుడు చిగురించిందో తెలియదు కానీ, భార్యంటే అమితమైన ప్రేమ. 'ధర్మేచా.. అర్థేచా.. కామేచా.. నాతి చరామి' అంటూ నాడు పెళ్లి సమయంలో పలికిన మాటలకు నేటికీ కట్టుబడే ఉన్నాడు స్వపన్ సేత్. క్యాన్సర్‌తో బాధపడుతున్న తన భార్యను బతికించుకోవడానికి ఈయన చేస్తున్న ప్రయత్నాలు తెలిస్తే.. మీ హృదయం తపించకమానదు. వృద్ధాప్యంలో కూడా తనకు ఇష్టమైన వయొలిన్ వాయిస్తూ.. భార్యను బతికించుకునేందుకు విరాళాలు సేకరిస్తున్నాడు స్వపన్ సేత్. ఇందుకు దేశమంతా తిరుగుతున్నాడు. ఆయన భార్య పూర్ణిమ 2002లో గర్భాశయ కేన్సర్ బారిన పడింది. అప్పటి నుంచి భార్యను ఎలాగైనా కాపాడుకోవాలని వయొలిన్ వాయిస్తూ.. డబ్బులు సేకరిస్తున్నాడు. భార్యను బతికించాలన్న ఆయన తపన చూస్తుంటే 'ప్రపంచమంతా ఒక్కటై ఎదురు నిలవనీ.. ఆకాశం విరిగిపడి మన్నూ మిన్నూ ఒక్కటవనీ.. కాలయముడే వచ్చి మరణమే ముంగిట నిలవనీ.. నీతోనేనుంటా.. నీకై నేనుంటా..'' అన్న మాటలు గుర్తొస్తున్నాయి.

కొబ్బరిపాలు ఎంతో మేలు!



- గోరువెచ్చని నీటిలో కొంచెం కొబ్బరిపాలు, రోజ్‌వాటర్ కలుపాలి. ఈ మిశ్రమాన్ని స్నానానికి వాడాలి. ఇలా చేయడం వల్ల పాడైన చర్మం కూడా తిరిగి తాజాదనాన్ని సంతరించుకుంటుంది.
- కొబ్బరిపాలను చర్మానికి రాసి ఐదు నిమిషాల పాటు మర్దన చేయాలి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మానికి తేమ అందడంతో పాటు మృదువుగా మారుతుంది.
- గులాబీ రేకులు, తేనె, కొబ్బరిపాలను గోరువెచ్చని నీటిలో కలుపుకొని స్నానం చేయాలి. దీనివల్ల శరీరానికి తగిన తేమ అంది మేని కాంతివంతంగా తయారవుతుంది.
- కొబ్బరిపాలల్లో కొంచెం నిమ్మరసం వేసి బాగా కలుపాలి. దూదితో ఈ మిశ్రమాన్ని ముఖానికి రాయాలి. ఆరిన తర్వాత కడిగేస్తే చర్మంపై ఉన్న మురికి తొలిగిపోయి చర్మం తాజాగా మారుతుంది.
- కొబ్బరిపాలు, బాదం పొడి, తులసి పొడి, తేనెలను బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. 20 నిమిషాల తర్వాత నీటితో కడుగాలి. తరచూ ఇలా చేస్తే చర్మం మృదువుగా మారుతుంది.

సిరిముగ్గు



15 చుక్కలు
1 వచ్చే వరకు



సి.హెచ్. మాధవి,
అల్వాల్,
సికింద్రాబాద్

ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:

సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9, కృష్ణాపురం,
బంజారాహిల్స్, రోడ్ నం - 10,
హైదరాబాద్ - 500034.
zindagi.nt@gmail.com

'ఫలితం ముందే తెలిస్తే జీవితంలో కిక్ అనేది వుండదు. అప్పుడప్పుడు తప్పులు దొర్లితేనే వాటిని సరిదిద్దుకుంటూ ముందుకు సాగుతాం. మనం బాగుండాలని కోరుకోవడం కంటే మన పక్క వాడు బాగుండాలని కోరుకోవాలి. అప్పడే అంతా బాగుంటుంది' అన్నారు హీరో వెంకటేష్. వరుణ్‌తేజ్‌తో కలిసి ఆయన నటించిన తాజా చిత్రం ''ఎఫ్2'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హీరో వెంకటేష్ బుధవారం హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి.

'రోజా' సినిమాతో నా కెరీర్ ఎక్కడికో వెళ్లిపోయేది!



వెంకటేష్

ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్ అంటున్నారు సినిమా ఎలా వుండబోతోంది?

• సినిమాలో పాత్రల మధ్య ఫ్రస్ట్రేషన్ కారణంగా కామెడీ పుడుతుంటుంది. మేము తీసుకున్న అంశమే పూర్తి స్థాయి వినోద భరితంగా సాగుతుంది. చాలా మంది జీవితాల్లో పెళ్లికి ముందు, పెళ్లి తరువాత ఎదురయ్యే సంఘటనల సమాహారంగా ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిది. ఇటీవల నేను నటించిన దృశ్యం, గురు చిత్రాలు నా పంథాకు భిన్నంగా సీరియస్‌గా సాగుతాయి. తరువాత చేయబోయే సినిమా వాటికి భిన్నంగా వుండాలనుకున్నాను. కథ వింటున్నప్పుడు ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, నువ్వునాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాల్లోని సన్నివేశాలు గుర్తొచ్చాయి. అందుకే వెంటనే అంగీకరించాను.

ఇమేజ్‌ని పట్టించుకుంటే ఇలాంటి చిత్రాల్లో నటించడం కష్టంగా వుంటుంది. మీకు అలా ఎప్పుడైనా అనిపించిందా?

• చాలా సందర్భాల్లో చాలా మంది నన్ను ఈ ప్రశ్న అడిగారు. ఇమేజ్ అనే పదమే నాకు అర్థం కాదు. అందుకే దాని గురించి సమాధానం చెప్పడానికి తర్జన భర్జన పడుతుంటాను. నేను చేస్తున్న పనిని తప్ప మరో విషయంపై ఎప్పుడూ శ్రద్ధపెట్టను. ప్రేక్షకులు నా పనిని అభినందిస్తున్నారు. అభిమానులు ఎంజాయ్ చేస్తున్నారు. అంత వరకే నా ఆలోచన వుంటుంది. నాకంటూ ఒక ఇమేజ్ వుండాలి అనే ఆలోచన నాకు ఎప్పుడూ లేదు. ఇమేజ్ అనేది ప్రేక్షకులు కల్పించేది. అది నా చేతుల్లో వుండదు. అందుకే దాని గురించి నేను పెద్దగా ఆలోచించను.

'గురు' తరువాత రెండేళ్లు విరామం తీసుకోవడానికి కారణం?

• 'గురు' తరువాత చాలా కథలు అనుకున్నాను. కానీ ఏదీ కుదరలేదు. ఓ స్థాయికి వచ్చాక ఏదీ మన చేతుల్లో వుండదు. అయితే 'గురు' తరువాత చేయబోయే సినిమా కొత్తగా వుండాలనుకున్నాను. రెగ్యులర్ కథలు చేయకూడదనుకున్నాను. యంగ్ హీరోలంతా ప్రస్తుతం కొత్త తరహా చిత్రాలు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో ఏదైనా కొత్తగా చేయాలనే విరామం తీసుకున్నాను.

దృశ్యం ,గురు చిత్రాల తరువాత పంథా మార్చారని అంతా అనుకున్నారు. కానీ మీరు మాత్రం మళ్లీ పాత పంథాలోనే 'ఎఫ్2'తో వస్తున్నారు?

• రెగ్యులర్ చిత్రాల్లోనే కొత్తగా ప్రయత్నించాలని చేసిన సినిమా ఇది. కథ పాతదే అయినా పాత్రల చిత్రణ, ఎంటర్‌టైన్‌మెంట్ రెగ్యులర్ చిత్రాలకు పూర్తి భిన్నంగా వుంటాయి. పైగా ఇదొక మల్టీస్టారర్ చిత్రం. పెళ్లికి ముందు, పెళ్లి తరువాత అనే కాన్సెప్ట్ నేపథ్యంలో ఇంత వరకు ఏ సినిమా రాలేదు. ఇలా ప్రతి విషయంలోనూ 'ఎఫ్2' కొత్తగా ఫ్రెష్‌గా అనిపిస్తుంది.

మల్టీస్టారర్ చిత్రాల్లో నటించడానికి కారణం?

• మల్టీస్టారర్స్ చేస్తే కొత్త వాళ్లతో కలిసి పని చేసే అవకాశం లభిస్తుంది. అంతే కాకుండా తెలియని ఎన్నో కొత్త విషయాలు తెలుసుకునే వెసులుబాటు కలుగుతుంది. ప్రస్తుత జనరేషన్ ఏం కోరుకుంటున్నారు? ఎలా పనిచేస్తున్నారు అనే విషయాల పట్ల పూర్తి స్పష్టత ఏర్పడుతుంది. అందుకే మల్టీస్టారర్ చిత్రాల్లో నటించడానికి ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నాను. 'ఎఫ్2' చేస్తున్న సమయంలో కొత్తగా అనిపించింది. ఈ సినిమా విషయంలో నేను ఎంత ఎగ్జైట్ అయ్యానో టీజర్ విడుదలైన తరువాత అంతా అలాగే ఫీలయ్యారు. టీజర్‌లో చూపించిన కొన్ని సన్నివేశాలు ముందు ప్లాన్ చేసి చేసినవి కాదు. ఇన్‌స్టంట్‌గా వచ్చాయి అంతే. నేల మీద బామ్మలతో కూర్చుని చెప్పే సంభాషణలు అందరిని ఆకట్టుకుంటున్నాయి.

నిర్మాణ దశలోనే సినిమా ఫలితం తెలిసిపోతుంటుందని ఆ మధ్య అన్నారు. ఈ సినిమా విషయంలో మీకు ఫలితం ముందే తెలిసిందా?

• గత ఐదేళ్ల కాలంలో కుటుంబ ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేయదగ్గ సినిమా ఏదీ సంక్రాంతికి విడుదల కాలేదు. ఆ లోటును తీర్చే సినిమా 'ఎఫ్2' అవుతుందని కచ్చితంగా చెప్పగలను. తప్పకుండా కుటుంబ ప్రేక్షకులు ఈ సినిమా కోసం థియేటర్‌కు వస్తారు.

మీ తరం నటులకు, నేటి తరం నటులకు మీరు గమనించిన తేడా?

• నటన పరంగా నేను ఎలాంటి వ్యత్యాసాన్ని గమనించలేదు. అయితే కొంత మందికి సహజంగా ఓ టాలెంట్ వుంటుంది. దాన్ని పూర్తి స్థాయిలో బయటికి తీయడానికి మంచి సందర్భం వస్తుంది. అలా వచ్చినప్పుడు వాళ్లేంటనేది అందరికి అర్థమవుతుంది. ఓపికతో ప్రయత్నిస్తే ఎవరికైనా ఎప్పటికైనా మంచి స్థాయి ఏర్పడుతుంది. అలాంటి సమయం కోసం ఓపికతో ఎదురుచూడటం అనేది మన చేతుల్లో వుంది. చేసే పనిని ఆస్వాదిస్తూ ముందడుగు వేస్తే ఏదో ఒక రోజు అనుకున్న లక్ష్యానికి చేరుకుంటాం.

సినిమాలో ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఏదైనా సందేశం వుంటుందా?

• మగవాళ్లు ఆడవాళ్ల విషయంలో ఎంత బెట్టుని ప్రదర్శించినా చివరికి మాత్రం ఆడవాళ్లను గౌరవించాల్సిందే అని ఈ చిత్రం ద్వారా మంచి సందేశాన్ని అందిస్తున్నాం. ఈ విషయాన్ని ప్రతీ ఒక్కరూ అంగీకరిస్తారు. అందరూ తప్పులు చేస్తారు. వాటిని సరిదిద్దుకునే అవకాశం ప్రతి ఒక్కరికీ ఇవ్వాలన్నదే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. మన దైనందిన జీవితంలో మహిళలకున్న ప్రాధాన్యత గురించి చక్కగా వివరించే ప్రయత్నం చేశాం.

మీ సుదీర్ఘ ప్రయాణంలో ఇలాంటి పాత్ర చేయలేకపోయానే అని ఎప్పడైనా అనిపించిందా?


• అమీర్‌ఖాన్ తరహాలో ఎందుకు చేయలేకపోతున్నానని, బాహుబలి లాంటి సినిమా మనకెందుకు రాలేదని నాకే కాదు అందరికి వుంటుంది. అలా అని అలాంటి పాత్రలు అందరికి రావు. చూసి వదిలేయాలి అంతే. వాటి గురించి ఎక్కువగా ఆలోచించకూడదు. అప్పట్లో 'రోజా'లో నటించే అవకాశం నాకే వచ్చింది. అది చేసుంటే నా కెరీర్ ఎక్కడికో వెళ్లిపోయేది. దురదృష్ట వశాత్తు నాకు ప్రమాదం జరగడం వల్ల ఆ సినిమాలో నటించలేక పోయాను.

మీ తదుపరి చిత్రం 'వెంకీ మామ' ఎలా వుంటుంది?

• పూర్తి స్థాయి వినోదాత్మకంగా సాగే చిత్రమిది. బంధాలు, అనుబంధాల గురించి తెలియజేస్తుంది.

త్రివిక్రమ్ సినిమా ఎప్పుడు మొదలవుతుంది?

• త్రివిక్రమ్‌తో కలిసి సినిమా చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాం. అది త్వరలోనే సెట్స్‌పైకి వస్తుంది.



రాఘవ లారెన్స్

కాంచన ప్రతీకారం

రాఘవ లారెన్స్ కథానాయకుడిగా నటించిన 'కాంచన' సిరీస్ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించాయి. తాజాగా ఈ సిరీస్‌లో 'కాంచన-3' రానున్నది. రాఘవ లారెన్స్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రాఘవ నిర్మాణంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి బి. మధు సమర్పకుడు. ఓవియా, వేదిక కథానాయికలు. చిత్రీకరణ పూర్తయింది. మంగళవారం హైదరాబాద్‌లో చిత్ర బృందం మోషన్ పోస్టర్‌ను విడుదలచేశారు. ఈ పోస్టర్‌లో పంచెకట్టుతో మెడలో రుద్రాక్షలు ధరించి వైట్ హెయిర్‌స్టైల్‌తో రాఘవ లారెన్స్ వినూత్న లుక్‌లో కనిపిస్తున్నారు. చిత్ర సమర్పకుడు బి. మధు మాట్లాడుతూ 'ప్రతీకార నేపథ్యంతో తెరకెక్కుతున్న హారర్ కామెడీ సినిమా ఇది. ఊహకందని మలుపులతో ఉత్కంఠభరితంగా ఉంటుంది. వైవిధ్యమైన కథాంశంతో రాఘవ లారెన్స్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఆయన పాత్ర సరికొత్తగా ఉంటుంది. డాల్బీ అట్మాస్ సౌండ్‌తో విడుదల చేసిన మోషన్ పోస్టర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 18న విడుదల చేస్తాం' అని తెలిపారు. కోవై సరళ, కబీర్ దుహాన్ సింగ్, దేవదర్శిని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సర్వేష్ మురారి, వెట్రి.

ట్వీట్

మనోజ్ కుమార్ మంచు
@HeroManoj1



అమ్మాయి బంగారు భవిష్యత్తు కోసం, రేపటి మంచి సమాజం కోసం.. జనవరి 20న సేవాభారతి సంస్థ తరపున రన్ ఫర్‌గర్ల్‌చైల్డ్ పేరుతో గచ్చిబౌలి స్టేడియంలో వాక్ నిర్వహిస్తున్నాం. నేను పాల్గొంటున్నాను. మరి మీరు?

మనోజ్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య 1,363,801

కామన్‌మ్యాన్ వాయిస్

తెలంగాణ కాంగ్రెస్ టీడీపీ మట్టిగొట్టుకుపోవడానికి కారణం ఎలాంటిదో.. ఆ మహానుభావుడిని అప్రతిష్ఠపాలు చేసే పన్నాగమే ఇలాంటిదా అనిపిస్తోంది.
-ఈశ్వరం

తండ్రికి వెన్నుపోటు పొడిచిన ముఠా సభ్యుడైన బాలకృష్ణ కాకుండా ఇంకో నటుడు ఎన్టీఆర్ పాత్ర పోషిస్తే అంతా చూసేవారు.
-BT Govinda

జీవించి ఉన్నప్పుడు లేనిది.. జీవిత చరిత్రను టికెట్లు పెట్టి అమ్ముకోవడానికి మాత్రం..
-New-win Samala

వైరల్ వీడియో



హైకమాండ్ తీసుకున్న నిర్ణయాలను ధిక్కరించి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి.. ఆ తర్వాత ఏం చేశాడు. పాదయాత్ర ఎందుకు చేశాడు? అప్పుడు ఎదురైన కష్టాలు ఇలా అన్ని విషయాలను చూపిస్తూ రూపొందించిన చిత్రం యాత్ర. ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ యూట్యూబ్‌లో హల్‌చల్ చేస్తున్నది.

Yatra Movie Trailer (Telugu) | Mammootty | YSR Biopic | Mahi V Raghav | 70MM Entertainments

Total views : 1,910,769+
Published on Jan 7, 2019

సుడోకు

డైలీ సుడోకు 32 సమాధానం

6	4	1	7	9	2	8	3	5
2	7	5	3	1	8	9	4	6
8	9	3	4	5	6	1	2	7
7	1	8	5	2	4	3	6	9
5	2	6	8	3	9	7	1	4
9	3	4	6	7	1	2	5	8
3	5	9	1	4	7	6	8	2
4	6	2	9	8	3	5	7	1
1	8	7	2	6	5	4	9	3

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -33

		9						2
		2	6	9	3		4	
		6			7	8	9	
	5		3			2		
	8					6		
								4
	7					5	8	
3		5		1	2			
			9					3

నిన్ను తలచి..



స్టెఫీ పటేల్, వంశీ

అనిల్ తోట దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'నిన్ను తలచి'. వంశీ, స్టెఫీ పటేల్ జంటగా నటిస్తున్నారు. నేదురుమల్లి అజిత్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ 'యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్ ఇది. తొలి ప్రేమ జ్ఞాపకాలకు అందమైన దృశ్యరూపంగా ఉంటుంది. ప్రేమలోని కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తూ దర్శకుడు అనిల్ ఈ సినిమాను రూపొందిస్తున్నారు' అని చెప్పారు. 'కష్టపడి, ఇష్టపడి మేము చేసిన సినిమా ఇది. టైటిల్ ఆకట్టుకుంటున్నది. నిర్మాణానంతర కార్యక్రమాల్ని పూర్తిచేసి ఫిబ్రవరిలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని దర్శకుడు అన్నారు. నటనకు ఆస్కారమున్న పాత్రల్ని పోషిస్తున్నామని నాయకానాయికలు పేర్కొన్నారు.

చిరంజీవి టైటిల్‌తో..



అవంతిక, ప్రశాంత్

ప్రశాంత్, అవంతిక జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రాణంఖరీదు'. పి.ఎల్.కె. రెడ్డి దర్శకుడు. నల్లమోపు సుబ్బారెడ్డి నిర్మిస్తున్నారు. నందమూరి తారకరత్న కీలక పాత్రను పోషిస్తున్నారు. సెన్సార్ పూర్తయింది. 'యు.ఏ' సర్టిఫికెట్ లభించింది. దర్శకుడు మాట్లాడుతూ 'క్రిమినల్‌కు, పోలీస్ ఆఫీసర్‌కు మధ్య జరిగే పోరాటమే ఈ చిత్ర ఇతివృత్తం' అని తెలిపారు. హీరో మాట్లాడుతూ 'చిరంజీవి నటించిన తొలి సినిమా 'ప్రాణం ఖరీదు' లాంటి పవర్‌ఫుల్ టైటిల్‌తో హీరోగా పరిచయం కానుండటం ఆనందంగా ఉంది. తర్వాత ఏం జరుగుతుందోననే ఉత్కంఠను ప్రతి క్షణం పంచుతుంది. త్వరలో సినిమాను విడుదల చేస్తాం' అన్నారు.



తనిష్క తివారి

బైలంపుడి యుద్ధం

హరీష్ వినయ్, తనిష్క తివారి జంటగా నటిస్తున్న చిత్రం 'బైలంపూడి'. అనిల్.పి.జి.రాజ్ దర్శకుడు. బ్రహ్మానందరెడ్డి నిర్మాత. ఈ చిత్రంలోని 'పిల్లల దేవుడు' అనే లిరికల్ గీతాన్ని బుధవారం హైదరాబాద్‌లో బాలీవుడ్ నటి మైరా అమిథి విడుదల చేసింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్య కథాంశంతో రూపొందిస్తున్న చిత్రమిది. బతకడం కోసం చేసిన యుద్ధంలో గెలుపు ఎవరిని వరించిందన్నది ఆకట్టుకుంటుంది. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాల్ని జరుపుతున్నాం' అని తెలిపారు. 'బైలంపూడి అనే ఊరి కథ ఇది. ప్రేమ, రాజకీయ అంశాల సమ్మిళితంగా సాగుతుంది. వాస్తవికతను ప్రాధాన్యతనిస్తూ రూపొందించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది' అని దర్శకుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్, హరీష్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

భరతనాట్యం నేపథ్యంలో..




శ్రీ,అవంతిక

శ్రీ మంగం, శశాంక్, అవంతిక హరి నల్వా, గాయత్రి అయ్యర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ప్రణవం'. తను ఎస్ నిర్మిస్తున్నారు. కుమార్.జి దర్శకుడు. చిత్రీకరణ పూర్తయింది దర్శకుడు మాట్లాడుతూ 'భరతనాట్యం ఇతివృత్తంతో సంగీత ప్రధానంగా తెరకెక్కిస్తున్న చిత్రమిది. ప్రేమ, సస్పెన్స్ అంశాల సమాహారంగా సాగుతుంది. శ్రీ పాత్ర నవ్యరీతిలో ఉంటుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని జరుపుతున్నాం. ఆర్.పి. పట్నాయక్, ఉష ఆలపించిన పాట సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. త్వరలో చిత్ర గీతాలను విడుదల చేస్తున్నాం. అన్ని వర్గాల వారిని ఈ సినిమా అలరిస్తుంది' అని తెలిపారు. జెమిని సురేష్, నవీన్, బాబి, దొరబాబు, సమీర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మార్గల్ డేవిడ్, సంగీతం: పద్మనాభ్ భరద్వాజ్.

నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం —

క్లాట్-2019



దేశవ్యాప్తంగా ఉన్న నేషనల్ లా యూనివర్సిటీల్లో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్)-2019 నోటిఫికేషన్ విడుదలైంది.

- **పరీక్ష పేరు:** కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్)
- **విద్యాసంవత్సరం:** 2019-20
- **కోర్సులు:** డిగ్రీ, పీజీ
- **ప్రవేశాలు కల్పించే ఎన్ఎల్‌యూలు:** బెంగళూరు, హైదరాబాద్ (నల్సార్), భోపాల్, కోల్‌కతా, జోధ్‌పూర్, రాయ్‌పూర్, గాంధీనగర్, లక్నో, పంజాబ్, పాట్నా, కోచి, ఒడిశా, రాంచీ, అసోం, విశాఖపట్నం, తిరుచిరాపల్లి, ముంబై, నాగ్‌పూర్, ఔరంగాబాద్.
- మొత్తం 19 ఎన్ఎల్‌యూలు ప్రవేశాలు కల్పిస్తాయి. క్లాట్ స్కోర్‌తో ఇటీవల కాలంలో కొన్ని సంస్థలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి.
- **అర్హతలు:** డిగ్రీ కోర్సులకు- కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్ లేదా 10+2 లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అయితే 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత. మార్చిలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- పీజీ కోర్సులకు-కనీసం 55 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ/ఐదేండ్ల ఎల్ఎల్‌బీ (ఆనర్స్) లేదా తత్సమానకోర్సు ఉత్తీర్ణత. ఏప్రిల్/మేలో చివరి సంవత్సరం పరీక్షలు రాస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయస్సు:** యూజీ, పీజీ కోర్సులకు ఎటువంటి గరిష్ఠ వయోపరిమితి లేదు.
- **ఎంపిక:** క్లాట్
- **పరీక్ష విధానం:** ఇంగ్లిష్, లీగల్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, జీకే, కరెంట్ అఫైర్స్, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్, న్యూమరికల్ ఎబిలిటీపై ప్రశ్నలు ఇస్తారు.
- ఆఫ్‌లైన్ రాతపరీక్ష
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో జనవరి 10 నుంచి ప్రారంభం
- **చివరితేదీ:** మార్చి 31
- **క్లాట్ పరీక్ష తేదీ:** మే 12
- **వెబ్‌సైట్:** http://www.clat.ac.in

బెల్‌లో ఇంజినీర్లు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) ఇంజినీర్లు, మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.



- **పోస్టు:** సీనియర్ ఇంజినీర్
- ఖాళీలు-12
- **పేస్కేల్:** రూ.50,000-3%-1,60,000
- **పోస్టు:** డిప్యూటీ మేనేజర్
- ఖాళీలు-2
- **పేస్కేల్:** రూ.60,000-3%-1,80,000
- **వివరాల కోసం వెబ్‌సైట్:** www.bel-india.in

ఎయిమ్స్‌లో

జోధ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **పోస్టులు-ఖాళీలు:**
- బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ఆఫీసర్-1, సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఆయుష్-1, మెడికల్ ఆఫీసర్ ఆయుష్-5, చైల్డ్ సైకాలజిస్ట్-1, సీనియర్ డైటీషియన్ (అసిస్టెంట్ ఫుడ్ మేనేజర్)-1 ఖాళీ ఉన్నాయి.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** 30 రోజుల్లో పంపాలి.
- **వెబ్‌సైట్:** www.aiimsjodhpur.edu.in

నాన్ టీచింగ్ స్టాఫ్

రోపర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.



- అసిస్టెంట్ రిజిస్ట్రార్-2, జూనియర్ సూపరింటెండెంట్-4, సీనియర్ అసిస్టెంట్-1, జూనియర్ అసిస్టెంట్-8, జూనియర్ అకౌంటెంట్స్ ఆఫీసర్-2, జూనియర్ అసిస్టెంట్ అకౌంట్స్-5, లైబ్రేరియన్-1, లైబ్రేరీ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్-1, మెడికల్ ఆఫీసర్-1, స్టాఫ్ నర్స్-2, జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్-2, సీనియర్ ల్యాబ్ అసిస్టెంట్-3, జూనియర్ ల్యాబ్ అసిస్టెంట్-15 ఖాళీలు ఉన్నాయి.
- అర్హతలు, వయస్సు ఆయా పోస్టులకు వేర్వేరుగా ఉన్నాయి. వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **నోట్:** ఈ పోస్టులకు దేశంలోని ఏ ప్రాంతం వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 11
- **వెబ్‌సైట్:** www.iitrpr.ac.in

టాటా మెమోరియల్‌లో

వారణాసిలోని టాటా మెమోరియల్ సెంటర్ (టీఎంసీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.



- అసిస్టెంట్ ప్రొఫెసర్
- విభాగాలు: సర్జికల్ ఆంకాలజీ, అనెస్థీషియాలజీ, హెమటోపాథాలజీ, మెడికల్ ఆంకాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, ప్రివెంటివ్ మెడిసిన్, బోన్ అండ్ సాఫ్ట్ టిష్యూ, పాథాలజీ, మైక్రోబయాలజీ, పీడియాట్రిక్ ఆంకాలజీ, రేడియోడయాగ్నసిస్, జనరల్ మెడిసిన్, పల్లేటివ్ మెడిసిన్.
- మెడికల్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ సూపరింటెండెంట్
- అర్హతలు, వయస్సు, ఎంపిక వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 25
- హార్డ్‌కాపీలను పంపడానికి **చివరితేదీ:** ఫిబ్రవరి 1
- **వెబ్‌సైట్:** http://tmc.gov.in

మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

విశాఖపట్నంలోని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)లో మేనేజ్‌మెంట్ ట్రెయినీ, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **పోస్టు:** మేనేజ్‌మెంట్ ట్రెయినీ-టెక్నికల్
- ఖాళీల సంఖ్య-77
- **విభాగాల వారీగా ఖాళీలు:** ఎలక్ట్రికల్-20, మెకానికల్-31, మెటలర్జీ-26.
- **అర్హత:** ఫుల్‌టైం బీఈ/బీటెక్‌లో సంబంధిత బ్రాంచీలో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్సీ/ఎస్టీలు అయితే 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **నోట్:** ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఆగస్టు నాటికి ప్రొవిజినల్ సర్టిఫికెట్‌ను దాఖలు చేయాలి.
- **వయస్సు:** 2018, డిసెంబర్ 1 నాటికి 27 ఏండ్లు మించరాదు.
- **పేస్కేల్:** రూ.24,900-50,500/-
- **ఎంపిక:** గేట్-2019 స్కోర్ ద్వారా
- **పోస్టు:** అసిస్టెంట్ మేనేజర్ (సీఎస్ఆర్)
- **పోస్టు:** కంపెనీ సెక్రటరీ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 20
- **వెబ్‌సైట్:** http://www.vizagsteel.com

9.

నమస్తే తెలంగాణ

రైతుబడి

[హైదరాబాద్]

గురువారం 10 జనవరి 2019

raithubadi@ntnews.com

వరిలో తెగుళ్ల నివారణ

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు గతంలో కంటే భిన్నంగా ఉన్నాయి. రాత్రివేళ కనిష్ఠ, పగటి పూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ ప్రభావం వరిపంటపై ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల వరి నారులో చీడపీడలు, తెగుళ్లు ఆశిస్తున్నాయి. సకాలంలో వీటిని గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. లేకపోతే పంట నష్టం జరిగే ప్రమాదం ఉందని ఖమ్మం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

ఉల్లికోడు(గొట్టపు రోగం)

నారుమడిలో, పిలక దశలో అంకురం ఉల్లికాడవలే లేత ఆకుపచ్చని పొడగాటి గొట్టంగా మార్పు చెందుతుంది. తల్లిపురుగు తెల్లని లేదా ఎరుపు, గులాబీ రంగులో ఉన్న గుడ్లను పెడుతుంది. విడివిడిగా కానీ ఆకుల అడుగు భాగాన కాని గుడ్లను పెడుతుంది. గుడ్ల నుంచి పొదిగి వచ్చిన లార్వా ఎదిగే మొగ్గను ఆశించి నష్టపరుస్తుంది. తల్లి రెక్కలు పురుగు గోధుమ రంగులో దోమ ఆకారంలో ఉంటుంది.

ఉధృతికి కారణాలు

ఉల్లికోడు తట్టుకోని రకాలు సాగు చేయడం, ఆలస్యంగా నాట్లు వేయడం, గాలిలో అధిక తేమశాతం(82-88శాతం) కలిగి ఉండటం ఈ పురుగు ఉధృతికి కారణం. పిలకదశలో 5 శాతం ఉల్లి గొట్టాలు, దుబ్బకు 1ఉల్లికోడు ఉన్నట్టు గమనిస్తే తక్షణం సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.



నివారణ పద్ధతులు

నారు మొలకెత్తిన 10-15 రోజుల్లోపు 2 గుంటలకు (200 చ.మీ) 200 గ్రాములు కార్బోఫ్యూరాన్ గుళికలు ఎకరానికి 10 కిలోలు వేసుకోవాలి. లేదా ఫోరేట్ గుళికలు 5 కిలోలు వేసుకోవాలి.

అగ్గితెగులు

అగ్గితెగులు పైరీక్యులేరియా గ్రిజియా అనే శిలీంధ్రం ద్వారా ఆశిస్తుంది. తెగు లు లక్షణాలు వివిధ దశల్లో కనిపిస్తాయి. నారుమడిలో నాటు వేసిన తరువాత, పైరు తొలిదశలో ఆకులపైన, మచ్చలు ఏర్పడుతాయి. క్రమేణా ఇవి పెద్దవిగా మారి మచ్చల చివర్లు మొన దేలుతాయి. ఈ మచ్చల అంచులు ముదురు గోధుమ రంగు లేదా నలుపు రంగులోకి వస్తాయి. మచ్చల మధ్యభాగం బూడిద, తెలుపు రంగులోకి మారుతాయి. అనుకూల వాతావరణ పరిస్థితుల్లో మచ్చలు ఒకదానితో ఒకటి కలిసిపోయి ఆకులు ఎండిపోతాయి. తెగులు సోకిన ఆకులు దూరం నుంచి చూస్తే తగులబడిపోయినట్లుగా కనిపిస్తుంది. అందుకే ఈ తెగులును అగ్గితెగులు అంటారు. పిలక దశలో ఉన్న మచ్చలు క్రమేపీ మొక్కలకు సోకడం వల్ల ఆ భాగం ముదురు గోధుమ రంగు లేదా నల్లగా మారి చివరికి కుళ్లిపోతాయి. ఈనిక దశలో మెడపైన నల్లని మచ్చలు ఏర్పడటం వల్ల కంకులకు పోషకాలు అందకుండాపోతాయి. దీంతో గింజలు తాలుగా మారిపోయే అవకాశం ఉన్నది.

ఉధృతికి కారణాలు

నత్రజని అధిక మోతాదులో వాడటం, రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల కంటే తక్కువ ఉండటం, పగటి ఉష్ణోగ్రతలు 25 డిగ్రీలపైన ఉన్నప్పుడు ఉధృతి పెరిగే అవకాశం ఉన్నది. అదేవిధంగా గాలిలో తేమశాతం 90 శాతం కంటే ఎక్కువ, మబ్బులు, జల్లులతో కూడిన వాతావరణం, పొగమంచు ఉండటం కూడా కారణం. పొలం గట్లపై ఉన్న గడ్డిజాతి మొక్కలు ఉండటం కూడా అగ్గితెగులు వ్యాప్తికి కారణం.

యాజమాన్య పద్ధతులు

ఈ తెగులు తరుచూ ఆశించే ప్రాంతాల్లో తెగులు తట్టుకునే రకాలను మాత్రమే సాగు చేసుకోవాలి. అదేవిధంగా నారుమడి పోసే ముందు విత్తనశుద్ధి చేసుకోవాలి. పంటపై తెగులు లక్షణాలు గమనించిన వెంటనే ట్రైసైక్లోజోల్ 0.6గ్రా, ఐసోప్రోథయోలేన్ 1.5 మి.లీ లేదా కాసుగమైసిన్ 2.5 మి.లీ. లీటర్ నీటికి కలుపుకుని తెగులు ఉధృతిని బట్టి 10- 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి.

-మద్దెల లక్ష్మణ్, 9010723131
ఖమ్మం వ్యవసాయం



బ్రకోలి పంట

తక్కువ సమయం ఎక్కువ ఆదాయం

కాలీఫ్లవర్ జాతికి చెందిన పంట బ్రకోలి. ఇది ఇతర దేశాల్లో ఏడాది పొడవునా సాగవుతుంది. మన ప్రాంతంలో మాత్రం చలికాలంలోనే సాగుకు అనుకూలం. దేశీయంగా అధిక ఉష్ణోగ్రత వల్ల ఈ పంట సాగేలె కొంత ప్రతికూల వాతావరణం ఉన్నది. అయినప్పటికీ పలు కొత్తరకాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం నగరాల్లో, పట్టణాల్లో బ్రకోలికి అధిక డిమాండు ఉన్నది.

బ్రకోలి చూడటానికి కాలీఫ్లవర్ లాగే ఉంటుంది. ఆకుపచ్చ రంగులో ఉండే పువ్వు బ్రకోలి. దీనిలో ఎన్నో పోషక విలువలు ఉన్నాయి. కాల్షియం, ఫోలేట్, బీటాకెరోటిన్, విటమిన్ సీ అధికంగా ఉంటాయి. ఈ కూరగాయను సలాడ్, సూప్స్ గానే కాకుండా కూరగా కూడా చేసుకోవచ్చు. ప్రపంచంలో ఆరోగ్యకరమైన కూరగాయల్లో ఒకటిగా ఇది పేరు గాంచింది. ఇది మన దేశంలో తక్కువ విస్తీర్ణంలోనే ఈ పంట సాగులో ఉన్నది. ఇటీవలీ కాలంలో కొద్దిపాటి వేడిని తట్టుకునే రకాలు వచ్చాయి. బ్రకోలి అనేది మార్కెటింగ్‌కు అవకాశం ఉన్న ప్రదేశాల్లోనే సాగు చేసుకోవాలి. కేవలం చలికాలంలో మాత్రమే ఈ పంటు సాగు చేసుకోవాలి. వేరే కాలాల్లో బ్రకోలిలో పెరుగుదల ఉండదు.

రాష్ట్రంలో సాగుకు అనువైన రకాలు

రకాలు	పంట కాలం(రోజుల్లో) విత్తిన తర్వాత	దిగుబడి (టన్నులు/హెక్టారుకు)	లక్షణాలు
పూసా బ్రకోలి కె.టి.ఎస్-1	120-140 రోజులు	16.5 టన్నులు/హెక్టారుకు	కాండం పరిమాణం మధ్యస్థంగా ఉంటుంది. ఆకులు ముదురు రంగుగా ఉంటాయి. పువ్వు ఏర్పడే సమయంలో నేల పైభాగాలలో ఉన్నట్టు కనిపిస్తాయి. ఈ రకం చలిని తట్టుకోగలదు.
పంజాబ్ బ్రకోలి	90-120 రోజులు	175 క్వింటాళ్లు /హెక్టారుకు	ఈ రకం సలాడ్, వంటకు కూడా బాగా ఉపయోగపడుతుంది.

ఉష్ణోగ్రత

బ్రకోలి 18-20 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతాల్లో బాగా పెరుగుతుంది. 30 డిగ్రీల సెల్సియస్ వరకు కూడా తట్టుకుంటుంది. రాష్ట్రంలో సాగు చేసేటప్పుడు అక్టోబర్ నుంచి నవంబర్‌లోపు విత్తనం పూర్తి చేసి ఉండాలి. పూత పెరిగే దశలో ఉష్ణోగ్రత ఎక్కువ ఉంటే నాణ్యమైన, పెద్దగా ఉన్న పువ్వులను పొందే అవకాశం ఉంటుంది. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటే పూల కాండాల మధ్య ఖాళీలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. నాణ్యత కూడా తగ్గిపోతుంది. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతను తట్టుకునే విధంగా రకాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

నేలలు

ఆమ్ల, చౌడు, క్షార భూములు ఈ పంట సాగుకు పనికిరావు. ఈ నేలల్లో తప్ప మిగతా అన్నిరకాల నేలల్లో సాగు చేసుకోవచ్చు. ఇసుకతో కూడిన బంక నేలలు, యాసంగిలో ముందుగా వేసే పంటకు అనుకూలం. సారవంతమైన గుల్ల, ఒండ్రు నేలలు అధిక దిగుబడిని ఇస్తాయి. ఉదజని సూచిక 5.5 నుంచి 6.5 గల నేలలు ఎక్కువ అనుకూలం.

విత్తనశుద్ధి

విత్తనాన్ని 50 డిగ్రీల ఉష్ణోగ్రత గల వేడి నీటిలో నానబెట్టుకోవాలి. కిలో విత్తనానికి 5 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్, 3 గ్రాముల కాప్టాన్ కేజీ విత్తనానికి పట్టించి ఎండబెట్టాలి. తర్వాత నారుమడిలో విత్తుకోవాలి. దీని ఒక నెల పాటు పాటు ఆశించవు.

నాటే కాలం

స్వల్పకాలిక రకాలను ఈ నెల మొదటి పక్షంలోపే విత్తుకోవాలి.మొక్కలను నారుమడులలో పెంచితే సకాలం లో పంట నాటే అవకాశం ఉంటుంది.

నాటడం

పంట కాలాన్ని బట్టి నాటే దూరం మారుతుంది. ఏదైతే 75 రోజుల్లో కోతకు వచ్చే దీర్ఘకాలిక రకాలకు వరుసల మధ్య 50 సెం.మీ, మొక్కల మధ్య 45 సెం.మీ ఉండేలా నాటుకోవాలి. అలాగే స్వల్పకాలిక రకాలైతే వరుసల మధ్య 45 సెం.మీ, వరుసల్లోని మొక్కల మధ్య 30 సెం.మీ దూరం ఉండాలి.

నారుమడి

ఆరోగ్యమైన నారు కోసం విత్తనాన్ని ఆధునిక పద్ధతిలో పెంచాలి. ఇందుకు 96 కణాలు ఉండే ప్రోట్రేలలో కోకోపీట్, వర్మీ కంపోస్టు నింపుకుని నారు పెంచుకుంటే నారు ఆరోగ్యంగా పెరుగుతుంది. 20-30 రోజుల్లో నారు మొక్కలు ప్రధాన పొలంలో నాటుకోవడానికి సిద్ధంగా ఉంటాయి. ప్రధాన పొలంలో నాటుకునేటప్పుడు 60 సెం.మీ. ఉండే బోదలు తయారు చేసుకోవాలి. వాటిలో మొక్కకు మొక్కకు మధ్య 45 సెం.మీ ఉండే విధంగా మొక్కలు నాటాలి. మొక్కలు ఆరోగ్యంగా పెంచుకోవాలనుకుంటే డ్రిప్‌లైన్‌ను ఏర్పర్చుకోవాలి. డ్రిప్‌కు రెండువైపులా 50 సెం.మీ. ఉండే విధంగా, మొక్కకు, మొక్కకు మధ్య 45 సెం.మీ ఉండేలా చూసుకోవాలి. నారుమడిని ఆకుతినే పురుగు బారి నుంచి రక్షించుకునేందుకు 2.5 మి.లీ మలాథియాన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఎరువులు

ప్రధాన పొలంలో నాటుకునే 10-15 రోజుల ముందు లోతు దుక్కులు చేసుకోవాలి. దుక్కిలోనే ఎకరానికి 8-10 టన్నుల పశువుల ఎరువు వేయాలి. ఎకరానికి 60-80 కిలోల నత్రజని, 40 కిలోల భాస్వరం, 40-60కిలోల పొటాష్ కలుపుకొని ఆఖరి దుక్కిలో వేసి బాగా కలియదున్నాలి. నత్రజని ఎరువును మూడు దఫాలుగా వేయాలి. మొదటి దఫా ఆఖరి దుక్కిలో, మిగిలిన నత్రజనిని నాటిన మూడు వారాలకు వేసుకోవాలి. మొక్క నాటిని 25 రోజల నుంచి సమపాలల్లో వేయాలి. ఎరువులు వేసిన వెంటనే విడిగా నీటిని అందించాలి. సమగ్ర పోషక యాజమాన్యాన్ని చేపడితే బ్రకోలి మొక్కలు పెద్ద పరిమాణంలో ఉంటాయి.

నీటి యాజమాన్యం

నేలలో తేమ పరిస్థితిని బట్టి నీటి యాజమాన్యం పాటించాలి. ముఖ్యంగా ఈ బ్రకోలి పంట కోత యాసంగి కాలంలో వస్తుంది. కాబట్టి మేలైన నీటి యాజమాన్యాన్ని చేపట్టాలి. నల్లరేగడి నేలల్లో 10 రోజులకు ఒకసారి, అదే తేలికపాటి నేలల్లో మాత్రం వారానికి ఒక్కసారినీటిని నీటి తడిని ఇవ్వాలి. పువ్వు ఏర్పడే దశలో నీళ్లు ఎక్కువైన నీటి ఎద్దడి ఏర్పడినా పూలు సరిగ్గా రాకుండా ఉంటుంది. దీనివల్ల పువ్వు సరిగ్గా రాదు.

కలుపు నివారణ

నాటే ముందు కలుపు నివారణ కోసం ఎకరాకు ఫ్లూక్లోరాలిన్ లీటరు లేదా ఆక్సీఫ్లోరోఫిన్ 200 మి.లీ. లీటరు నీటికి కలిపి నాటే ముందురోజు పొలంలో పిచికారీ చేసుకోవాలి. పిచికారీ తర్వాత విత్తనాలు నాటాలి. నాటిన 20-25 రోజులప్పుడు అంతరకృషి చేయాలి.

ఈ సాగులో ఇతర సమస్యలు

బ్రౌనింగ్

క్షార నేలల్లో పండించే పంటలో బోరాన్ లోపం ఎక్కువగా ఉంటుంది. బోరాన్ ధాతు లోపం వల్ల పువ్వుపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడుతాయి. కాండం గుల్లగా మారి నీరు కారుతుంది. దీని నివారణకు ఆఖరి దుక్కిలో ఎకరానికి 8-10 కిలోల చొప్పున బోరాక్స్ వేయాలి. పూత ఏర్పడే దశలో అయితే డైసోడియం ఆక్టాబోరేట్, టెట్రాహైడ్రేట్‌ను లీటరు నీటికి 1.5 నుంచి 2 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కొరడా తెగులు

మాలిబ్దినం ధాతు లోపం వల్ల ఆకులు పసుపుగా మారి, అంచులు తెల్లబడుతాయి. లోపం తీవ్రంగా ఉంటే ఈనె మాత్రమే పొడవుగా పెరుగుతుంది. దీన్నే కొరడా తోక తెగులు (విప్ టేల్) అంటారు. నత్రజని మోతాదు ఎక్కువైతే మాలిబ్దినం మొక్కకు అందుబాటులో ఉండదు. అందువల్ల దీని నివారణకు సరైన మోతాదులో మాత్రమే నత్రజనిని వేయాలి. ఎకరానికి 400 గ్రాములు సోడి యం మాలిబ్డేట్ లేదా అమ్మోనియం మాలిబ్డేట్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



సస్యరక్షణ

ఆకుమచ్చ తెగులు

ఈ తెగులు సోకితే ఆకుల పైభాగాన గుండ్రని బూడిద రంగు మచ్చలు ఏర్పడుతాయి. వాతావరణంలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు పెద్దవి అయి ఆకు అంతా వ్యాపిస్తాయి. తేమతో కూడిన చల్లని వాతావరణంలో ఈ తెగులు ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు తెగులు కనిపించిన వెంటనే మాంకోజెబ్ లీటరు నీటికి 2.5 గ్రాములు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కలిపి పంటపై 10 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేయాలి.

కుళ్లు తెగులు

ఈ తెగులు నారుమడిలో, నాటిన పొలంలోనూ కనిపిస్తుంది. ఆకుల అంచులు పసుపు రంగులోకి మారుతాయి. ఈనెలు నల్లబడి కాండం కుళ్లిపోతుంది. ఒక్కొక్కసారి ఇది పువ్వులకు కూడా వ్యాపించి పూత కుళ్లిపోతుంది. దీని నివారణకు కాయ జాతి/పువ్వు జాతి పంటలతో పంట మార్పిడి చేయాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కలిపి మొక్క మొదలు చుట్టూ తడపాలి. దీనివల్ల తెగులు వ్యాప్తి కొంతవరకు అరికట్టబడుతుంది.

ఆకు తినే గొంగలి పురుగు

ఈ పురుగు సోకితే సాగులోఎక్కువ నష్టం వస్తుంది. దీని నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ లేదా క్లోరోఫైరిఫాస్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించాలి.

కోత కోయడం

నాటిన 60 రోజుల తర్వాత కోతకు వస్తాయి. పువ్వు మొత్తం ముదురు ఆకుపచ్చ రంగులోకి వచ్చిన తర్వాత మాత్రమే వాటిని కోయాలి.

దిగుబడి

రకాన్ని బట్టి ఎకరానికి 15-17 టన్నులు దిగుబడి వస్తుంది. ఈ పంట తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం పొందవచ్చు.



-కె.జ్యోతిరెడ్డి,
8019299449
రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం

విత్తనోత్పత్తి

బ్రకోలిలో రైతు తన స్థాయిలో విత్తనోత్పత్తి చేపట్టి విత్తనాన్ని సేకరించుకోవచ్చు. దీనికి కొన్ని మెళకువలు పాటించాలి. అంతకు ముందు సీజన్‌లో బ్రకోలి పంట వేయని పొలాన్ని మాత్రమే విత్తనోత్ప త్తి ఎంచుకోవాలి. రకానికి రకానికి మధ్య కనీసం 1600 మీటర్ల వేర్పా టు దూరం పాటించాలి. ఇతర రకాల మొక్కలు, తెగులు సోకిన మొక్క లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు కలు పు నివారణ చేపట్టాలి. కాయలు ఆకుపచ్చ రంగు నుంచి ముదురు మట్టి రంగులోకి మారిన దశలో కాయలను మొక్కల నుంచి వేరుచేయాలి. కాయలు చిన్నపాటి నూర్పిడికి గురిచేస్తే విత్తనాలు వేరు చేయబడు తా యి. విత్తనాలు సేకరించిన వెంటనే నీడలో తేమ పోయే వరకు ఆర బెట్టాలి. ఆ తర్వాత నిల్వ చేసుకోవాలి. ఎట్టిపరిస్థితిలో విత్తన తేమ ఏడు శాతం మించకుండా చూసుకోవాలి. ఎండిన విత్తనాలను కార్బండిజంతో విత్తనశుద్ధి చేసుకోవాలి. దీనివల్ల నిల్వలో తెగుళ్ల సమస్య తగ్గ తుంది. ఆ తర్వాత విత్తనాలను సంచుల్లో లేదా డబ్బాల్లో చల్లని ప్రదేశా ల్లో నిల్వ చేసుకోవాలి. ఈ విత్తనాన్ని ఐదేండ్ల వరకు సాగుకు వాడుకోవచ్చు.

కనీస విత్తన నాణ్యతా ధృవీకరణ ప్రమాణాలు

కనీసం మొలక	65 శాతం
జన్యు స్వచ్ఛత	98 శాతం
గరిష్ఠ విత్తన తేమ	7 శాతం
గరిష్ఠ జడ పదార్థం	2 శాతం
గరిష్ఠ కలుపు విత్తనాలు	5 కేజీలు
ఇతర మొక్కల విత్తనాలు	5 కేజీలు



-డాక్టర్ పిడిగెం సైదయ్య, శాస్త్రవేత్త, 7780509322
రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం

నువ్వుల సాగుకు సమయం

నువ్వుల గింజల్లో నూనె శాతం 45- 50 శాతం, ప్రోటీన్‌లు 25 శాతం ఉంటాయి. అంతేగాకుండా అమైనో ఆమ్లాలు సమృద్ధి ఉంటాయి. నువ్వుల నూనెను పరిశ్రమల్లో మందుల తయారీలో పూజకు, పచ్చళ్ళ తయారీకి అధికంగా వాడుతారు. నువ్వుల పంటను ఈ యాసంగిలో సాగు చేసి మంచి లాభాలను పొందవచ్చునని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త టి.యాదగిరిరెడ్డి సూచిస్తున్నారు. అదనపు సమాచారం కోసం 9440481279 నెంబర్‌ను సంప్రదించవచ్చు. నువ్వుల సాగులో అవలంబించాల్సిన యాజమాన్య పద్ధతులను గురించి ఆయన తెలిపిన వివరాలు.

నేలలు: తేమను నిలుపుకునే తేలిక నేలలు అనుకూలం. నీటిని నిలుపుకునే ఆమ్ల, క్షార గుణం కల నేలలు పనికిరావు.

నేల తయారీ: నేలను 2-4 సార్లు మెత్తగా దున్ని 2 సార్లు గుంటక తొలి చదును చేసుకోవాలి.

విత్తన మోతాదు: ఎకరాకు 2 కిలోల విత్తనం సరిపోతుంది.విత్తనానికి మూడింతల ఇసుకను కలిపి వరుసల్లో విత్తుకోవాలి.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ లేదా మాంకోజెబ్ లేదా 5 గ్రాముల ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేయాలి. దీనివల్ల విత్తనం ద్వారా సంక్రమించు రోగాలను అరికట్టచ్చు. ఆకుమచ్చ తెగులు సమస్యగా ఉన్నట్లైతే విత్తనాన్ని అగ్రిమైసిన్ 100 (0.025 శాతం) ద్రావణంలో నాటుకునే ముందు విత్తనాన్ని మందు ద్రావణంలో 30 నిమిషాలు నానబెట్టి విత్తుకోవాలి.

విత్తేదూరం: వరుసల మధ్య 30 సెం.మీ, మొక్కల మధ్య 10- 15 సెం.మీల దూరం ఉండేలా 2.5 సెం.మీ లోతులో విత్తాలి. దీంతో మొలకశాతం అధికంగా ఉండి మంచి దిగుబడులు పొందవచ్చు.

విత్తే సమయం: రాష్ట్రంలో దీన్ని యాసంగి పంటగా ఈ నెల రెండో పక్షం నుంచి ఫిబ్రవరి 15 వరకు నాటుకోవచ్చు.

అనువైన రకాలు: చందన, రాజేశ్వరి, శ్వేతాలిల్, హిమను రాష్ట్రంలో సాగు చేసుకోవచ్చు.

ఎరువుల యాజమాన్యం: పశువుల ఎరువు ఎకరాకు 2- 3 టన్నులు వేయాలి. మట్టి పరీక్ష ఆధారంగా రసాయన ఎరువులు వాడాలి. 33 కిలోల యూరియా, 75 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 13 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. నత్రజని సగభాగం, భాస్వరం, పొటాష్ ఎరువులు ఆఖరి దుక్కిలో వేసి బాగా కలియదున్నాలి. నత్రజని మిగిలిన సగభాగం విత్తిన 30 రోజుల తర్వాత కలుపుతీసి వేసుకోవాలి.

నీటి యాజమాన్యం: యాసంగిలో విత్తినప్పుడు పొటి దుక్కిలో విత్తిన వెంటనే మొదటి తడి ఇవ్వాలి. పూత, కాత, గింజకట్టు దశలో తడులు ఇవ్వాలి. విత్తిన 35- 40 రోజులలో 65- 75 వరకు నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

కలుపు నివారణ, అంతరకృషి: నువ్వుల్లో గడ్డిజాతి మొక్కల పెరుగుదల ఉంటుంది. నువ్వుల పంటను ముఖ్యంగా విత్తనం మొలకెత్తిన 15 రోజుల లోపు కుదురికి ఒక మొక్క ఉండే విధంగా పలుచన చేసుకోవాలి. విత్తిన 15 నుంచి 30 రోజులలో గొర్రుతో అంతరకృషి చేయాలి. కూలీల కొరత ఉంటే కలుపు మందులైన ఫ్లూక్లో రాలిన్ 45 శాతం విత్తేముందు ఎకరాకు లీటరు చొప్పున విత్తిన వెంటనే కానీ మరుసటి రోజుగానీ పిచికారీ చేసుకోవాలి.

సస్యరక్షణ: ఆకుముడుత, కాయ తొలుచు పురుగు నివారణకు తొలిదశలో పురుగులు ఆశించిన ఆకులను పురుగులతో సహా ఏరి నాశనం చేయాలి.పురుగు ఉధృతి అధికంగా ఉంటే ప్రొఫెనోఫాస్ 5 శాతం ఈసీ 2 మి.లీ లేదా స్పైనోసాడ్ 45 ఎస్పి 0.2 మి.లీలేదా క్వినాల్‌ఫాస్ 25 ఈసీ 2 మి.లీ. లేదా క్లోరోఫైరిఫాస్ 20 ఈసీ 2 మి.లీ.లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

కోడుఈగ: ఈ పురుగు లేత మొగ్గ, పూత దశలో ఆశించడం వల్ల మొగ్గలు, పువ్వులు కాయలుగా ఏర్పడక గింజకట్టక బొడిపెలుగా ఏర్పడుతాయి. మొగ్గ, పూత వాడి రాలిపోతుంది.

నివారణ: పురుగు ఆశించిన మొగ్గలనుచ, కాయలను పురుగుతో సహ ఏరి నాశనం చేయాలి. మొగ్గ దశలో ఢైమిథోయేట్ 30 ఈసీ, 2 మి.లీలు లేదా ఇమిడా క్లోప్రిడ్ 0.3 మి.లీలు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

గొంగళి పురుగు: తొలిదశలో ఆకులలో పత్రహరితాన్ని తిని ఆకులలో జల్లెడగా మారుస్తాయి. ఎదిగిన పురుగులు ఇతర మొక్కల పైకి విస్తరిస్తూ ఆకులను తినివేస్తాయి.



నివారణ: గుడ్లు లేదా గొంగళి పురుగులను గమనించిన వెంటనే ఆకులతో సహా తీసివేసి నాశనం చేయాలి.

దోమ: తల్లి, పిల్ల పురుగులు ఆకు అడుగుభాగంలో చేరి రసాన్ని పీల్చివేస్తాయి. ఈ దోమకాటుతో వెర్రి తెగులు వ్యాప్తి చెందుతుంది.

నివారణ: ఇమిడాక్లోప్రిడ్ 70 డబ్ల్యూ ఎస్‌ను 7.5 గ్రాములు లేదా థయోమిథాక్సిమ్ 25 డబ్ల్యూ జిను 5 గ్రాములు కిలో విత్తనానికి కలిపి శుద్ధి చేయాలి. దీంతో 25- 30 రోజల వరకు రసం పీల్చే పురుగుల నుంచి రక్షణ పొందవచ్చును. డైమిథోయేట్ 30 ఈసీ 2 మి.లీలలు లేదా ఇమిడాక్లోప్రిడ్ 17.8 ఎస్ఎల్ 0.25 మి.లీలు లేదా ఎసిటామిప్రిడ్ 20 ఎస్ సి 0.3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

తెగుళ్ళ నివారణ: కాండం, వేరు కుళ్ళు తెగులు: ఈ తెగులు కాండం,వేర్ల మీద కనిపిస్తుంది. ఎండు తెగులు సోకిన మొక్కల ఆకులు పసుపు వర్ణానికి మారుతాయి. తర్వాత ఆకుల అంచుల్లోకి ముడుచుకుని రాలిపోతాయి. కాండంపై నల్లటి చారలు ఏర్పడుతాయి. వేళ్లను చీల్చి గమనిస్తే గోధుమ రంగు చారలు కనిపిస్తాయి. వేళ్ళు పాక్షికంగా కుళ్ళిపోతాయి.

నివారణ: పంట మార్పిడి తప్పని సరిగా చేయాలి. పంట అవశేషాలను నాశనం చేయాలి. కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టన్ లేదా కార్బండిజమ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. తెగులు అధికంగా ఉంటే రిడోమిల్ ఎం. జడ్ లేదా కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఆకుమచ్చ తెగులు: మొక్క ఎదుగు దశలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు రోగం అధికంగా వ్యాపిస్తుంది. ఆకులు కాండం మీద గోధుమ రంగు మచ్చలు ఏర్పడుతాయి. ఆకులు రాలిపోతాయి.

నివారణ: తెగులు ఆశించిన పంట అవశేషాలను నాశనం చేయాలి. కిలో విత్తనాలను 2 గ్రాముల కార్బండిజమ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. పంట దశలో కార్బండిజమ్ 1 గ్రాము లేదా మాంకోజెబ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి 15 రోజల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.


బూడిద తెగులు: తొలిదశలో లేత ఆకులపై తెల్లటి బూడిద పొడి మచ్చలు ఏర్పడతాయి. వ్యాధి ఎక్కువగా ఉంటే ఆకులు రాలిపోతాయి. మొక్కలపై ఉన్న కాయలు పక్వానికి రాకముందే ఆకులు రాలిపోతాయి.

నివారణ: నీటిలో కరిగే గంధకం పొడి 3 గ్రాములు లేదా ప్రొఫికొనజోల్ 1 మి.లీ లేదా కెరాథెన్ 1 మి.లీలు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

వెర్రి తెగులు: తెగులు పూత సమయంలో ఎక్కువగా ఆశిస్తుంది. పుష్పాలన్నీ చిన్న చిన్న ఆకులుగా మారి గుబురుగా ఉండి వెర్రి తల మాదిరిగా కనిపిస్తుంది. ఈ తెగులు ముఖ్యంగా దోమల ద్వారా వ్యాప్తి చెందుతుంది.

నివారణ: ఈ తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే ఆ మొక్కలను వెంటనే పీకి తగులబెట్టాలి. నివారణకు సిఫారసు చేసిన మందులను పిచికారీ చేయాలి.

-నట్టె కోటేశ్వర్‌రావు,
గరిడేపల్లి, సూర్యాపేట జిల్లా,
9989944945



ఎనిమిదేళ్ల తర్వాత...

మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన 'ఇరువర్' సినిమాతో కథానాయికగా అరంగేట్రం చేసింది ఐశ్వర్యరాయ్. ఆ తర్వాత వీరిద్దరి కలయికలో 'గురు', 'రావన్' సినిమాలు రూపొందాయి. తాజాగా మణిరత్నం, ఐశ్వర్యరాయ్ కలయికలో నాలుగో సినిమా రాబోతున్నట్లు తెలిసింది. కల్కి కృష్ణమూర్తి రచించిన తమిళ చారిత్రక నవల 'పొన్నియన్ సెల్వం' ఆధారంగా ఓ భారీ మల్టీస్టారర్ సినిమాను తెరకెక్కించేందుకు మణిరత్నం సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాలో కథానాయికగా ఐశ్వర్యరాయ్ బచ్చన్ నటించనున్నదని తెలిసింది. ఇటీవలే మణిరత్నం ఆమెతో సంప్రదింపులు జరిపారని, అభినయానికి ప్రాధాన్యమున్న విలక్షణ పాత్ర కావడంతో ఐశ్వర్యరాయ్ ఈ సినిమాలో నటించడానికి సంసిద్ధతను వ్యక్తం చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 'రోబో' తర్వాత దాదాపు ఎనిమిదేళ్ల విరామం అనంతరం ఈ సినిమాతో తమిళ చిత్రసీమలోకి పునరాగమనం చేయనున్నది ఐశ్వర్యరాయ్. ఈ చిత్రంలో విక్రమ్ ఓ హీరోగానటించనున్నారు. ఆయనతో పాటు విజయ్‌సేతుపతి, శింబు ప్రధాన పాత్రలను పోషించనున్నట్లు తెలిసింది. మరో కీలక పాత్రలో అమితాబ్‌బచ్చన్‌ను తీసుకునే యోచనలో మణిరత్నం ఉన్నట్లు సమాచారం.